RNI NO: TEL/TEL/2009/28544

తెలంగాణ & ఆంధ్రప్రదేశ్

# పీపుల్స్ డైరీ

సమగ్ర వార్తా దినపత్రిక

విలువలతో కూడిన నిఖార్సయిన జర్నలిజం

సంపుటి : 18 | సంచిక : 174 | Vol : 18 | Issue : 174

Editor : KONDAPARTHI KIRAN
CELL : 9493019044

వరంగల్, ఆదివారం 6 సెప్టెంబర్ 2026
Warangal, Sunday 6 September 2026

పేజీలు : 08
వెల రూ : 4-00

Pages : 08
Price : 4-00

www.epaper.peoplesdairynews.com
www.peoplesdairynews.com

Published From Warangal : Circulated in Hyderabad, Rangareddy, Warangal, Khammam, Nalgonda, Medak, Karimnagar, Nizamabad & TG All Districts



WANTED

పీపుల్స్ డైరీ దినపత్రిక తెలంగాణ & ఏపీలోని వివిధ జిల్లాల్లో పనిచేయుటకు స్టాఫ్ రిపోర్టర్లు కావలెను

సంప్రదించండి

- హనుమకొండ
- కరీంనగర్
- భూపాలపల్లి
- పెద్దపల్లి/రామగుండం
- జనగామ
- మహబూబాబాద్
- హైదరాబాద్
- నిజామాబాద్


Cell : 9493019044
9618509859


## కలల కారిడార్ పూర్తి..

- కరీంనగర్-వరంగల్ హైస్పీడ్ ప్రయాణం
- త్వరలో ఎన్‌హెచ్ 563 ఫోర్‌లైన్ రహదారి అందుబాటులోకి
- 45 నిమిషాల ప్రయాణం ఆదా
- టెక్నాలజీతో హైవేపై భద్రత

పీపుల్స్‌డైరీ-వరంగల్ :

ఉత్తర తెలంగాణలో కీలక రవాణా మార్గంగా మారనున్న కరీంనగర్-వరంగల్ జాతీయ రహదారి-563 నాలుగు వరుసల విస్తరణ పనులు దాదాపు పూర్తయ్యాయి. రూ.1641 కోట్ల అంచనా వ్యయంతో చేపట్టిన ఈ 68.015 కిలోమీటర్ల ప్రాజెక్టు అందుబాటులోకి వస్తే కరీంనగర్-వరంగల్ మధ్య ప్రయాణ సమయం సుమారు 45 నిమిషాలు తగ్గే అవకాశం ఉంది. ఉత్తర తెలంగాణ ఆర్థిక, పారిశ్రామిక రంగాలకు ఈ రహదారి కీలక గ్రోత్ కారిడార్‌గా మారనుంది. మానకొండూరు బైపాస్ నుంచి (మిగతా 2లో...)



## భూసారానికి డిజిటల్ టచ్

### కొత్త టెక్నాలజీతో వేగం, ఖచ్చితత్వం

- 12 జిల్లాల్లో ఏఐ భూసార పరీక్ష ల్యాబ్‌లు
- ప్రతిపాదనలు సిద్ధం చేసిన సర్కార్

పీపుల్స్‌డైరీ-హైదరాబాద్ : తెలంగాణలో రైతులకు భూసార పరీక్షలను మరింత చేరువ చేసేందుకు ఆధునిక సాంకేతికతను వినియోగించేందుకు ప్రభుత్వం, వ్యవసాయ విశ్వవిద్యాలయం చర్యలు చేపట్టాయి. రాష్ట్రంలోని 12 జిల్లాల్లో కృత్రిమ మేధ ఏఐ ఆధారిత అధునాతన భూసార పరీక్ష ప్రయోగశాలలను ఏర్పాటు చేయాలని ఆచార్య జయశంకర్ రాష్ట్ర వ్యవసాయ విశ్వవిద్యాలయం నిర్ణయించింది. భారత రైతుల ఎరువుల సహకార సంస్థ ఆర్థిక సహకారంతో (మిగతా 2లో...)



## మంత్రివర్గ విస్తరణ ఇప్పట్లో ఉండదు...



- హైకమాండ్ నుంచి ఎలాంటి సంకేతాలు లేవు
- కొండా బర్తరఫ్ ఏఐసీసీ నిర్ణయమే...
- టీపీసీసీ చీఫ్ మహేష్‌కుమార్ గౌడ్

2వ పేజీలో..




## చెరువుపై కబ్జా నీడ...!

2వ పేజీలో..

### హుస్నాబాద్‌లో అక్రమంగా ఫంక్షన్ హాల్ నిర్మాణం?

- హైదరాబాద్‌లో కబ్జాలపై చర్యలు.. హుస్నాబాద్‌లో మాత్రం మౌనమెందుకు?
- భవిష్యత్ తరాలకు వనరులు వద్దా?
- అధికారులు సర్వే నిర్వహించాలి
- అక్రమమని తేలితే తొలగించాలి
- డిమాండ్ చేస్తున్న పట్టణవాసులు...

నీటితో నిండాల్సిన చోట, నిర్మాణాలు మొలుస్తున్నాయి... చేపలు ఈదాల్సిన చోట కాంక్రీట్ గోడలు లేస్తున్నాయి... పక్షులు వాలాల్సిన గట్టుపై ఫంక్షన్ హాళ్ల సందడి వినిపిస్తోంది... చెరువు శిఖం ప్రశ్నిస్తోంది నా హద్దులు ఎందుకు చెరిపేస్తున్నారని...

రెవెన్యూ రికార్డులు తెరవండి... మున్సిపల్ అనుమతులు చూడండి... ఇరిగేషన్ మ్యాపులు పరిశీలించండి... ఎఫ్‌టీఎల్ హద్దులు కొలవండి... నిజం ఏదైనా సరే.. ప్రజల ముందు పెట్టండి!

పీపుల్స్‌డైరీ, నిఘా టీం (హుస్నాబాద్) :



## దేశంలోనే అతిపెద్ద ఏఐ డేటా సెంటర్

పీపుల్స్‌డైరీ-హైదరాబాద్ : దేశంలోనే అతిపెద్ద ఏఐ డేటా కేంద్రం హైదరాబాద్ నగరంలో ఏర్పాటుకు సంబంధించిన కీలక ముందడుగు పడింది. టీసీఎస్ హైపర్‌వాల్ట్, తెలంగాణ ప్రభుత్వం మధ్య ఒప్పందం జరిగింది. సచివాలయంలో ఈ మేరకు ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి సమక్షంలో హైపర్‌వాల్ట్, ప్రభుత్వ ప్రతినిధులు ఒప్పంద పత్రాలపై సంతకాలు చేశారు. మొత్తం 250 ఎకరాలకు పైగా విస్తీర్ణంలో డేటా సెంటర్ ఏర్పాటు కానుంది. 1 గిగా వాట్ సామర్థ్యంతో ఏఐ డేటా సెంటర్ కోసం రూ.70 వేల కోట్ల పెట్టుబడులు (మిగతా 2లో...)



- రూ.70 వేల కోట్లతో హైదరాబాద్‌లో ఏర్పాటు
- ఒప్పంద పత్రాలపై సంతకాలు...
- నా కల నిజమైంది : ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి



## ఫిర్యాదు అందుతేనే నిద్రలేస్తాం..


2వ పేజీలో..

- ఇదీ భద్రాచలం ఆర్టీవో అధికారుల తీరు
- మౌఖిక సమాచారానికి విలువ లేదా..!
- అప్పటిదాకా ఉల్లంఘనులు రోడ్లపైనే ఉంటారా...
- ఫిర్యాదు పెట్టితేనే ఫీల్డ్‌కు వెళ్లి తనిఖీలు చేస్తారా?
- ఏసమాచారం ఇచ్చినా రాతపూర్వక ఫిర్యాదు కోరుతున్న భద్రాచలం ఆర్టీవో కార్యాలయం

పీపుల్స్‌డైరీ-మణుగూరు







## చదువులు సాగేదెలా?

పీపుల్స్‌డైరీ-వినపాక

2లో

ఉపాధ్యాయులపై అదనపు పనిభారం

- విద్యకు విఘ్నంగా పనులు
- చదువుకు దూరమవుతున్న పిల్లలు
- బోధనకు దొరకని సమయం?
- బోధనేతర పనులతో ఉపాధ్యాయులు సతమతం
- యాప్‌లు, ఆన్‌లైన్ ఎంట్రీలు, సర్వేలు, రికార్డులతోనే సహవాసం

# చెరువుపై కబ్జా నీడ...

- హుస్నాబాద్‌లో అక్రమంగా ఫంక్షన్ హాల్ నిర్మాణం?
- హైదరాబాద్‌లో కబ్జాలపై చర్యలు.. హుస్నాబాద్‌లో మాత్రం మౌనమెందుకు?
- భవిష్యత్ తరాలకు వనరులు వద్దా?
- అధికారులు సర్వే నిర్వహించాలి
- అక్రమమని తేలితే తొలగించాలి
- డిమాండ్ చేస్తున్న పట్టణవాసులు...

**పీపుల్స్‌డైరీ, నిఘా టీం (హుస్నాబాద్) :**

హుస్నాబాద్ పట్టణంలో చెరువులు, కుంటలు ఆక్రమణలకు గురవుతున్నాయనే ఆరోపణలు తీవ్ర చర్చకు దారితీస్తున్నాయి. చెరువు శిఖం భూములను ఆక్రమించి నిర్మాణాలు చేపట్టినట్లు స్థానికులు ఆరోపిస్తున్నప్పటికీ సంబంధిత అధికారులు ఎందుకు చర్యలు తీసుకోవడం లేదనే ప్రశ్నలు వినిపిస్తున్నాయి.

ముఖ్యంగా చెరువు పరిధిలోనే ఫంక్షన్ హాల్ నిర్మాణం జరిగిందనే ఆరోపణలు ఉండటంతో ఈ వ్యవహారంపై సమగ్ర విచారణ జరపాలని స్థానికులు కోరుతున్నారు. చెరువు భూమి ఎంత? నిర్మాణం జరిగిన స్థలం ఏ సర్వే నంబర్‌లో ఉంది? ఆ భూమి వాస్తవంగా ప్రైవేటు భూమా, లేక చెరువు శిఖం/ఎఫ్‌టీఎల్ పరిధిలోకి వస్తుందా? నిర్మాణానికి మున్సిపల్ అనుమతులు ఉన్నాయా? అనే అంశాలపై అధికారులు స్పష్టత ఇవ్వాల్సిన అవసరం ఉంది.



హైదరాబాద్‌లో చెరువులు, నాలాల ఆక్రమణలపై ప్రభుత్వం, హైడ్రా చర్యలు తీసుకుంటున్న నేపథ్యంలో అదే తరహాలో హుస్నాబాద్‌లో కూడా చెరువుల పరిరక్షణపై చర్యలు ఎందుకు కనిపించడం లేదని ప్రజలు ప్రశ్నిస్తున్నారు. హుస్నాబాద్ నియోజకవర్గ అభివృద్ధిపై ప్రభుత్వం ప్రత్యేకంగా దృష్టి సారిస్తోందని మంత్రి పొన్నం ప్రభాకర్ గతంలో పేర్కొన్నారు. ఎల్లమ్మ చెరువు అభివృద్ధి వంటి కార్యక్రమాలను కూడా ప్రస్తావించారు.

**మంత్రి దృష్టికి తీసుకెళ్లినా చర్యలు లేవా?**

నియోజకవర్గానికి మంత్రి ప్రాతినిధ్యం వహిస్తున్న నేపథ్యంలో చెరువుల ఆక్రమణల ఆరోపణలపై ఆయన ప్రత్యేక దృష్టి సారించాలని స్థానికులు కోరుతున్నారు. "హైదరాబాద్‌లో చెరువుల ఆక్రమణలపై ప్రభుత్వం చర్యలు తీసుకుంటుంటే.. హుస్నాబాద్‌లో మాత్రం ఎందుకు పట్టించుకోవడం లేదు?" అని ప్రశ్నిస్తున్నారు.

చెరువు భూముల పరిరక్షణ విషయంలో రాజకీయ ఒత్తిళ్లకు తావులేకుండా రెవెన్యూ, మున్సిపల్, ఇరిగేషన్ శాఖల అధికారులు సంయుక్తంగా సర్వే నిర్వహించి వాస్తవాలను ప్రజల ముందు ఉంచాలని డిమాండ్ చేస్తున్నారు. చెరువు భూమి ఆక్రమణ నిజమైతే వెంటనే నిర్మాణాలను తొలగించి చెరువును కాపాడాలని, ఆరోపణలు తప్పని తేలితే అధికారిక రికార్డులతో ప్రజలకు స్పష్టత ఇవ్వాలని స్థానికులు కోరుతున్నారు.

ఇప్పటికైనా జిల్లా ఉన్నతాధికారులు స్పందించి హుస్నాబాద్‌లోని చెరువులు, కుంటలు, ఎఫ్‌టీఎల్ పరిధిపై సమగ్ర సర్వే నిర్వహిస్తారా? లేక ఆక్రమణ ఆరోపణలు ఇలాగే కొనసాగుతాయా? అనేది వేచి చూడాలి.

# ఫిర్యాదు అందితేనే నిద్ర లేస్తాం...

- ఇదీ భద్రాచలం ఆర్టీవో అధికారుల తీరు
- మౌఖిక సమాచారానికి విలువ లేదా..!
- అప్పటిదాకా ఉల్లంఘనులు రోడ్లపైనే ఉంటారా...
- ఫిర్యాదు పెట్టితేనే ఫీల్డ్‌కు వెళ్లి తనిఖీలు చేస్తారా?
- ఏసమాచారం ఇచ్చినా రాతపూర్వక ఫిర్యాదు కోరుతున్న భద్రాచలం ఆర్టీవో కార్యాలయం

**మణుగూరు సెప్టెంబర్ 5 ( పీపుల్స్ డైరీ )**

రవాణా నిబంధనల ఉల్లంఘనపై అధికారుల దృష్టికి సమాచారం తీసుకెళ్లినా.. ముందుగా రాతపూర్వకంగా ఫిర్యాదు ఇవ్వాలని, ఆ తర్వాతే తనిఖీకి వస్తామని చెప్పడం భద్రాచలం ఆర్టీవో కార్యాలయ తీరుపై ప్రశ్నలు లేవనెత్తుతోంది. వాహనాల ఓవర్‌లోడింగ్, అనుమతుల ఉల్లంఘన, ఫిట్‌నెస్, పర్మిట్లు, రోడ్డు భద్రత వంటి అంశాల్లో అక్రమాలు జరుగుతున్నాయనే సమాచారం అధికారుల దృష్టికి వచ్చినప్పుడు.. ఆ సమాచారాన్ని పరిశీలించేందుకు ఫిర్యాదు తప్పనిసరి అనే పరిస్థితి ఎందుకు? అన్న ప్రశ్న ఇప్పుడు ప్రజల్లో వినిపిస్తోంది.

ఇటీవల ఒక సమస్యపై ఆర్టీవో అధికారిని నేరుగా కలిసి వివరించగా.. "ముందుగా కంప్లైంట్ రాసి ఇవ్వండి.. ఆ తర్వాత ఇన్‌స్పెక్షన్ కోసం వస్తాం" అని సూచించినట్లు తెలుస్తోంది. దీంతో అసలు ప్రశ్న అధికారుల బాధ్యతపైనే నిలుస్తోంది.

**సమాచారం ఇచ్చినా.. చర్యకు ఫిర్యాదు తప్పనిసరా?**

ప్రజలు అధికారులకు సమాచారం అందించడం అంటే సమస్యను వారి దృష్టికి తీసుకెళ్లడమే. అలాంటి సమాచారాన్ని ప్రాథమికంగా పరిశీలించుకుని వాస్తవ పరిస్థితిని తెలుసుకోవాల్సిన బాధ్యత సంబంధిత అధికారులపై లేదా? లేక రాతపూర్వక ఫిర్యాదు అందే వరకు ఫీల్డ్‌లో తనిఖీలు నిర్వహించరా? అన్నది అధికారులు స్పష్టం చేయాలి. ప్రత్యేకంగా రోడ్డు భద్రతకు సంబంధించిన అంశాల్లో ఆలస్యం కూడా ప్రమాదాలకు దారితీసే అవకాశం ఉంటుంది. ఓవర్‌లోడింగ్ వంటి అంశాల్లో వాహనం రోడ్డుపై తిరుగుతున్న సమయంలోనే తనిఖీ జరిగితే వాస్తవ పరిస్థితి బయటపడే అవకాశం ఉంటుంది. ఫిర్యాదు కోసం వేచి చూసేలోపు సంబంధిత వాహనాలు అక్కడి నుంచి వెళ్లిపోతే.. తనిఖీ ప్రయోజనం ఏమిటన్నది మరో ప్రశ్న.

**భద్రాచలంలో తనిఖీలకు అధికారుల ప్రణాళిక ఏమిటి?**

భద్రాచలం పరిధిలో రవాణా నిబంధనల అమలుపై అధికారులు ఎలాంటి తనిఖీలు నిర్వహిస్తున్నారు? ఎన్ని వాహనాలను తనిఖీ చేశారు? ఓవర్‌లోడింగ్‌పై ఎన్ని కేసులు నమోదు చేశారు? ఎంత మొత్తంలో జరిమానాలు విధించారు? నిబంధనలు ఉల్లంఘించిన వాహనాలపై ఎలాంటి చర్యలు తీసుకున్నారు? వంటి వివరాలను రవాణాశాఖ వెల్లడించాల్సిన అవసరం ఉంది. ప్రజలు ఫిర్యాదు చేస్తేనే అధికారులు కదులుతారా? లేక అధికారులకున్న తనిఖీ అధికారాలతో స్వయంగా కూడా నిఘా, తనిఖీలు నిర్వహిస్తారా? అన్నది భద్రాచలం ప్రజలకు తెలియాల్సిన విషయం.

**ఉన్నతాధికారులు స్పందించాలి**

ప్రజల నుంచి వచ్చే సమాచారాన్ని స్వీకరించే విధానం ఏమిటి? మౌఖికంగా అందిన సమాచారంపై ప్రాథమిక పరిశీలన చేయవచ్చా? రాతపూర్వక ఫిర్యాదు తప్పనిసరా? ఫిర్యాదు అందిన తర్వాత ఎంత వ్యవధిలో తనిఖీ నిర్వహిస్తారు? అనే అంశాలపై జిల్లా రవాణాశాఖ ఉన్నతాధికారులు స్పష్టత ఇవ్వాలని ప్రజలు కోరుతున్నారు.

ఫిర్యాదు పెట్టినప్పుడే ఫీల్డ్‌కు కదలిక వస్తుందా? లేక నిబంధనల ఉల్లంఘనపై అధికారులు స్వయంగా కూడా తనిఖీలు నిర్వహిస్తారా? ఈ ప్రశ్నలకు భద్రాచలం ఆర్టీవో అధికారులు సమాధానం చెప్పాల్సిన అవసరం ఉంది.

# కలల కారిడార్ పూర్తి

(మొదటి పేజీ తరువాయి)

ప్రారంభమయ్యే ఈ రహదారి హనుమకొండ సమీపంలోని పలవెల్పుల వరకు కొనసాగుతుంది. మానకొండూరు, శంకరపట్నం, హుజూరాబాద్, ఎల్కతుర్తి, హసన్‌పర్తి తదితర ప్రాంతాలను కలుపుతూ సాగుతుంది. గతంలో రెండు వరుసల రహదారి మాత్రమే ఉండటంతో వాహనాల రద్దీ, ఓవర్‌టేకింగ్ సమస్యలు, ప్రయాణ సమయం పెరగడం వంటి ఇబ్బందులు ఎదురయ్యేవి. నాలుగు వరుసలుగా అభివృద్ధి చేయడంతో ఈ సమస్యలకు పరిష్కారం లభించనుంది.

కొత్త రహదారిపై ప్రయాణికుల భద్రతకు అడ్వాన్స్‌డ్ ట్రాఫిక్ మేనేజ్‌మెంట్ సిస్టమ్‌ను ఏర్పాటు చేస్తున్నారు. ప్రతి రెండు కిలోమీటర్లకు ఒకటి చొప్పున 360 డిగ్రీల కెమెరాలను అమర్చి కేంద్ర నిఘా కేంద్రం నుంచి రహదారిపై ట్రాఫిక్‌ను నిరంతరం పర్యవేక్షిస్తారు. ప్రమాదాలు, వాహనాల నిలిచిపోవడం లేదా ట్రాఫిక్ జామ్ వంటి పరిస్థితులు ఏర్పడితే వేరియబుల్ మెసేజ్ సైన్స్ డిజిటల్ బోర్డుల ద్వారా ప్రయాణికులకు ముందస్తు హెచ్చరికలు అందించనున్నారు. అత్యవసర పరిస్థితుల్లో స్పందించేందుకు 1033 హెల్ప్‌లైన్‌తోపాటు రూట్ పెట్రోలింగ్ వాహనాలు, అంబులెన్సులు, క్రేన్లు అందుబాటులో ఉంటాయి. దీంతో ప్రమాదం జరిగినప్పుడు సహాయక చర్యలను వేగంగా చేపట్టే అవకాశం ఉంటుంది.

రహదారి అభివృద్ధిలో పర్యావరణ పరిరక్షణకు కూడా ప్రత్యేక ప్రాధాన్యం ఇచ్చారు. వర్షపు నీటిని భూమిలోకి ఇంకేలా 25 ప్రాంతాల్లో భూగర్భ జలాల పునరుద్ధరణ నిర్మాణాలు చేపట్టారు. రహదారి మధ్య భాగంతోపాటు ఇరువైపులా మొక్కలు నాటుతున్నారు. వాటి సంరక్షణ కోసం అవసరమైన చోట్ల నీటి ట్యాంకర్లను ఏర్పాటు చేశారు. కరీంనగర్ గ్రానైట్ పరిశ్రమను హనుమకొండలోని కాకతీయ మెగా టెక్స్‌టైల్ పార్కుతో అనుసంధానించడంలో ఈ రహదారి కీలకంగా మారనుంది. సరకు రవాణా వేగవంతం కావడంతో పారిశ్రామిక కార్యకలాపాలు, వ్యవసాయ ఉత్పత్తుల రవాణాకు ప్రయోజనం కలగనుంది. తొమ్మిది భారీ వంతెనలు, 23 చిన్న వంతెనలు, ఐదు బైపాస్‌లు, 25 అండర్‌పాస్‌లు నిర్మించారు. మానకొండూరు బైపాస్ వద్ద 560 మీటర్ల పొడవైన వంతెన ప్రాజెక్టులో ప్రత్యేక ఆకర్షణగా నిలవనుంది. ఒక ఆర్వోబీ, ఒక ఆర్‌యూబీని కూడా నిర్మించారు.

# భూసారానికి డిజిటల్ టచ్..

(మొదటి పేజీ తరువాయి)

ఈ ల్యాబ్‌లను ఏర్పాటు చేయనున్నారు. ఎల్‌నినో సహా వాతావరణ మార్పుల ప్రభావంతో పంటల సాగు విధానాల్లో మార్పులు అవసరమవుతున్న నేపథ్యంలో భూమి స్వభావం, పోషక విలువలకు అనుగుణంగా పంటలను ప్రోత్సహించాలని ప్రభుత్వం భావిస్తోంది. ఇందులో భాగంగా ప్రతి రైతుకు భూసార పరీక్ష సౌకర్యం అందుబాటులో ఉండేలా చర్యలు తీసుకోవాలని నిర్ణయించింది. ఈ కార్యక్రమంలో భాగస్వాములు కావాలని రాష్ట్రంలోని వ్యవసాయ విశ్వవిద్యాలయాలు, ఇతర విద్యా సంస్థలకు సూచించింది.

ఈ నేపథ్యంలో ఆచార్య జయశంకర్ రాష్ట్ర వ్యవసాయ విశ్వవిద్యాలయం ఆయా జిల్లాల్లోని రైతు విజ్ఞాన కేంద్రాల్లో ఆధునిక భూసార పరీక్ష ప్రయోగశాలలను ఏర్పాటు చేసేందుకు ప్రతిపాదనలు సిద్ధం చేసింది. వర్సిటీ వైస్ ఛాన్సలర్ అల్దాస్ జానయ్య ఇఫ్కో సహకారం కోరగా సంస్థ సానుకూలంగా స్పందించింది. ల్యాబ్‌ల ఏర్పాటుకు ఆర్థిక సాయం అందించేందుకు అంగీకరిస్తూ ఇఫ్కో తెలంగాణ స్టేట్ మార్కెటింగ్ మేనేజర్ సంబంధిత లేఖను వీసీకి అందజేశారు. ఈ ప్రయోగశాలలను జయశంకర్ భూపాలపల్లి, హనుమకొండ, జోగులాంబ గద్వాల, మెదక్, సిరిసిల్ల, వనపర్తి, సూర్యాపేట, పెద్దపల్లి, జగిత్యాల, ములుగు, నారాయణపేట, వికారాబాద్ జిల్లాల్లో ఏర్పాటు చేయనున్నారు. ఒక్కో ప్రయోగశాల ఏర్పాటుకు సుమారు రూ.3.50 లక్షలు ఖర్చు చేయనున్నారు. ఈ ల్యాబ్‌లలో డిజిటల్ సాయిల్ టెస్టింగ్ సదుపాయాలను అందుబాటులోకి తీసుకురానున్నారు.

ప్రతి ప్రయోగశాల నెలకు సుమారు 2 వేల భూసార నమూనాలను పరీక్షించి ఫలితాలను అందించే సామర్థ్యంతో పనిచేయనుంది. ఇందుకోసం డిజిటల్ పరికరాలతోపాటు డిస్టిల్డ్ వాటర్ యూనిట్లు, డిజిటల్ తూనిక యంత్రాలను ఏర్పాటు చేయనున్నారు. సాంకేతికత ఆధారంగా నమూనాలను వేగంగా విశ్లేషించి రైతులకు అవసరమైన సమాచారం అందించడమే ఈ కేంద్రాల ప్రధాన లక్ష్యం.

# ఉత్తమ ఫిజికల్ డైరెక్టర్ సృజనకు ఘన సన్మానం

**పీపుల్స్‌డైరీ-వరంగల్ :** ఉత్తమ ఉపాధ్యాయురాలుగా (ఫిజికల్ డైరెక్టర్) ఎంపికైన అంకేశ్వరపు సృజనను మండల విద్యాశాఖ అధికారి వెంకటయ్య, గెజిటెడ్ హెడ్మాస్టర్లు జి. ప్రభాకర్, పూసారం, ఇందిర, శ్రీనివాస్, రఫిక్ అహ్మద్, ప్రైమరీ ప్రధానోపాధ్యాయులు తాళ్లపెల్లి ప్రకాష్ గౌడ్‌లు ఘనంగా సత్కరించారు. ఖిలా వరంగల్ మండలంలోని ప్రభుత్వ ఉన్నత పాఠశాల శంభునిపేటలో ఉత్తమ ఉపాధ్యాయ అవార్డుల ప్రధానోత్సవం శనివారం జరిగింది. ప్రభుత్వ ఉన్నత పాఠశాల రైల్వే గేట్ లో ఫిజికల్ డైరెక్టర్ గా విధులు నిర్వర్తిస్తున్న ఏ సృజన ఉత్తమ ఉపాధ్యాయురాలుగా ఎంపికయ్యారు. ఈ సందర్భంగా మండల విద్యాధికారి వెంకటయ్య, ప్రధానోపాధ్యాయులు జి. ప్రభాకర్, పూసారామ్, ఇందిర, సాఫ్ట్ బాల్ అసోసియేషన్ హనుమకొండ జిల్లా ఉపాధ్యక్షులు పెరుమాండ్ల సాంబమూర్తి మాట్లాడుతూ.. సాఫ్ట్ బాల్ క్రీడలో జాతీయ స్థాయిలో రాణించిన క్రీడాకారిణిగా పలు పతకాలు పొంది.. వ్యాయామ ఉపాధ్యాయురాలిగా నియమితురాలైనప్పటి నుంచి పలు పాఠశాలల విద్యార్థులను జిల్లా, రాష్ట్ర, జాతీయ స్థాయిలో రాణించేలా శిక్షణ ఇచ్చిన సృజన ఉత్తమ ఉపాధ్యాయురాలిగా ఎంపికవడం అభినందనీయమని కొనియాడారు.



# అభ్యాస హై స్కూల్‌లో ఘనంగా ఉపాధ్యాయ దినోత్సవం



**వరంగల్ సెప్టెంబర్ 5 (పీపుల్స్‌డైరీ) :** జాతీయ స్థాయి ఉపాధ్యాయ దినోత్సవం సందర్భంగా స్థానిక 43 వ డివిజన్ గణేష్ నగర్ లోని అభ్యాస హై స్కూల్ లో గురుపూజోత్సవాన్ని ఘనంగా నిర్వహించారు. పాఠశాల డైరెక్టర్ మీర్జా అఖిల్ ఉల్లా బెగ్ డాక్టర్ సర్వేపల్లి రాధాకృష్ణ చిత్రపటానికి పూలమాల అలంకరించి గురుపూజోత్సవాన్ని ప్రారంభించి విద్యార్థులను ఉద్దేశించి వారు మాట్లాడుతూ ప్రతీ ఉపాధ్యాయుడు వెలుగుతున్న కొవ్వత్తి లాంటివారని సమాజానికి కావలసిన ప్రతి వ్యక్తిని మంచి మనసుతో తీర్చిదిద్దగల గొప్ప మనసున్న మహారాజులు ఉపాధ్యాయులు అని అన్నారు. ప్రిన్సిపాల్ మండల శిరీష , ఇంచార్జ్ కోల రాము సార్, చీకటి సమ్మయ్య తదితరులు మాట్లాడుతూ ఉపాధ్యాయ వృత్తి పవిత్రమైనదని దానిని విద్యార్థులకు మంచి నైతిక విలువలను అందించి నప్పుడే ఆ వృత్తికి విలువ అని అన్నారు. ఈ కార్యక్రమంలో టీచర్స్ గా యాక్ట్ చేసిన విద్యార్థులను ఉపాధ్యాయ బృందం అభినందించారు.

# చదువులు సాగేదెలా...

- ఉపాధ్యాయులపై అనవసర పనిభారం
- విద్యకు విఘ్నంగా పనులు
- చదువుకు దూరమవుతున్న పిల్లలు
- బోధనకు దొరకని సమయం?
- బోధనేతర పనులతో ఉపాధ్యాయులు సతమతం
- యాప్‌లు, ఆన్‌లైన్ ఎంట్రీలు, సర్వేలు, రికార్డులతోనే సహవాసం

**పీపుల్స్‌డైరీ-పినపాక :** ప్రభుత్వ పాఠశాలల్లో విద్యాబోధన కంటే బోధనేతర పనులే అధికమవుతున్నాయనే ఆందోళన వ్యక్తమవుతోంది. విద్యార్థులకు పాఠాలు చెప్పాల్సిన ఉపాధ్యాయులు ఉదయం నుంచి సాయంత్రం వరకు యాప్‌లు, ఆన్‌లైన్ ఎంట్రీలు, వివిధ రకాల సర్వేలు, మధ్యాహ్న భోజనానికి సంబంధించిన లెక్కలు, రికార్డుల నిర్వహణ వంటి పనులతోనే బిజీగా ఉంటున్నారనే విమర్శలు వినిపిస్తున్నాయి. దీంతో తరగతి గదిలో విద్యార్థులకు పూర్తిస్థాయిలో బోధించేందుకు అవసరమైన సమయం, ఏకాగ్రత రెండూ తగ్గిపోతున్నాయని ఉపాధ్యాయులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు.

ప్రస్తుతం ప్రభుత్వ పాఠశాలల్లో విద్యా కార్యక్రమాలతోపాటు అనేక రకాల పరిపాలనా, సమాచార సేకరణ పనులు ఉపాధ్యాయులపై పడుతున్నాయి. వివిధ యాప్‌లలో వివరాల నమోదు, ఆన్‌లైన్ డేటా ఎంట్రీలు, విద్యార్థుల వివరాల అప్‌డేట్, సర్వేలు, నివేదికల తయారీ, రికార్డుల నిర్వహణ తదితర పనులు నిత్యకృత్యంగా మారుతున్నాయని ఉపాధ్యాయులు చెబుతున్నారు. పాఠశాల స్థాయిలో సేకరించాల్సిన ప్రతి సమాచారానికి ఆన్‌లైన్ ఎంట్రీ తప్పనిసరి కావడంతో బోధన సమయం గణనీయంగా తగ్గుతోందని పేర్కొంటున్నారు.

**తరగతి గదికి దూరంగా..**

ఉపాధ్యాయుడి ప్రధాన బాధ్యత విద్యార్థులకు నాణ్యమైన విద్యను అందించడం. అయితే బోధనతో సంబంధం లేని పనుల ఒత్తిడి పెరగడంతో తరగతి గదిలో విద్యార్థులతో గడపాల్సిన సమయం తగ్గిపోతోందనే ఆందోళన వ్యక్తమవుతోంది. పాఠ్యాంశాలను పూర్తిచేయడం, విద్యార్థుల సందేహాలను నివృత్తి చేయడం, వెనుకబడిన విద్యార్థులపై ప్రత్యేక శ్రద్ధ చూపడం, అభ్యాస ఫలితాలను మెరుగుపరచడం వంటి కీలక అంశాలకు తగినంత సమయం కేటాయించలేకపోతున్నామని పలువురు ఉపాధ్యాయులు వాపోతున్నారు.

**మధ్యాహ్న భోజనం.. మరో బాధ్యత**

పాఠశాలల్లో మధ్యాహ్న భోజన కార్యక్రమానికి సంబంధించిన లెక్కలు, హాజరు వివరాలు, స్టాక్ నిర్వహణ, వివిధ రికార్డులు కూడా ఉపాధ్యాయుల బాధ్యతల్లో భాగమవుతున్నాయి. విద్యార్థుల భోజన ఏర్పాట్లను పర్యవేక్షించడంతోపాటు వాటికి సంబంధించిన వివరాలను నమోదు చేయాల్సి రావడంతో బోధనపై ప్రభావం పడుతోందనే అభిప్రాయాలు వ్యక్తమవుతున్నాయి. ఒకవైపు తరగతి గదిలో విద్యార్థులు ఉండగా, మరోవైపు ఆన్‌లైన్ పనులు, రికార్డులు పూర్తి చేయాల్సిన పరిస్థితి నెలకొంటోందని ఉపాధ్యాయులు అంటున్నారు.

**నష్టపోతున్నది విద్యార్థులే**

ఉపాధ్యాయులపై బోధనేతర పనుల భారం పెరగడం చివరకు విద్యార్థుల చదువుపైనే ప్రభావం చూపుతుందని తల్లిదండ్రులు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. ముఖ్యంగా ప్రభుత్వ పాఠశాలలపై ఆధారపడే పేద, మధ్యతరగతి కుటుంబాల పిల్లలకు పాఠశాలలో లభించే బోధనే ప్రధాన ఆధారం. తరగతి గదిలో ఉపాధ్యాయుడి సమయం తగ్గితే దాని ప్రభావం నేరుగా విద్యార్థుల అభ్యసన సామర్థ్యంపై పడే అవకాశం ఉందని తల్లిదండ్రులు చెబుతున్నారు.

**బోధనకే పరిమితం చేయాలి**

ఉపాధ్యాయుల పనిభారాన్ని సమీక్షించి, వారికి సాధ్యమైనంత వరకు బోధనేతర పనుల నుంచి మినహాయింపు ఇవ్వాలని తల్లిదండ్రులు, విద్యావేత్తలు కోరుతున్నారు. ఆన్‌లైన్ ఎంట్రీలు, డేటా నిర్వహణ, సర్వేలు, ఇతర పరిపాలనా పనులకు ప్రత్యేక సిబ్బందిని ఏర్పాటు చేస్తే ఉపాధ్యాయులు పూర్తిస్థాయిలో విద్యాబోధనపై దృష్టి సారించే అవకాశం ఉంటుందని సూచిస్తున్నారు.

# దేశంలోనే అతిపెద్ద ఏఐ డేటా సెంటర్

(మొదటి పేజీ తరువాయి)

పెట్టనుంది. దీని ద్వారా ప్రత్యక్షంగా, పరోక్షంగా దాదాపు 7 వేల మంది ఉద్యోగవకాశాలు లభిస్తాయి. ఒప్పందంపై సంతకాల అనంతరం సీఎం రేవంత్ రెడ్డి మాట్లాడుతూ.. టాటా ప్రాజెక్టుతో బ్లూ కాలర్ ఉద్యోగాలు పెరుగుతాయని, అందుకే స్కిల్ యూనివర్సిటీని ఏర్పాటు చేశామని పేర్కొన్నారు. ఈ ప్రాజెక్టుతో తన కల నిజమైందని సీఎం ఉద్ఘాటించారు. ఇంత పెద్ద మొత్తం పెట్టుబడి రాష్ట్రానికి రావడం సంతోషంగా ఉందని ఆయన అన్నారు. తెలంగాణకు ఇది గొప్ప శుభవార్త అని వ్యాఖ్యానించారు. దావోస్ సదస్సులో టాటా సన్స్ ఛైర్మన్ చంద్రశేఖరన్‌ను కలిసి పెట్టుబడులు పెట్టాలని కోరామని రేవంత్ తెలిపారు. టాటా, టీసీఎస్ , హైపర్ వాల్ట్ సంయుక్తంగా రూ.70 వేల కోట్ల భారీ పెట్టుబడి పెడుతున్నాయని వెల్లడించారు.

ఏఐ డేటా సెంటర్ ద్వారా 7 వేల మందికి ఉద్యోగాలు వస్తాయని సీఎం చెప్పారు. కొంగరకలాన్ ఫ్యూచర్ సిటీకి త్వరలోనే రేడియల్ రహదారి వేసి, దానిని భారతరత్న రతన్ టాటాకు అంకితం చేస్తామని సీఎం స్పష్టం చేశారు. తెలంగాణ రైజింగ్ గ్లోబల్ సమ్మిట్‌లో ప్రకటించిన లక్ష్యాలకు అనుగుణంగా తాము పనిచేస్తున్నామని రేవంత్ రెడ్డి అన్నారు. 2037 నాటికి ఒక ట్రిలియన్ డాలర్ల ఆర్థిక వ్యవస్థే లక్ష్యమని ఆయన ఉద్ఘాటించారు. 2047 నాటికి మూడు ట్రిలియన్ డాలర్ల ఎకానమీ దిశగా పనిచేస్తున్నామని సీఎం వివరించారు.

# మంత్రివర్గ విస్తరణ ఇప్పట్లో ఉండదు...

- హైకమాండ్ నుంచి ఎలాంటి సంకేతాలు లేవు
- కొండా బర్తరఫ్ ఏఐసీసీ నిర్ణయమే...
- టీపీసీసీ చీఫ్ మహేష్‌కుమార్ గౌడ్

**పీపుల్స్‌డైరీ-హైదరాబాద్ :** ఇప్పట్లో మంత్రివర్గ విస్తరణ లేనట్లే అని టీపీసీసీ చీఫ్ మహేష్‌కుమార్ గౌడ్ స్పష్టం చేశారు. మీడియాతో నిర్వహించిన చిట్‌చాట్‌లో ఆయన మాట్లాడారు. ఢిల్లీలో క్యాబినెట్ విస్తరణపై చర్చ జగలేదన్నారు. కేవలం కొండా సురేఖ, చిన్నారెడ్డి అంశంపైనే చర్చ జరిగినట్లు చెప్పుకొచ్చారు. క్యాబినెట్ విస్తరణపై హైకమాండ్ నుంచి ఎలాంటి సమాచారం లేదని తెలిపారు. క్యాబినెట్ విస్తరణ ఎప్పుడు చేయాలనేది సీఎం రేవంత్ రెడ్డి ఇష్టమన్నారు. 'నాకు మంత్రి పదవి అన్న ప్రచారంపై సమాచారం లేదు' అని వెల్లడించారు. ఏఐసీసీ అగ్రనేత రాహుల్ గాంధీ ఆశయాన్ని రేవంత్ నెరవేర్చారని టీపీసీసీ చీఫ్ అన్నారు. కుల సర్వే శాస్త్రీయంగా చేశామని తెలిపారు. రాబోయే వంద రోజులు దేశ వ్యాప్తంగా బీసీ హక్కుల గర్జన చేస్తామన్నారు. బీసీ హక్కుల కోసం జరిగే గర్జనను విజయవంతం చేయాలని మహేశ్ గౌడ్ పేర్కొన్నారు.

కాగా.. కొండా సురేఖ ఎపిసోడ్‌లో ఏఐసీసీ వద్ద చోటు చేసుకున్న పరిణామాలను టీపీసీసీ చీఫ్ మహేష్ కుమార్ గౌడ్ వెల్లడించారు. సురేఖను కాపాడేందుకు తీవ్రంగా ప్రయత్నించామని తెలిపారు. సురేఖ విషయంలో అందరం తమ వంతు ప్రయత్నం చేసినట్లు చెప్పారు. కొండా సురేఖ బర్తరఫ్ పూర్తిగా ఏఐసీసీ నిర్ణయమని.. ఆమె విషయంలో హైకమాండ్ ఒప్పుకోలేదని టీపీసీసీ చీఫ్ చెప్పారు. పార్టీలో క్రమశిక్షణ విషయంలో నాయకత్వం కఠినంగా ఉందని వివరించారు.

# విద్యార్థులకు స్కూల్ బ్యాగ్స్, నోట్ బుక్స్ పంపిణీ

**పీపుల్స్‌డైరీ-తొర్రూరు :** తొర్రూర్ లయన్స్ క్లబ్ జోన్ చైర్మన్ డాక్టర్ ఎస్ రామనర్సయ్య జన్మదిన సందర్భంగా చింతల సురేష్ మానస ఆర్థిక సహకారంతో దాట్ల ప్రాథమిక పాఠశాల విద్యార్థులకు బ్యాగ్స్, కాపీ రైటింగ్ నోట్ బుక్స్, పండ్లు పంపిణీ చేశారు. శనివారం దంతాలపల్లి మండలం లోని దాట్ల ప్రాథమిక పాఠశాలలో తొర్రూర్ లయన్స్ క్లబ్ జోన్ చైర్మన్ డాక్టర్ ఎస్. రామ నర్సయ్య జన్మదినం సందర్భంగా ఉపాధ్యాయులు చింతల మానస సురేష్ ఆర్థిక సహకారంతో ప్రాథమిక పాఠశాల విద్యార్థులకు బ్యాగ్స్, పలకలు, నోట్ బుక్స్ సామాగ్రి, స్టేషనరీ వస్తువులు దాట్ల ప్రాథమిక పాఠశాల ప్రధానోపాధ్యాయులు ఎస్కే పాషా చేతుల మీదుగా అందజేశారు. ఈ కార్యక్రమంలో ఉపాధ్యాయులు అనిత, రవీందర్, కవిత, తేజశ్రీ, మాధవి లత పాల్గొన్నారు



# దళారుల చెరలో రైతు.. పెట్టుబడిదారుల చేతిలో పంట!

- అప్పు కోసం ప్రైవేటు పెట్టుబడిదారులపై ఆధారం.. పంట చేతికొచ్చేసరికి దళారికే అమ్మకం
- ప్రతి మండలంలో కోల్డ్‌స్టోరేజీలు ఏర్పాటు చేయాలి -- సీపీఐ ఎంఎల్ న్యూ డెమోక్రసీ జిల్లా నాయకులు శివ నాయక్



**సింగరేణి,(కారేపల్లి) సెప్టెంబర్ 5 (పీపుల్స్ డైరీ) :** ఆరుగాలం కష్టించి పంట పండిస్తున్న రైతు.. చివరకు ఆ పంటపై హక్కును కోల్పోయి దళారుల చేతిలో దగా పడుతున్నాడని సీపీఐ ఎంఎల్ న్యూ డెమోక్రసీ జిల్లా నాయకులు శివ నాయక్ విమర్శించారు. రైతే రాజు అని కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు ప్రకటనలు చేయడం తప్ప.. రైతును అప్పుల ఊబి నుంచి బయటపడేసే శాశ్వత చర్యలు చేపట్టడం లేదని ఆరోపించారు. అప్పు ఇచ్చేది పెట్టుబడిదారుడు.. పంట కొనేది అదే వ్యక్తి.. ధర నిర్ణయించేది కూడ అతడే అన్న పరిస్థితి ఏజెన్సీ ప్రాంతాల్లో నెలకొన్నదని శివ నాయక్ అన్నారు. బ్యాంకు రుణాలు సకాలంలో అందకపోవడం, రుణమాఫీ అమలులో జాప్యం, ప్రభుత్వ సబ్సిడీలు అందుబాటులో లేకపోవడం వల్ల రైతులు ప్రైవేటు పెట్టుబడిదారుల వద్ద అధిక వడ్డీలకు అప్పులు చేయాల్సి వస్తోందన్నారు.

## అప్పు తీసుకుంటే పంటపై హక్కు కోల్పోవాల్సిందే!

సాగు ప్రారంభానికి అవసరమైన విత్తనాలు, ఎరువులు, పురుగుమందులు, కూలీల ఖర్చులు, వ్యవసాయ పనిముట్ల కోసం పెట్టుబడి లేక రైతులు ప్రైవేటు వ్యక్తులను ఆశ్రయిస్తున్నారని తెలిపారు. ఈ అప్పులు అనేక సందర్భాల్లో అధికారిక ఒప్పందాలు లేకుండానే కొనసాగుతున్నాయని, అధిక వడ్డీలు రైతులను అప్పు--పంట--అప్పు అనే అంతులేని చక్రంలోకి నెట్టేస్తున్నాయని అన్నారు. పంట చేతికొచ్చిన తర్వాత మార్కెట్‌లో ఉన్న ధరకు రైతు విక్రయించుకునే స్వేచ్ఛను కోల్పోతున్నాడని పేర్కొన్నారు. ముందుగానే ఇచ్చిన అప్పు పేరుతో పెట్టుబడిదారులు తక్కువ ధరకు పంటను కొనుగోలు చేస్తున్నారని ఆరోపించారు. ఒకవైపు అధిక వడ్డీ వసూలు చేస్తూ.. మరోవైపు తక్కువ ధరకు పంట కొనుగోలు చేసి మార్కెట్‌లో అధిక ధరకు విక్రయించడం ద్వారా పెట్టుబడిదారులు ద్వంద్వ లాభాలు పొందుతున్నారని విమర్శించారు.

## ప్రకృతి నష్టం రైతుదే.. అప్పు మాత్రం మిగిలేది!

వర్షాభావం, అధిక వర్షాలు, వరదలు, తెగుళ్ల వంటి ప్రకృతి వైపరీత్యాలతో పంట పూర్తిగా దెబ్బతిన్నా రైతు అప్పు మాత్రం తీరదని శివ నాయక్ ఆవేదన వ్యక్తం చేశారు. పంట నష్టపోయిన రైతుకు తక్షణ సహాయం అందకపోవడంతో మళ్లీ అదే పెట్టుబడిదారుడి వద్ద అప్పు తీసుకుని తదుపరి పంట సాగు చేయాల్సిన దుస్థితి ఏర్పడుతోందన్నారు. ఇలా ఏళ్ల తరబడి అప్పులు పేరుకుపోవడంతో అనేక కుటుంబాలు తీవ్ర ఆర్థిక, మానసిక ఒత్తిడికి గురవుతున్నాయని తెలిపారు. రైతుల ఆత్మహత్యలకు దారితీసే పరిస్థితులను నివారించాల్సిన బాధ్యత ప్రభుత్వాలపై ఉందన్నారు.

## మార్కెట్ లేకపోవడమే దళారులకు వరం

ఏజెన్సీ ప్రాంతాల్లో రైతులకు సమీపంలో సరైన మార్కెట్ సదుపాయాలు లేకపోవడం దళారులకు వరంగా మారిందని శివ నాయక్ అన్నారు. పంటను నిల్వ చేసుకునే అవకాశం లేకపోవడంతో రైతు పంట చేతికొచ్చిన వెంటనే అమ్ముకోవాల్సి వస్తోందన్నారు. ప్రతి మండల కేంద్రంలో కనీసం రెండు కోల్డ్‌స్టోరేజీలు ఏర్పాటు చేసి వాటిని రైతుల ఆధీనంలో నిర్వహించాలని ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. దళారులకు అవకాశం లేకుండా రైతు ఉత్పత్తి సంఘాలు, సహకార సంఘాల ద్వారా పంటను నిల్వ చేసి.. సరైన ధర వచ్చినప్పుడు విక్రయించే విధానం తీసుకురావాలని కోరారు.

## రైతుకు రుణం కాదు.. దోపిడీ నుంచి విముక్తి కావాలి

ప్రతి రైతు కుటుంబానికి సంవత్సరానికి రూ.2 లక్షల వరకు సున్నా వడ్డీ రుణం ఎలాంటి షరతులు లేకుండా అందించాలని శివ నాయక్ డిమాండ్ చేశారు. బ్యాంకులు రైతులకు రుణాలు ఇవ్వడంలో జాప్యం చేయకుండా అధికారులు పర్యవేక్షించాలని కోరారు. విత్తనాలు, ఎరువులు, పురుగుమందులు, వ్యవసాయ పనిముట్లను సబ్సిడీపై అందించడంతో పాటు ప్రతి పంటకు సంబంధించిన సాగు పద్ధతులు, తెగుళ్ల నివారణ, మార్కెట్ ధరలు, పంట నిల్వ విధానాలపై వ్యవసాయ అధికారులు గ్రామస్థాయిలో అవగాహన కల్పించాలని సూచించారు. పంట వేసి నష్టపోయిన ప్రతి రైతును ప్రభుత్వం తక్షణమే ఆదుకోవాలని, రైతు భరోసా, పంట బీమా తదితర పథకాలను అర్హులైన రైతులందరికీ సమర్థవంతంగా అమలు చేయాలని డిమాండ్ చేశారు.

## దళారి వ్యవస్థ రద్దు చేయాలి

ములుగు, వరంగల్, ఖమ్మం, మహబూబాబాద్ జిల్లాల్లోని ఏజెన్సీ ప్రాంతాల్లో గిరిజన రైతులు ప్రైవేటు పెట్టుబడిదారులపై ఆధారపడే పరిస్థితి నుంచి బయటపడేలా ప్రభుత్వం ప్రత్యేక కార్యాచరణ రూపొందించాలని శివ నాయక్ కోరారు. "రైతు పండించిన ప్రతి గింజకు రైతే యజమాని. దళారి చెప్పిన ధరకే పంట అమ్ముకునే పరిస్థితికి స్వస్తి పలకాలి. రైతుకు స్వేచ్ఛా మార్కెట్, ప్రభుత్వ రుణం, నిల్వ సదుపాయం, గిట్టుబాటు ధర కల్పించాలి" అని ఆయన అన్నారు. దళారి వ్యవస్థను పూర్తిగా రద్దు చేసి రైతు పంటను రైతే స్వేచ్ఛగా విక్రయించుకునే హక్కు కల్పించే వరకు అఖిల భారత రైతు కూలీ సంఘం ఆధ్వర్యంలో రైతుల పక్షాన పోరాటాలను మరింత ఉధృతం చేస్తామని శివ నాయక్ హెచ్చరించారు. రైతు చేతిలో వ్యవసాయం ఉండాలి.. పెట్టుబడిదారుల చేతిలో కాదు. రైతు బతికితేనే గ్రామీణ భారతం బతుకుతుంది అని ఆయన స్పష్టం చేశారు.

# కొత్తపల్లిలో భక్తాంజనేయ స్వామికి వైభవంగా ప్రత్యేక పూజలు

- రెండు వేల అరటి పండ్లతో స్వామివారికి ఆకర్షణీయ అలంకరణ.. భక్తులతో కిటకిటలాడిన ఆలయం

**జమ్మికుంట, సెప్టెంబర్ 5:పీపుల్స్ డైరీ :** జమ్మికుంట మున్సిపాలిటీ పరిధిలోని కొత్తపల్లి గ్రామంలో వెలసిన శ్రీ భక్తాంజనేయ స్వామి దేవాలయంలో శ్రావణ మాసం చివరి శనివారం సందర్భంగా ప్రత్యేక పూజా కార్యక్రమాలను భక్తిశ్రద్ధలతో ఘనంగా నిర్వహించారు. ఆలయ వ్యవస్థాపక అధ్యక్షులు బొద్దుల రవీందర్ ఆధ్వర్యంలో ఆలయ కమిటీ సభ్యులు, అర్చకులు ప్రత్యేక ఏర్పాట్లు చేశారు. శ్రావణ మాసం చివరి శనివారం కావడంతో స్వామివారికి విశేష పూజలు, అభిషేకాలు నిర్వహించి, అనంతరం కదలి ఫలాలు అంటే అరటి పండ్లతో ప్రత్యేక అలంకరణ చేశారు. భక్తులు సమర్పించిన సుమారు రెండు వేల అరటి పండ్లను వినియోగించి స్వామివారిని అత్యంత ఆకర్షణీయంగా అలంకరించారు. అరటి పండ్లతో అలంకరించిన స్వామివారి దర్శనం కోసం భక్తులు పెద్ద సంఖ్యలో ఆలయానికి తరలివచ్చారు. ఆలయ అర్చకులు రామచందర్‌రావు ఆధ్వర్యంలో వేదమంత్రోచ్ఛారణల మధ్య స్వామివారికి ప్రత్యేక పూజలు నిర్వహించారు. అనంతరం భక్తులకు తీర్థప్రసాదాలను అందజేశారు. స్వామివారి ప్రత్యేక అలంకరణ భక్తులను విశేషంగా ఆకట్టుకుంది. ఆలయ ప్రాంగణం హనుమాన్ నామస్మరణతో, భక్తుల సందడితో ఆధ్యాత్మిక వాతావరణాన్ని సంతరించుకుంది. ఈ సందర్భంగా పలువురు భక్తులు స్వామివారిని దర్శించుకుని ప్రత్యేక పూజలు నిర్వహించారు. తమ కుటుంబ సభ్యుల ఆయురారోగ్యాలు, సుఖసంతోషాలు, సకల శుభాలు కలగాలని స్వామివారిని ప్రార్థించారు. శ్రావణ మాసం చివరి శనివారం కావడంతో ఉదయం నుంచే ఆలయానికి భక్తుల రాక కొనసాగింది. ఆలయ కమిటీ సభ్యులు భక్తులకు ఎలాంటి ఇబ్బందులు కలగకుండా ఏర్పాట్లు చేశారు. పూజా కార్యక్రమాలు ప్రశాంతంగా జరిగేలా ప్రత్యేక చర్యలు చేపట్టారు. కార్యక్రమం అనంతరం భక్తులకు తీర్థప్రసాదాలతో పాటు స్వామివారి అలంకరణకు ఉపయోగించిన ప్రసాదాన్ని అందించారు. భక్తుల సహకారంతో ఆలయంలో ప్రత్యేక పూజా కార్యక్రమాలు విజయవంతంగా నిర్వహించామని ఆలయ వ్యవస్థాపక అధ్యక్షులు బొద్దుల రవీందర్ తెలిపారు. ప్రతి సంవత్సరం శ్రావణ మాసం చివరి శనివారం స్వామివారికి ప్రత్యేక పూజలు



నిర్వహించడం ఆనవాయితీగా కొనసాగుతోందని పేర్కొన్నారు. భక్తుల విశ్వాసానికి అనుగుణంగా ఆలయంలో ఆధ్యాత్మిక కార్యక్రమాలను మరింత వైభవంగా నిర్వహించేందుకు కృషి చేస్తామని తెలిపారు.

# దశాబ్దాలుగా సాగు చేసుకుంటున్న రైతులకు తక్షణమే పట్టాదారు పాస్ పుస్తకాలు ఇవ్వాలి

- తెలంగాణ అంబేద్కర్ సంఘం రాష్ట్ర ప్రధాన కార్యదర్శి చెప్యాల ప్రకాష్

**భీమదేవరపల్లి సెప్టెంబర్ 05 (పీపుల్స్ డైరీ ) :** తెలంగాణ రాష్ట్రవ్యాప్తంగా ఎలాంటి ఆస్తిపాస్తులు లేక, తరతరాలుగా భూమిని నమ్ముకుని జీవిస్తున్న ఎస్సీ, ఎస్టీ, బీసీ, మైనార్టీ నిరుపేద రైతులకు తక్షణమే పట్టాదారు పాస్ పుస్తకాలు జారీ చేసి, సంపూర్ణ యాజమాన్య హక్కులు కల్పించాలని తెలంగాణ అంబేద్కర్ సంఘం రాష్ట్ర ప్రధాన కార్యదర్శి చెప్యాల ప్రకాష్ ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. శనివారం ఆయన విలేకరులతో మాట్లాడుతూ, గతంలో ప్రభుత్వాలు, అధికారులు చూపించిన విధంగా పేద రైతులు సీలింగ్, ఇనాం, పంచరాయి, పోరంబోకు, అటవీ గుట్టలు, రాళ్లతో నిండిన పనికిరాని భూములను ఎంతో శ్రమకోర్చి చదును చేసి సాగులోకి తెచ్చుకున్నారని తెలిపారు. గత 30 నుంచి 40 సంవత్సరాలుగా ఆ భూములను కాస్తు (సాగు) చేసుకుంటూ జీవిస్తున్నప్పటికీ, కొందరికి ప్రభుత్వ ప్రొసీడింగ్స్ ఉన్నా నేటికీ పట్టాదారు పాస్ పుస్తకాలు అందలేదని ఆవేదన వ్యక్తం చేశారు. గత ప్రభుత్వం కొద్దిమందికి మాత్రమే పాస్ పుస్తకాలు ఇచ్చి చేతులు దులుపుకోవడంతో, మెజారిటీ నిరుపేద రైతులకు బ్యాంకు




రుణాలు, సంక్షేమ పథకాలు అందక తీవ్ర ఇబ్బందులు పడుతున్నారని పేర్కొన్నారు. పేదలకు భూ పంపిణీ చేసిన చరిత్ర కాంగ్రెస్ పార్టీదేనని గుర్తు చేస్తూ, ప్రస్తుతం ప్రజాపాలన సాగిస్తున్న కాంగ్రెస్ ప్రభుత్వం ఈ క్రింది డిమాండ్లను తక్షణమే పరిష్కరించాలని కోరారు: దశాబ్దాలుగా కాస్తులో ఉన్న ఇనాం, అటవీ, సీలింగ్, ప్రభుత్వ అసైన్డ్ భూములన్నింటికీ సాగుదారులైన పేద రైతులకు పట్టాదారు పాస్ పుస్తకాలు జారీ చేయాలి. పాస్ పుస్తకాలు అందించడం ద్వారా నిరుపేద రైతులకు బ్యాంకులలో పంట రుణాలు, ప్రభుత్వ ప్రోత్సాహకాలు అందేలా చర్యలు తీసుకోవాలి. బడుగు, బలహీన వర్గాల జీవనోపాధిని దృష్టి లో ఉంచుకుని, శాసనసభ సమావేశాల్లో ఈ అంశంపై ప్రత్యేక తీర్మానం చేసి అధికారికంగా ఆమోదించాలి. భూమిలేని బడుగు, బలహీన వర్గాల సంక్షేమాన్ని దృష్టిలో ఉంచుకుని ప్రభుత్వం వెంటనే సానుకూల నిర్ణయం తీసుకోవాలని, లేనిపక్షంలో బాధితుల పక్షాన పోరాటాలు ఉధృతం చేస్తామని హెచ్చరించారు. ఈ కార్యక్రమంలో రాష్ట్ర ఉపాధ్యక్షులు తొందూరి ఎల్లయ్య, రాష్ట్ర కార్యదర్శి కండే సుధాకర్,రాష్ట్ర నాయకులు సాతురి రాజమౌళి, మండల నాయకులు ఎర్ర కార్తీక్ గంగారపు రవీందర్ తదితరులు పాల్గొన్నారు.

# ఘనంగా ఉపాధ్యాయ దినోత్సవ వేడుకలు

**వీణవంక సెప్టెంబర్ 05( పీపుల్స్ డైరీ) :** ఎంపియుపిఎస్ హిమ్మత్ నగర్ పాఠశాలలో విద్యార్థిని విద్యార్థులు వారికి విద్యాబుద్ధులు నేర్పే ఉపాధ్యాయులకు శాలువా, బోకేతో సత్కరించి విద్యార్థులకు గురువుల పట్ల గౌరవాన్ని చాటుకున్నారు. ఈ కార్యక్రమంలో ఉపాధ్యాయులు విద్యార్థులందరూ డాక్టర్ సర్వేపల్లి రాధాకృష్ణన్ జన్మదినం సందర్భంగా వారికి పూలమాలతో అలంకరించి ఈ కార్యక్రమాన్ని పండుగ వాతావరణంల జరుపుకున్నారు. అనంతరం పాఠశాల ప్రధానోపాధ్యాయులు గోనె సత్యం మాట్లాడుతూ విద్యార్థులు ప్రతిరోజూ క్రమం తప్పకుండా పాఠశాలకు రావాలని ఉపాధ్యాయులు తరగతి గదిలో చెప్పే విషయాలను శ్రద్ధగా నేర్చుకొని గురువుల పట్ల గౌరవాన్ని చూపుతూ తల్లిదండ్రులని ప్రేమిస్తూ పెద్దలతో సోదరులతో సహాయ సహకారాలతో స్నేహభావంతో కలిసిమెలిసి ఉండాలని తెలియజేశారు. సీనియర్ ఉపాధ్యాయులు వేణు మాట్లాడుతూ విద్యార్థులు చక్కగా చదువుకొని వారి జీవితంలో ఉన్నత స్థానానికి చేరుకోవాలని అత్యధికంగా డాక్టర్లు ఇంజనీర్లు టీచర్లుగా రూపొంది మేము చదువు చెప్పినందుకు మా పేరు నిలబెట్టాలని విద్యార్థులకు సూచించారు. ఈ




కార్యక్రమంలో ఉపాధ్యాయులు రవళి రజిత ప్రియాంక అంగన్వాడీ టీచర్ స్వరూప సమ్మక్క రాధమ్మ విద్యార్థిని విద్యార్థులు ఉపాధ్యాయ దినోత్సవాన్ని చాలా ఘనంగా సెలబ్రేట్ చేసుకున్నారు

# ఆరేపల్లిలో ఘనంగా శివాజీ మహారాజ్ విగ్రహావిష్కరణ

## ముఖ్య అతిథిగా పాల్గొని విగ్రహాన్ని ఆవిష్కరించిన ఎమ్మెల్యే కేఆర్ నాగరాజు



**హసన్‌పర్తి, సెప్టెంబర్ 5 (పీపుల్స్ డైరీ) :** గ్రేటర్ వరంగల్ మున్సిపల్ కార్పొరేషన్ పరిధిలోని 3వ డివిజన్ ఆరేపల్లి గ్రామంలో ఛత్రపతి శివాజీ ఉత్సవ కమిటీ ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన ఛత్రపతి శివాజీ మహారాజ్ విగ్రహాన్ని వర్ధన్నపేట ఎమ్మెల్యే, విశ్రాంత ఐపీఎస్ అధికారి కేఆర్ నాగరాజు ఆవిష్కరించారు. విగ్రహానికి పూలమాల వేసి నివాళులర్పించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే కేఆర్ నాగరాజు మాట్లాడుతూ.. ఛత్రపతి శివాజీ మహారాజ్ జీవితం, ధర్మం, న్యాయం, స్వాభిమానం కోసం ఆయన చేసిన పోరాటాలు నేటి తరానికి స్ఫూర్తిదాయకమన్నారు. ప్రజల స్వేచ్ఛ, సంక్షేమం కోసం శివాజీ సాగించిన పోరాటాలను యువత ఆదర్శంగా తీసుకోవాలని పిలుపునిచ్చారు. శివాజీ విగ్రహాన్ని ఏర్పాటు చేసిన ఉత్సవ కమిటీ సభ్యులను అభినందించారు. కార్యక్రమంలో కమిటీ చైర్మన్ సిందె రవీందర్, ఆరె సంక్షేమ సంఘం అధ్యక్షుడు చెట్టుపల్లి శివాజీ, మాజీ కార్పొరేటర్ శోభారాణి అనిల్, మాజీ పీఏసీఎస్ చైర్మన్ బుద్దే పెద్దన్న, ఉద్యమకారుల సంఘం అధ్యక్షుడు సోమిడి అంజన్‌రావు, వరంగల్ జిల్లా ఆరె సంఘం అధ్యక్షుడు నర్సింగరావు, రాష్ట్ర రైతు సంఘం అధ్యక్షుడు చందర్‌రావు, మాజీ పీఏసీఎస్ చైర్మన్ బుద్దే శ్రీనివాస్, మాజీ వైస్ ఎంపీపీ బిక్షపతి, సీనియర్ నాయకులు మనోహర్, బిజిలి సంపత్‌తో పాటు డివిజన్ ముఖ్య నాయకులు, కార్యకర్తలు తదితరులు పాల్గొన్నారు.

# ఇండిగో పైలెట్ గా ఎంపికైన మనోజ్ నాయక్

## పైలట్ మనోజ్ నాయక్ ఎంపిక పట్ల హర్షం వ్యక్తం చేసిన గిరిజన నాయకులు




**హుస్నాబాద్, టౌన్: (పీపుల్స్ డైరీ) సెప్టెంబర్ 5 :** చిన్నప్పటినుండి పైలట్ గా మారాలని కోరికను నిజం చేసుకొని ఇండిగో పైలట్ కు ఎంపికైన మనోజ్ నాయక్ కు అభినందనలు వెలువెత్తుతున్నాయి. హుస్నాబాద్ మండలం బల్లు నాయక్ తండ గ్రామ పంచాయతీకి చెందిన లావుడ్య బిక్షపతి గాయత్రిల కుమారుడు లావుడ్య మనోజ్ నాయక్ చిన్నప్పటి నుండి పైలట్ కావాలనే బలమైన కోరిక ఉండేది. ఆ కోరికను నిజం చేసుకోవాలని పట్టుదలతో చదివి శిక్షణ పొంది ఇండిగో పైలెట్ గా ఎంపిక కావడం జరిగింది. మామూలు గిరిజన తండాకు చెందిన మనోజ్ నాయక్ తల్లిదండ్రులు వృత్తిరీత్యా ఉపాధ్యాయులు గిరిజన తండా నుంచి ఆకాశపు అంచుల దాకా ఎగిరి కలను నిజం చేసుకున్న పైలెట్ కు హుస్నాబాద్ నియోజకవర్గ గిరిజన నాయకులు అభినందనలు తెలిపారు. ఇంటర్మీడియట్ చదివిన తర్వాత ఎన్నో కష్టాలను అధిగమించి పైలట్ గా శిక్షణ పొంది తర్వాత హుస్నాబాద్ ప్రాంతం నుంచి ఒక గిరిజన బిడ్డ పైలెట్ గా మారడం పట్ల మాకు ఎంతో సంతోషంగా ఉందని తల్లిదండ్రులు ఆనందం వ్యక్తం చేశారు.

# కోటంచ లో ఘనంగా ఉట్ల సేవా మహోత్సవం



**రేగొండ సెప్టెంబర్ 5 పీపుల్స్ డైరీ :** రేగొండ మండలంలోని కోటంచ శ్రీలక్ష్మీనరసింహస్వామి ఆలయంలో శనివారం గోకులాష్టమి వేడుకల్లో భాగంగా ఉట్ల సేవా మహోత్సవాన్ని ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా ప్రతి సంవత్సరం శ్రీకృష్ణ జన్మాష్టమి (గోకులాష్టమి) వేడుకల్లో భాగంగా ఆలయంలో ఉట్ల సేవా మహోత్సవాన్ని అత్యంత వైభవంగా నిర్వహిస్తారు. ఈ ఉత్సవంలో భాగంగా స్థానిక యువకులు, భక్తులు ఎంతో ఉత్సాహంగా పాల్గొని ఉట్టి కొట్టే కార్యక్రమాన్ని చేపడతారు. ఒకరిపై ఒకరు రంగులు చల్లుకుంటూ, కోలాటాలు, భజనలతో ఆలయ పరిసరాల్లో కోలాహలం సృష్టిస్తారు. ఉట్ల సేవలో పాల్గొని ఉట్టిని విజయవంతంగా కొట్టిన యువకులకు, చిన్న పిల్లలకు ఆలయ కమిటీ నిర్వాహకులు ప్రథమ, ద్వితీయ, తృతీయ బహుమతులను అందజేసరు. ఉట్ల సేవ అనంతరం భక్తులందరికీ ప్రత్యేక పూజలు నిర్వహించి, తీర్థప్రసాదాలను వితరణ చేస్తారు తెలంగాణలోనే "రెండవ యాదాద్రి"గా పేరుగాంచిన కోటంచ లక్ష్మీనరసింహస్వామి ఆలయంలో కృష్ణాష్టమి నాడు జరిగే ఈ ఉట్ల సేవను చూసేందుకు చుట్టుపక్కల గ్రామాల నుండి పెద్ద సంఖ్యలో భక్తులు తరలివచ్చరు. ఈ కార్యక్రమంలో ఈ ఓ బిల్ల శ్రీనివాస్, ఆలయ ప్రధాన అర్చకులు తూపురాని శ్రీనివాసచార్యులు. ఆలయ సిబ్బంది శ్రవణ్, రవి, సుధాకర్, పాల్గొన్నారు.

# పాఠశాలలో సర్వేపల్లి కాంస్య విగ్రహావిష్కరణ



**హసన్‌పర్తి, సెప్టెంబర్ 5 (పీపుల్స్ డైరీ) :** గ్రేటర్ వరంగల్ మున్సిపల్ కార్పొరేషన్ పరిధిలోని 3వ డివిజన్ పైడిపల్లిలో ప్రభుత్వ పాఠశాలలో భారత మాజీ రాష్ట్రపతి, ప్రముఖ విద్యావేత్త డాక్టర్ సర్వేపల్లి రాధాకృష్ణన్ కాంస్య విగ్రహాన్ని వర్ధన్నపేట ఎమ్మెల్యే, విశ్రాంత ఐపీఎస్ అధికారి కేఆర్ నాగరాజు శనివారం ఆవిష్కరించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ.. విద్యావేత్తగా, సంఘ సంస్కర్తగా, రాజకీయ నాయకుడిగా దేశానికి సేవలందించిన సర్వేపల్లి రాధాకృష్ణన్ జీవితాన్ని విద్యార్థులు ఆదర్శంగా తీసుకోవాలని సూచించారు. గొప్ప ఉపాధ్యాయుడు దేశ భవిష్యత్తును మార్చగల శక్తిని కలిగి ఉంటాడని ఆయన జీవితం నిరూపించిందన్నారు. విద్యార్థులు లక్ష్యసాధనకు క్రమశిక్షణ, కృషిని అలవర్చుకోవాలని సూచించారు. సమాజ అభివృద్ధిలో ఉపాధ్యాయుల పాత్ర ఎంతో కీలకమని, భవిష్యత్ తరాలకు వారు మార్గదర్శకులుగా నిలుస్తారని అన్నారు. అనంతరం పాఠశాల ఉపాధ్యాయులను ఎమ్మెల్యే సన్మానించారు. కార్యక్రమంలో మాజీ కార్పొరేటర్ జన్ను శోభారాణి అనిల్, మాజీ పీఏసీఎస్ చైర్మన్ బుద్ధ పెద్దన్న, సీనియర్ నాయకులు బిజిలి సంపత్, డివిజన్ ముఖ్య నాయకులు, ఉపాధ్యాయులు, విద్యార్థులు తదితరులు పాల్గొన్నారు.

## బీజేపీ బూత్ అధ్యక్షుడు రాజేశ్వర్ రావు గారి కుటుంబ సభ్యులను పరామర్శించిన జె ఎస్ ఆర్



**సైదాపూర్ సెప్టెంబర్ 5 ( పీపుల్స్ డైరీ) :** హుస్నాబాద్ నియోజకవర్గం సైదాపూర్ మండల గర్రెపల్లి గ్రామ బూత్ అధ్యక్షుడు దోకిడి రాజేశ్వర్ రావు తిరుపతి రావు గారి తండ్రి దోకిడి అంబిరు నర్సయ్య గారు ఇటీవల మరణించగా వారి కుటుంబ సభ్యులను బీజేపీ రాష్ట్ర కార్యవర్గ సభ్యులు జన్నపురెడ్డి సురేందర్ రెడ్డి పరామర్శించారు. వారి చిత్ర పటానికి పూల మాలలు వేసి శ్రద్ధాంజలి ఘటించారు. వారి మృతి పట్ల ప్రగాఢ సానుభూతి వ్యక్తం చేసి ధైర్యంగా ఉండాలని అన్నారు ఈ కార్యక్రమంలో సర్పంచ్ మాచమల్ల శ్రీకాంత్, మోకిడి వినోద్, కౌడగాని హరీష్, మోకిడి శ్రీనివాస్, కస్తూరి శ్రీనివాస్, నెల్లి శ్రీనివాస్, నీర్ల సతీష్, వంగ సాగర్, ఈ రాల శ్రీనివాస్, నెల్లి శ్రీకాంత్, నెల్లి మహేందర్, గూళ్ళ శ్రీధర్, అనగోని సతీష్, వీరాచారి, గుర్రం ఎల్లయ్య, మొగిలి తదితరులు పాల్గొన్నారు

## జగిత్యాల జిల్లా ఉత్తమ ఉపాధ్యాయుడిగా వోడ్నాల లక్ష్మణస్వామి



**శంకరపట్నం సెప్టెంబర్:05 పీపుల్స్ డైరీ :** ఉపాధ్యాయ దినోత్సవం సందర్భంగా జగిత్యాల జిల్లా కలెక్టరేట్ లో జరిగిన వేడుకల్లో జిల్లా ఉత్తమ ఉపాధ్యాయ అవార్డులను ప్రదానం చేశారు. ఈ అవార్డును శంకరపట్నం మండలం, తాడికల్ గ్రామాని కి చెందిన నిరుపేద పద్మశాలి కుటుంబానికి చెందిన శ్రీ వోడ్నాల లక్ష్మణస్వామి అందుకున్నారు. చిన్నప్పటి నుండి చదువులో క్లాస్ ఫస్ట్ గా నిలుస్తూ, ఎన్నో కష్టాలను అధిగమించి ఉపాధ్యాయుడిగా ఎదిగిన ఆయన, గత 24 సంవత్సరాలుగా క్రమశిక్షణ, అంకితభావంతో విద్యాబోధన చేస్తూ ఎందరో విద్యార్థులకు ఆదర్శంగా నిలుస్తున్నారు. ఈ కార్యక్రమంలో జగిత్యాల ఎమ్మెల్యే డా. సంజయ్ కుమార్, అడిషనల్ కలెక్టర్, జిల్లా విద్యాధికారి (DEO) చేతుల మీదుగా లక్ష్మణస్వామి కి అవార్డు, ప్రశంసా పత్రం అందజేశారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే డా. సంజయ్ మాట్లాడుతూ "నిరుపేద కుటుంబం నుండి వచ్చి 24 ఏళ్లుగా నిబద్ధతతో పనిచేస్తున్న లక్ష్మణస్వామి యువ ఉపాధ్యాయులకు స్ఫూర్తి" అని కొనియాడారు. అడిషనల్ కలెక్టర్, ఐజుూ కూడా ఆయన సేవలను అభినందించారు.

## నవభారత్ పాఠశాలలో ఘనంగా ఉపాధ్యాయ దినోత్సవం



**హుస్నాబాద్. టౌన్: (పీపుల్స్ డైరీ) సెప్టెంబర్ 05 :** స్థానిక నవభారత్ ఇంగ్లీష్ మీడియం హైస్కూల్‌లో ఉపాధ్యాయ దినోత్సవాన్ని ఘనంగా నిర్వహించారు. పాఠశాల కరస్పాండెంట్ గంగరవేణి రవీందర్ ఆధ్వర్యంలో జరిగిన కార్యక్రమంలో డాక్టర్ సర్వేపల్లి రాధాకృష్ణన్ చిత్రపటానికి పూలమాల వేసి నివాళులర్పించారు. ఈ సందర్భంగా విద్యార్థులు కరస్పాండెంట్ రవీందర్‌ను శాలువాతో సత్కరించారు. అనంతరం పాఠశాల ఉపాధ్యాయులను విద్యార్థులు శాలువాలతో సన్మానించి ఉపాధ్యాయ దినోత్సవ శుభాకాంక్షలు తెలిపారు. ఉపాధ్యాయుల సేవలను కొనియాడుతూ విద్యార్థులు తమ కృతజ్ఞతలు తెలిపారు.

## ఇంటింటికీ మొక్కల పంపిణీ



**హుస్నాబాద్. టౌన్: (పీపుల్స్ డైరీ) సెప్టెంబర్ 5 :** హుస్నాబాద్ పట్టణంలో వన మహోత్సవ కార్యక్రమంలో భాగంగా 3, 13, 16వ వార్డుల్లో ఇంటింటికీ మొక్కల పంపిణీ కార్యక్రమాన్ని మున్సిపల్ చైర్‌పర్సన్ దండి లక్ష్మి ఆధ్వర్యంలో జరిగిన కార్యక్రమంలో వార్డు ప్రజలకు మొక్కలను అందజేశారు. ఈ సందర్భంగా చైర్‌పర్సన్ మాట్లాడుతూ ప్రతి ఒక్కరూ మొక్కలు నాటి వాటిని సంరక్షించాలని, పర్యావరణ పరిరక్షణకు ప్రజలు భాగస్వాములు కావాలని కోరారు. ఈ కార్యక్రమంలో కౌన్సిలర్లు కొండ రజిత, బొల్లి శ్రీనివాస్, వైద్యం కిరణ్ ప్రసాద్, పిల్లి తిరుపతి, బొలిశెట్టి రాజు, మున్సిపల్ అధికారులు, మెప్మా ఆర్‌పీలు, సిబ్బంది పాల్గొన్నారు.

# వెయ్యి రోజుల కార్యక్రమంలో ఉద్రిక్తత..కాంగ్రెస్-బీఆర్ఎస్ పోటాపోటీ కార్యక్రమాలు

- అంబేద్కర్ కూడలిలో నినాదాలతో ఉద్రిక్తత
- ఇరుపార్టీల శ్రేణులను కట్టడి చేసేందుకు భారీగా పోలీసుల మోహరింపు



**భూపాలపల్లి సెప్టెంబర్ 5 పీపుల్స్ డైరీ :** వెయ్యి రోజుల కాంగ్రెస్ పాలనపై భూపాలపల్లి జిల్లా కేంద్రంలో శనివారం నిర్వహించిన కార్యక్రమాలు రాజకీయ వేడిని రాజేశాయి. అధికార కాంగ్రెస్, ప్రతిపక్ష బీఆర్ఎస్ పార్టీలు పోటాపోటీగా కార్యక్రమాలు నిర్వహించడంతో అంబేద్కర్ కూడలి వద్ద తీవ్ర ఉద్రిక్త పరిస్థితులు నెలకొన్నాయి. ఇరుపార్టీల శ్రేణులు పెద్దఎత్తున తరలిరావడంతో పోలీసులు భారీగా మోహరించి పరిస్థితిని అదుపులోకి తెచ్చేందుకు ప్రయత్నించారు. కాంగ్రెస్ ఆధ్వర్యంలో ఎమ్మెల్యే గండ్ర సత్యనారాయణరావు, డీసీసీ అధ్యక్షుడు బట్టు కర్ణాకర్ నేతృత్వంలో హనుమాన్ టెంపుల్ నుంచి అంబేద్కర్ సెంటర్ వరకు భారీ ర్యాలీ, రోడ్‌షో నిర్వహించారు. వెయ్యి రోజుల ప్రజాపాలన విజయోత్సవాల్లో భాగంగా ఈ కార్యక్రమానికి కాంగ్రెస్ ఉదయం 10 గంటల నుంచి అనుమతి తీసుకుంది. అదే సమయంలో కాంగ్రెస్ పాలనను నిరసిస్తూ 'వెయ్యి రోజుల దగా పాలన' పేరుతో అంబేద్కర్ సెంటర్‌లో నిరసన చేపట్టేందుకు బీఆర్ఎస్ ఉదయం 11 గంటలకు అనుమతి తీసుకుంది. అయితే కాంగ్రెస్ కార్యక్రమం నిర్ణీత సమయానికి ప్రారంభం కాకపోవడంతో పరిస్థితి ఉద్రిక్తంగా మారింది. మధ్యాహ్నం 1.30 గంటలు దాటినా అంబేద్కర్ సెంటర్‌లో కాంగ్రెస్ సభ కొనసాగుతుండటంతో బీఆర్ఎస్ శ్రేణుల్లో అసహనం పెరిగింది. ఊర్వశి థియేటర్ వద్ద వేచి ఉన్న బీఆర్ఎస్ కార్యకర్తలు ఒక్కసారిగా రోడ్డుపైకి వచ్చి కాంగ్రెస్ కాన్వాయ్ వెనుక వైపు చేరుకోవడంతో ఉద్రిక్తత చోటుచేసుకుంది. పోలీసులు ఇరువర్గాలను నచ్చజెప్పేందుకు ప్రయత్నించినప్పటికీ కాంగ్రెస్, బీఆర్ఎస్ శ్రేణులు పోటాపోటీగా నినాదాలు చేయడంతో అంబేద్కర్ కూడలి దద్దరిల్లింది. ఇరుపార్టీల కార్యకర్తలు ఒకరిపై ఒకరు నినాదాలు చేసుకోవడంతో పరిస్థితి మరింత ఉద్రిక్తంగా మారింది. ఎలాంటి అవాంఛనీయ ఘటనలు చోటుచేసుకోకుండా పోలీసులు భారీ బందోబస్తు ఏర్పాటు చేశారు. కొద్దిసేపు అంబేద్కర్ సెంటర్ పరిసరాల్లో తీవ్ర ఉత్కంఠ నెలకొంది. కాంగ్రెస్, బీఆర్ఎస్ కార్యక్రమాలకు ఒకే ప్రాంతంలో, దాదాపు ఒకే సమయంలో అనుమతులు ఇవ్వడం, ఒక పార్టీ కార్యక్రమం ఆలస్యం కావడం పరిస్థితిని మరింత సంక్లిష్టంగా మార్చిందనే అభిప్రాయాలు వ్యక్తమయ్యాయి.

# సింగరేణి కార్మికులకు ఇచ్చిన హామీలను అమలు చేయలి





**భూపాలపల్లి సెప్టెంబర్ 5 పీపుల్స్ డైరీ :** కాంగ్రెస్ ప్రభుత్వం 1000 రోజుల పాలన పూర్తి చేసుకున్నప్పటికీ సింగరేణి కార్మికులకు ఇచ్చిన హామీల్లో ఒక్కదానిని కూడా పూర్తిస్థాయిలో అమలు చేయలేదని మాజీ ఎమ్మెల్యే గండ్ర వెంకట రమణా రెడ్డి విమర్శించారు. సింగరేణి కార్మికులను కలుసుకుని వారి యొక్క సమస్యలను తెలుసుకునే సందర్భంగా ఏర్పాటు చేసిన భూపాలపల్లి సింగరేణి ఏరియా 8 ఇంక్లైన్ మైన్ నందు ఏర్పాటు చేసిన గేట్ మీటింగ్ లో పాల్గొన్న భూపాలపల్లి మాజీ ఎమ్మెల్యే గండ్ర వెంకట రమణా రెడ్డి మరియు బిఆర్ఎస్ నాయకులు, టీబీజికెఎస్ నాయకులు పాల్గొన్నారు.

### మాజీ ఎమ్మెల్యే గండ్ర మాట్లాడుతూ...

సింగరేణి కార్మికులకు కనీస పనిముట్లు, నాణ్యమైన భద్రతా పరికరాలు, షూస్ వంటి అవసరమైన సౌకర్యాలు కూడా సక్రమంగా అందించలేని దుస్థితి నెలకొం దన్నారు. కార్మికుల సంక్షేమం కంటే సింగరేణిలో రాజకీయ జోక్యం, టెండర్లు, ఆర్థిక వ్యవహారాలపైనే ఎక్కువ దృష్టి పెడుతున్నారని ఆరోపించారు. సింగరేణి ఆర్థిక పరిస్థితి ఎందుకు దిగజారింది? సంస్థ లాభాలు ఎందుకు తగ్గాయి? ప్రభుత్వం నుంచి రావాల్సిన బకాయిలు ఎందుకు చెల్లించడం లేదు? అనే అంశాలపై ప్రభుత్వం, యాజమాన్యం స్పష్టమైన సమాధానం ఇవ్వాలని డిమాండ్ చేశారు. దాదాపు రెండేళ్లుగా డీఎంఎఫ్‌టీ నిధులు సక్రమంగా అందడం లేదని, సింగరేణి వద్ద నిధులు లేవని చెప్పడం సరికాదన్నారు. ప్రభుత్వం, జెన్‌కో నుంచి సింగరేణికి రావాల్సిన బకాయిలను వెంటనే చెల్లించి సంస్థ ఆర్థిక పరిస్థితిని మెరుగుపరచాలని కోరారు. కార్మికుల సమస్యలను వారి దృష్టికి తీసుకెళ్లేందుకు ప్రయత్నిస్తే అధికారులు మైకులు పెట్టి అడ్డుకోవడం, కార్మికులను భయపెట్టడం ప్రజాస్వామ్య పద్ధతి కాదన్నారు. కార్మికులు చైతన్యవంతులై వాస్తవాలను తెలుసుకుని ప్రశ్నిస్తారనే భయంతోనే తమ గొంతును అణచివేయాలని చూస్తున్నారని విమర్శించారు. సింగరేణిలో గుర్తింపు సంఘం ఎన్నికలు కూడా సకాలంలో నిర్వహించడం లేదని, ఎన్నికలు నిర్వహించకుండా కార్మికుల హక్కులను కాలరాస్తున్నారని అన్నారు. వెంటనే గుర్తింపు సంఘం ఎన్నికలు నిర్వహించాలని డిమాండ్ చేశారు. సింగరేణి కార్మికులకు ఇచ్చిన ఎన్నికల హామీలను అమలు చేయాలని, కార్మికులకు రావాల్సిన ప్రయోజనాలను సకాలంలో అందించాలని, సంస్థలో రాజకీయ జోక్యాన్ని తగ్గించాలని డిమాండ్ చేశారు. తాత్కాలికంగా మా గొంతును అడ్డుకోవచ్చు, కానీ సింగరేణిలో జరుగుతున్న అన్యాయాలు, కార్మికుల సమస్యలు, అవినీతి ఆరోపణలను ప్రజల దృష్టికి తీసుకెళ్లకుండా ఎవరూ ఆపలేరు. తప్పులను సరిదిద్దకపోతే ప్రజలే తగిన గుణపాఠం చెబుతారని హెచ్చరించారు. ఈ కార్యక్రమంలో పట్టణ బీ ఆర్ ఎస్ నాయకులు పాల్గొన్నారు..

# అమ్మాయిలను భయంతో కాదు... ధైర్యంతో పెంచుదాం

- పసుల వినయ్ కుమార్ శిరీష
- ప్రోగ్రెసివ్ స్టూడెంట్స్ ఫెడరేషన్ ఆఫ్ ఇండియా
- వరంగల్ ఉమ్మడి జిల్లా అధ్యక్షులు



**రేగొండ సెప్టెంబర్ 5 పీపుల్స్ డైరీ..** సమాజానికి స్ఫూర్తిదాయక సందేశంగా 'ఇరుముడి' ఒక అమ్మాయి పుట్టినప్పటి నుంచి పెళ్లి వరకు కాదు... జీవితాంతం స్వేచ్ఛగా, భద్రంగా, గౌరవంగా జీవించే హక్కు కలిగి ఉంటుంది. కానీ నేటి సమాజంలో ఆడపిల్ల పుట్టిందంటే ఆనందంతో పాటు తల్లిదండ్రుల్లో భయం కూడా మొదలవుతున్న పరిస్థితి ఉంది. చదువుకోవడానికి బయటకు వెళ్లినా, ఉద్యోగానికి వెళ్లినా, రాత్రి ఇంటికి తిరిగి వచ్చినా --- ఆమె క్షేమంగా ఇంటికి చేరే వరకు తల్లిదండ్రులు ఆందోళన చెందాల్సిన దుస్థితి నెలకొంది. "అమ్మాయిలను భయంతో కాదు... ధైర్యంతో పెంచండి" అనే ఆలోచన ప్రతి తల్లిదండ్రి ఆలోచనగా మారాలి. ఈ విషయాన్ని ఎంతో బలంగా మన ముందుకు తీసుకువచ్చిన చిత్రం 'ఇరుముడి'. ఈ సినిమా కేవలం వినోదం కోసం తీసిన సినిమా కాదు; మన సమాజంలోని అనేక సమస్యలను మన కళ్లకు కట్టినట్లుగా చూపిస్తూ ఆలోచింపజేసే సామాజిక సందేశాన్ని అందిస్తుంది.

### స్వాతంత్ర్యం వచ్చి 80 ఏళ్లు... మహిళలకు నిజమైన స్వేచ్ఛ ఎక్కడ?

భారత స్వాతంత్ర్య ఉద్యమ కాలంలో మహాత్మా గాంధీజీ మహిళలు భయపడకుండా, స్వేచ్ఛగా ఎప్పుడైనా రోడ్డుపై నడవగలిగినప్పుడే దేశానికి నిజమైన స్వాతంత్ర్యం వచ్చినట్లని భావించే ఒక గొప్ప సామాజిక దృక్పథాన్ని వ్యక్తం చేశారు. భారతదేశానికి స్వాతంత్ర్యం వచ్చి దాదాపు ఎనిమిది దశాబ్దాలు కావస్తున్నా, మహిళలు, బాలికలపై హింస, లైంగిక దాడులు, అత్యాచారాలు, వేధింపులు కొనసాగుతూనే ఉన్నాయి. ఒకవైపు మహిళా సాధికారత గురించి మాట్లాడుతూనే మరోవైపు ఆడపిల్లలు స్వేచ్ఛగా బయట తిరగలేని పరిస్థితి ఉంటే మనం సాధించిన అభివృద్ధి ఎక్కడ? ఒక గ్రామంలో అమ్మాయి ఉన్నత విద్య కోసం పట్టణానికి వెళ్లాలంటే సరైన బస్సు సౌకర్యం ఉండదు. రవాణా సదుపాయాలు లేక, భద్రత లేక, ఆమె ఇంటికి తిరిగి వచ్చే వరకు తల్లిదండ్రులు భయపడాల్సి వస్తుంది. 'ఇరుముడి' సినిమా ఈ వాస్తవ పరిస్థితిని మన ముందుకు తీసుకువచ్చినట్లుగా అనిపిస్తుంది.

### గంజాయి, డ్రగ్స్ - యువత భవిష్యత్తును నాశనం చేస్తున్న మత్తు

నేటి సమాజంలో మరో తీవ్రమైన సమస్య డ్రగ్స్ గంజాయి వంటి మత్తు పదార్థాల వ్యాప్తి విద్యార్థులు, యువత మత్తు పదార్థాల బారిన పడుతూ తమ భవిష్యత్తును నాశనం చేసుకుంటున్న పరిస్థితులు ఆందోళన కలిగిస్తున్నాయి. ప్రభుత్వాలు "యాంటీ డ్రగ్స్" పేరుతో ప్రచార కార్యక్రమాలు నిర్వహించడం మాత్రమే సరిపోదు. డ్రగ్స్ ఎక్కడి నుంచి వస్తున్నాయి? వాటి వెనుక ఉన్న నెట్‌వర్క్ ఎవరిది? అక్రమ రవాణాను అరికట్టడంలో ఎక్కడ లోపం జరుగుతోంది? అనే ప్రశ్నలకు సమాధానాలు కావాలి. ప్రజాధనంతో ప్రచారాలు నిర్వహించడం కంటే డ్రగ్స్ మూలాలను గుర్తించి, సరఫరా వ్యవస్థపై ఉక్కుపాదం మోపాలి. యువత భవిష్యత్తును కాపాడే బాధ్యత ప్రభుత్వానికి, పోలీస్ వ్యవస్థకు, సమాజానికి ఉంది.

### మతం పేరుతో విభజన కాదు... మానవత్వమే మార్గం

భారతదేశం ఒక లౌకిక రాజ్యం. ఇక్కడ హిందూ, ముస్లిం, క్రైస్తవ, సిక్కు, బౌద్ధ, జైన తదితర అన్ని మతాలకు చెందిన ప్రజలు సమాన హక్కులతో జీవించాలి. ప్రతి పౌరుడు ఇతరుల మత విశ్వాసాలను గౌరవించాలి. మతాన్ని పాటించడం అంటే ఇతర మతాలను ద్వేషించడం కాదు. మత ఆచారాలను పాటించే సమయంలో కూడా మనిషిగా ఎలా ఉండాలి? ఇతరులను ఎలా గౌరవించాలి? అనే విలువలను 'ఇరుముడి' మనకు గుర్తుచేస్తుంది. అయితే నేటి భారతదేశంలో మతం పేరుతో విద్వేషాలు, విభజనలు, మైనారిటీలపై దాడుల ఆరోపణలు, సామాజిక ఉద్రిక్తతలు పెరగడం ఆందోళన కలిగించే విషయం. అధికారంలో ఉన్న వారు ప్రజలను మతాల పేరుతో విభజించకుండా, రాజ్యాంగ విలువలను కాపాడుతూ అందరికీ సమాన రక్షణ కల్పించాలి.

### అధికారం ప్రజల కోసం... వ్యక్తిగత ప్రయోజనాల కోసం కాదు

ప్రజల చేత ఎన్నుకోబడిన ప్రజాప్రతినిధి సమాజానికి ఆదర్శంగా ఉండాలి. అధికారం అనేది వ్యక్తిగత ఆధిపత్యం కోసం కాదు; ప్రజలకు సేవ చేయడానికి లభించిన బాధ్యత. ప్రజాప్రతినిధులు తమ అధికారాన్ని దుర్వినియోగం చేయకుండా, ప్రజల సమస్యల పరిష్కారం కోసం పనిచేయాలి. అవినీతి, అక్రమాలు, అధికార దుర్వినియోగాన్ని ప్రశ్నించడం ప్రతి పౌరుడి బాధ్యత.

### ఆడపిల్లను వస్తువుగా కాదు... భావితరాల నిర్మాణకర్తగా చూడాలి

ఆడపిల్లను ఒక ఆటబొమ్మగా, వినియోగ వస్తువుగా చూసే దృక్పథాన్ని సమాజం పూర్తిగా మార్చుకోవాలి. ఆమె రేపటి తల్లి మాత్రమే కాదు --- శాస్త్రవేత్త కావచ్చు, ఉపాధ్యాయురాలు కావచ్చు, డాక్టర్ కావచ్చు, న్యాయవాది కావచ్చు, రాజకీయ నాయకురాలు కావచ్చు, దేశాన్ని నడిపించే నాయకురాలు కావచ్చు. అందుకే ఆడపిల్లను కాపాడటం మాత్రమే కాదు... చదివించాలి, స్వేచ్ఛ ఇవ్వాలి, నిర్ణయం తీసుకునే హక్కు కల్పించాలి, ఆత్మవిశ్వాసంతో పెంచాలి. సమాజంలో మహిళలు సగం ఉన్నప్పుడు రాజకీయ, ఆర్థిక, సామాజిక రంగాల్లో వారికి సమాన ప్రాతినిధ్యం ఎందుకు ఉండకూడదు? మహిళలకు 50 శాతం రిజర్వేషన్ కల్పించాలనే డిమాండ్ బలపడాలి. ఆడపిల్ల పుట్టడమే భారంగా భావించే వివక్షను అంతం చేయాలి.

### ఆమెను పుట్టనిద్దాం..చదివిద్దాం... ధైర్యంగా పెంచుదాం... ఎదగనిద్దాం.

ప్రశ్నించే సమాజమే ప్రజాస్వామ్యానికి బలం అవినీతి జరిగితే ప్రశ్నించాలి. అధికార దుర్వినియోగం జరిగితే ప్రశ్నించాలి. మహిళలపై హింస జరిగితే ప్రశ్నించాలి. డ్రగ్స్ వ్యాప్తి జరిగితే ప్రశ్నించాలి. మతం పేరుతో విద్వేషాలు రెచ్చగొడితే ప్రశ్నించాలి. విద్య, ఉపాధి, రవాణా, భద్రత వంటి మౌలిక హక్కులు అందకపోతే ప్రశ్నించాలి. ఎందుకంటే ప్రశ్నించడం ప్రజాస్వామ్యంలో ప్రతి పౌరుడి హక్కు మాత్రమే కాదు-బాధ్యత కూడా. 'ఇరుముడి' సినిమా చూపించిన సామాజిక సమస్యలను కేవలం సినిమా చూసి మర్చిపోకుండా, వాటిపై చర్చించాలి. మార్పు కోసం సమాజం ఆలోచించాలి. ప్రభుత్వాలు బాధ్యత వహించాలి. యువత ముందుకు రావాలి. అమ్మాయిలను భయంతో కాదు... ధైర్యంతో పెంచుదాం. మహిళలను రక్షణ కోసం ఎదురుచూసే స్థితిలో కాకుండా, స్వేచ్ఛగా నిర్ణయాలు తీసుకునే స్థాయిలో నిలబెడదాం. మత విద్వేషాలను కాదు... మానవత్వాన్ని పెంచుదాం. అవినీతిని కాదు... ప్రశ్నించే సంస్కృతిని పెంచుదాం. ఆడపిల్లపై వివక్షను కాదు... సమానత్వాన్ని నిర్మిద్దాం.

# 1000 రోజులు..హామీలు గాలిలో..ప్రజలకు మిగిలింది మోసమే

- జాబ్ క్యాలెండర్,నిరుద్యోగ భృతి,ఫీజు రీయింబర్స్‌మెంట్,మహిళలకు రూ.2,500, వృద్ధులకు రూ.4,000 ఎక్కడ..?
- బీఆర్ఎస్ నిరసనను అడ్డుకోవడం ప్రజాస్వామ్య హక్కులపై దాడి..
- మాజీ ఎమ్మెల్యే గండ్ర వెంకట రమణారెడ్డి




**భూపాలపల్లి సెప్టెంబర్ 5 పీపుల్స్ డైరీ :** కాంగ్రెస్ ప్రభుత్వం అధికారంలోకి వచ్చి 1000 రోజులు పూర్తయినా ఎన్నికల సమయంలో ఇచ్చిన హామీల్లో ఒక్కటీ పూర్తిస్థాయిలో అమలు కాలేదని మాజీ ఎమ్మెల్యే గండ్ర వెంకట రమణారెడ్డి తీవ్రంగా విమర్శించారు.ఫీజు రీయింబర్స్‌మెంట్ ఇవ్వకుండా విద్యార్థులను, జాబ్ క్యాలెండర్ ప్రకటించి ఉద్యోగాలు ఇస్తామని, నిరుద్యోగ భృతి ఇస్తామని నిరుద్యోగులను మోసం చేసిన కాంగ్రెస్ ప్రభుత్వ పాలనకు నిరసనగా నేడు బిఆర్ఎస్ పార్టీ యూత్ మరియు విద్యార్థి విభాగం ఆధ్వర్యంలో చేపట్టిన నిరసన కార్యక్రమంలో పాల్గొన్న భూపాలపల్లి మాజీ ఎమ్మెల్యే గండ్ర వెంకట రమణా రెడ్డి..

**మాజీ ఎమ్మెల్యే గండ్ర మాట్లాడుతూ**

మా యొక్క నిరసన కార్యక్రమానికి ముందుగానే పోలీసులకు సమాచారం ఇచ్చామని, పూర్తిగా ప్రజాస్వామ్యబద్ధంగా, శాంతియుతంగా కార్యక్రమం నిర్వహిస్తామని స్పష్టం చేసినప్పటికీ మాకు అనుమతి ఉన్నప్పటికీ, అధికార దురహంకారంతో బీఆర్ఎస్ నాయకులను థియేటర్‌లో నిర్బంధించి, బయటకు రాకుండా భారీగా పోలీసులను మోహరించడం ప్రజాస్వామ్య హక్కులను కాలరాయడమేనని ఆయన మండిపడ్డారు.నిరసన తెలిపే హక్కును భారత రాజ్యాంగం ప్రతి పౌరుడికి కల్పించింది. ఆ హక్కును అడ్డుకునే అధికారం ఎవరికీ లేదు. రాజకీయ కార్యక్రమాలను అడ్డుకోవడం, కవ్వింపు చర్యలకు పాల్పడడం ప్రజాస్వామ్యానికి మంచిది పద్ధతి కాదు. బీఆర్ఎస్ ఎక్కడ కార్యక్రమం నిర్వహిస్తే అక్కడ అధికార పార్టీ పోటీ కార్యక్రమాలు ఏర్పాటు చేయడం సరికాదన్నారు.మా సభలకు పోటీగా సభలు పెట్టడం కాదు.ప్రజలకు ఇచ్చిన హామీలు అమలు చేయడంలో పోటీ పడండి. రైతులకు ఇచ్చిన హామీలు అమలు చేయండి. పెన్షన్లు పెంచండి. నిరుద్యోగులకు ఉద్యోగాలు ఇవ్వండి. విద్యార్థుల ఫీజు రీయింబర్స్‌మెంట్ బకాయిలు చెల్లించండి అని సూచించారు. జాబ్ క్యాలెండర్ ప్రకటించి నిరుద్యోగులకు ఉద్యోగాలు కల్పిస్తామని చెప్పిన కాంగ్రెస్ ప్రభుత్వం మాట తప్పిందని ఆరోపించారు. ఉద్యోగం రాకపోతే నెలకు రూ.4,000 నిరుద్యోగ భృతి ఇస్తామని హామీ ఇచ్చారని,అధికారంలోకి వచ్చిన తర్వాత నిరుద్యోగ భృతి గురించి ఒక్కసారి కూడా మాట్లాడలేదు. పేద విద్యార్థుల ఉన్నత విద్యకు గత ప్రభుత్వాలు అమలు చేసిన ఫీజు రీయింబర్స్‌మెంట్,విదేశాలల్లో చదువుకునే వారికీ ఓవర్సీస్ స్కాలర్‌షిప్‌లను ఇచ్చాయని,ప్రస్తుత ప్రభుత్వం ఫీజు బకాయిలు చెల్లించకపోవడంతో ప్రైవేట్ కళాశాలలు తీవ్ర ఆర్థిక ఇబ్బందులు ఎదుర్కొంటున్నాయని అన్నారు.ఫీజు బకాయిలపై ప్రభుత్వం ఆగస్టు 15 లోగా చెల్లింపులు చేస్తామని హైకోర్టులో హామీ ఇచ్చిందని, ఆగస్టు 15 దాటినా బకాయిలు చెల్లించలేదని అన్నారు. విద్యార్థుల ఫీజు రీయింబర్స్‌మెంట్‌ను సకాలంలో చెల్లించకపోవడంతో పేద విద్యార్థులు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారని అన్నారు.ఫీజులు చెల్లించకపోవడంతో కళాశాలలు టీసీలు ఇవ్వడం లేదు. బీఏ నుంచి ఇంజనీరింగ్, ఎంబీబీఎస్, ఎంసీఏ వరకు చదువుకున్న విద్యార్థులు టీసీల కోసం ఇబ్బందులు పడుతున్నారు" అని ఆవేదన వ్యక్తం చేశారు.భూభారతి పేరుతో తీసుకొచ్చిన మార్పులతో రైతులు, భూ యజమానులు ఇబ్బందులు ఎదుర్కొంటున్నారని ఆరోపించారు. 22-ఏ నిబంధనను తక్షణమే రద్దు చేసి పేద రైతుల భూములకు సంబంధించిన సమస్యలను పరిష్కరించాలని ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు.ఎన్నికల సమయంలో మహిళలకు నెలకు ₹2,500, వృద్ధులకు ₹4,000 పెన్షన్ ఇస్తామని హామీ ఇచ్చారని,ఆ హామీల పరిస్థితి ఏమైందని ప్రశ్నించారు. హామీలు ఇచ్చి ఓట్లు వేయించుకున్న తర్వాత ప్రజలను మర్చిపోవడం ప్రజాస్వామ్య పాలనా అని నిలదీశారు. ఇచ్చిన హామీలను అమలు చేయకుండా సంబరాలు చేసుకోవడం సిగ్గుచేటని అన్నారు.మా ప్రభుత్వ హయాంలో రైతులకు రైతుబంధు, పంటల కొనుగోళ్లు, విద్యుత్ సరఫరా వంటి అంశాల్లో తీసుకున్న చర్యలను ప్రస్తావించారు. కరోనా వంటి విపత్కర పరిస్థితుల్లోనూ రైతులకు రైతుబంధు, పంటల కొనుగోళ్లు కొనసాగించామని తెలిపారు.సింగరేణి కార్మికుల విషయంలోనూ ప్రస్తుత ప్రభుత్వం నిర్లక్ష్యంగా వ్యవహరిస్తోందని విమర్శించారు. మెడికల్ ఇన్వాలిడేషన్ ద్వారా కార్మికుల పిల్లలకు గతంలో ఉద్యోగాలు కల్పించామని, ప్రస్తుతం మెడికల్ బోర్డుల ద్వారా అర్హులైన వారికి కూడా ఉద్యోగాలు ఇవ్వకుండా ఇబ్బందులకు గురిచేస్తున్నారని ఆరోపించారు. రాష్ట్ర ఆర్థిక పరిస్థితి బాగాలేదని ప్రభుత్వం చెబుతున్నప్పటికీ, భారీగా అప్పులు చేస్తున్నారని విమర్శించారు. కోట్ల రూపాయల అప్పులు తెచ్చి భూపాలపల్లికి కొత్తగా ఏం చేశారు అని ప్రశ్నించారు. భూపాలపల్లిని జిల్లా చేసింది కేసిఆర్,ఎస్పీ కార్యాలయం తెచ్చింది కేసిఆర్,మెడికల్ కాలేజీ తెచ్చింది కేసిఆర్,డిగ్రీ కాలేజీ,మిషన్ భగీరథ ద్వారా తాగు నీరు,పెళ్ళి చేస్తే ఆడబిడ్డకు కళ్యాణ లక్ష్మి,కేసిఆర్ కిట్టు వంటి అనేక అభివృద్ధి కార్యక్రమాలు గత బీఆర్ఎస్ ప్రభుత్వ హయాంలోనే జరిగాయని అన్నారు.కాంగ్రెస్ ప్రభుత్వం నిజంగా అభివృద్ధి చేసి ఉంటే తాను స్వాగతిస్తానని అన్నారు.మీరు చేసిన అభివృద్ధి, ఇచ్చిన హామీల అమలుపై అంబేద్కర్ సెంటర్‌కు రండి. మీడియా సమక్షంలో అభివృద్ధిపై బహిరంగ చర్చకు సిద్ధం అని సవాలు విసిరారు.ప్రజలకు ఇచ్చిన హామీలను తక్షణమే అమలు చేయాలని, నిరుద్యోగులకు ఉద్యోగాలు లేదా నిరుద్యోగ భృతి, విద్యార్థులకు ఫీజు రీయింబర్స్‌మెంట్, మహిళలకు ₹2,500, వృద్ధులకు ₹4,000 పెన్షన్, రైతుల భూ సమస్యల పరిష్కారం, సింగరేణి కార్మికుల సమస్యల పరిష్కారంపై ప్రభుత్వం స్పష్టమైన నిర్ణయం తీసుకోవాలని డిమాండ్ చేశారు.

# మండల విద్యాశాఖ ఆధ్వర్యంలో ఘనంగా జాతీయ ఉపాధ్యాయ దినోత్సవం



**ఆళ్ళపల్లి సెప్టెంబర్ 5(పీపుల్స్ డైరీ) :** మండల కేంద్రంలోని విద్యావనరుల కేంద్రంలో జాతీయ ఉపాధ్యాయ దినోత్సవాన్ని పురస్కరించుకొని ఆళ్లపల్లి మండల విద్యాశాఖ ఆధ్వర్యంలో ఘనంగా ఉపాధ్యాయుల దినోత్సవాన్ని ఎంఈఓ కే శాంతారావు ఆధ్వర్యంలో నిర్వహించారు ఈ కార్యక్రమంలో పాల్గొన్న ఉద్యోగ సంఘాల నాయకులు వివిధ సీనియర్ ఉపాధ్యాయులు మాట్లాడుతూ ఉపాధ్యాయ వృత్తి ఎంతో గౌరవప్రదమైనదని ఉపాధ్యాయులు విద్యార్థుల యొక్క భవిష్యత్తు తీర్చిదిద్దే క్రమంలో ఎంతో కష్టపడి పని చేస్తూ వారి యొక్క భవిష్యత్ తరాలకు బాటలేస్తున్నారని కొనియాడారు ఈ సందర్భంగా మండల విద్యాధికారి శాంతారావు ,మర్కోడు కాంప్లెక్స్ ప్రధానోపాధ్యాయులు బి బాబు లాల్ మాట్లాడుతూ ఉపాధ్యాయ వృత్తి ఒక గౌరవప్రదమైనటువంటి వృత్తి అన్ని రంగాలలోని నిపుణులను తయారు చేయగలిగే ఒక మహోత్తమైన టువంటి గురుతరబాధ్యత ఉపాధ్యాయ వృత్తి ఈ వృత్తిలో ఉన్నందుకు గర్వంగా ఉంటూ మా వంతుగా శాయశస్తుల ప్రయత్నం చేస్తూ ఎంతో మంది విద్యార్థుల యొక్క భవిష్యత్తుకు బాటలు వేసేందుకు ప్రయత్నం చేస్తున్నాము ఈ సందర్భంగా మండలంలోని కొంత మంది ఉపాధ్యాయులను ఉత్తమ ఉపాధ్యాయులుగా ప్రకటించి సన్మానిం చడం జరిగింది మండల స్థాయిలో ఉత్తమ ఉపాధ్యాయులుగా ఎంపికైన వారు కే మమతా రాణి ఏ జి హెచ్ ఎస్ అనంతోగు , ఇర్ప బాలకృష్ణ ఎస్ ఏ బయోసైన్స్ మర్కోడ్ ,వి కోటేశ్వరమ్మ ఎస్ ఏ ఫిజిక్స్ జెడ్ పి హెచ్ ఎస్ ఆళ్లపల్లి, కే శారదామని ఎస్ఏ ఫిజిక్స్ జెడ్పిహెచ్‌ఎస్ మర్కోడు, సిహెచ్ సుధారాణి ఎస్ ఏ సోషల్ కేజీబీవీ అల్లపల్లి, కే లాలయ్య ఎల్ ఎఫ్ ఎల్ హెచ్ ఎం ఏపీఎస్ అనంతోగు ,టి నాగు ఎంపిపిఎస్ లొద్ది గూడెం జి కవిత ఎస్ జి టిఎంపీపీ ఎస్ వలసల బి ఈర్లాల్ ఎస్ జి టి జిపిఎస్ ఎలక బంధం ఏ స్వరూప జిపిఎస్ ఆర్ సి గుంపు. పైన తెలిపిన వారిని మండల విద్యా వనరుల కేంద్రంలో మండలంలోని ఉపాధ్యాయులందరూ ఘనంగా సన్మానించడం జరిగింది. ఈ కార్యక్రమంలో వివిధ సంఘాల ప్రధాన బాధ్యులు ATA రాష్ట్ర ముడిగ సమ్మయ్య, టిపిటిఎఫ్ జిల్లా ప్రధాన కార్యదర్శి జోగరాంబాబు, టి ఎస్ యుటిఎఫ్ జిల్లా కార్యదర్శి ఇస్లావత్ హథీరాం , పి ఆర్ టి యు మండల బాధ్యులువీరన్న, టీఎస్ పి టి ఎఫ్ మండల అధ్యక్షులు, ఇస్లావత్ నరేష్, టిపిటిఎఫ్ మండల అధ్యక్షులు బానోతు ఎశీయఖ టీఎస్ యుటిఎఫ్ మండల ప్రధాన కార్యదర్శి, అగ్గి రామ కృష్ణ, మండల అధ్యక్షులు చందర్ రావు టి పి టి ఎఫ్ మండల ప్రధాన కార్యదర్శి ముత్తయ్య అన్ని పాఠశాలల హెడ్మాస్టర్లు ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

# సర్వేపల్లి రాధాకృష్ణన్ జీవితం ఒక గొప్ప సందేశాన్ని అందిస్తుంది

- ఉపాధ్యాయ దినోత్సవం సందర్భంగా ప్రభుత్వ జూనియర్ కళాశాలలో గురువులకు ఏర్పాటు చేసిన సన్మాన కార్యక్రమంలో పాల్గొన్న మున్సిపల్ చైర్మన్ శ్రీ మొలుగు ప్రశాంత్ కుమార్ దిలీప్ ..




**గురువుకు వందనం జ్ఞానానికి అభివందనం!**

**జమ్మికుంట సెప్టెంబర్ 5 పీపుల్స్ డైరీ :** జమ్మికుంట పట్టణ పరిధిలోని ప్రభుత్వ జూనియర్ కళాశాలలో ఉపాధ్యాయ దినోత్సవం పురస్కరించుకొని ( ఎన్ ఎస్ ఎస్ ) జాతీయ సేవ పథకం వారు గురువులకు ఏర్పాటు చేసిన సన్మాన కార్యక్రమంలో పాల్గొన్న మున్సిపల్ చైర్మన్ శ్రీ మొలుగు ప్రశాంత్ కుమార్ దిలీప్ మాట్లాడుతూ ఇట్టి కార్యక్రమం ఆహ్వానించిన కుమార్ సార్ కి మరియు ఉపాధ్యాయులకు విద్యార్థిని విద్యార్థులకు ఉపాధ్యాయ దినోత్సవ శుభాకాంక్షలు తెలుపుతూ

జీవితంలో మనకు దారి చూపిన ప్రతి గురువును స్మరించుకునే రోజు ఉపాధ్యాయులు అక్షరాలు నేర్పిన మొదటి గురువు నుంచి జీవిత విలువలు నేర్పిన ప్రతి ఉపాధ్యాయుడి వరకు వారి కృషి మన ఎదుగుదలలో చెరగని ముద్ర వేస్తుంది డాక్టర్ సర్వేపల్లి రాధాకృష్ణన్ జీవితం ఒక గొప్ప సందేశాన్ని అందిస్తుంది పేదరికం అడ్డంకి కాలేదు అవకాశాల కొరత లక్ష్యాన్ని ఆపలేదు నిరంతర అధ్యయనం,జ్ఞానపిపాస, పట్టుదల ఆయనను దేశ అత్యున్నత పదవికి చేర్చాయి అందుకే సెప్టెంబర్ 5 కేవలం ఒక వేడుక కాదు గురువు విలువను గుర్తుచేసుకునే రోజు జ్ఞానాన్ని పంచే ప్రతి గురువుకూ మనస్ఫూర్తిగా వందనం అభివందనం అని తెలుపుతూ గురువుల శాలువాతో సత్కరించి జ్ఞాపికను అందజేసి విద్యార్థిని విద్యార్థులు విద్యా బుద్ధులు నేర్పిన గురువులకు తల్లిదండ్రులకు మంచి పేరు తీసుకురావాలని తెలుపుతూ నేను మున్సిపల్ చైర్మన్ గా ఉన్న సమయంలో ప్రహరీ గోడ నిర్మాణం పూర్తి అయ్యేలా చూస్తామని తెలిపారు ఈ కార్యక్రమంలో ప్రిన్సిపల్ వీ. కుమార్, ఎన్ ఎస్ ఎస్ ఆఫీసర్స్ ఖ. తిరుపతి,జు, జ్యోత్స్నదేవకీ, అధ్యాపకులు జష్ట్ర, విశ్వనాథ్ రెడ్డి,+. ప్రభాకర్,ఐ. మహేష్,వీ. శ్రీధర్,వా.శ్రీనివాస్ తదితరులు పాల్గొన్నారు.

# ఇందిరమ్మ ఇల్లు పారదర్శకంగా కమిటీ సభ్యులు ఇప్పించగలరు



**సైదాపూర్ ,సెప్టెంబర్ 5 ( పీపుల్స్ డైరీ) :** శిథిలావస్థలో ఉన్న పాత ఇల్లు పైకప్పు భాగం కూలి పెను ప్రమాదం తప్పిన సంఘటన బొమ్మకల్ గ్రామం లో చోటుచేసుకుంది. బాధితుల వివరాల ప్రకారం సైదాపూర్ మండలంలోని బొమ్మకల్ గ్రామానికి చెందిన మద్దెల లచ్చమ్మ -మద్దెల లావణ్య(ఇల్లు ) ఉదయం నిద్ర లేచి బయటకు వెళ్లే సమయంలో తన ఇంటి పైకప్పు భాగం ప్రమాదవశత్తు ఒక్కసారిగా కూలిపోయిందని ఆ శబ్దానికి నిద్రలో నుంచి మేల్కొని, కుటుంబ సభ్యులు లేచి చూసేసరికి తమ పక్కనే ఇంటి పైకప్పు భాగం కూలి పడడంతో, భయభ్రాంతులకు గురై ఉలిక్కిపడ్డామని, ఆ సమయంలో ఏం చేయాలో తెలియక దిక్కుతోచని స్థితిలో ఇంటి లోపల నుండి పరుగున బయటికి వెళ్లానని అన్నారు .ఎన్నో ఏళ్ల నుండి మట్టి గోడలు కుమ్మరి పెంక,పాలిథిన్ కవర్లతో కప్పబడి తమ ఇల్లు శిథిలావస్థలో ఉందని ప్రతి వర్షాకాలం సీజన్లో గోడలు తడుస్తూ ఎప్పుడు కూలుతుందో తెలియని పరిస్థితిలో తామున్నామన్నారు.గతంలో అధికారులకు సమాచారం అందించినా ప్రజా పాలనలో ఇందిరమ్మ ఇల్లు మంజూరుకు దరఖాస్తు చేసుకున్నా కానీ ఇందిరమ్మ కమిటీ సభ్యులు, తమకు ఇల్లు మంజూరు చేయలేదని, ఇప్పటికైనా గ్రామ సర్పంచ్ ఇందిరమ్మ కమిటీ సభ్యులు, ఇందిరమ్మ ఇల్లు ఇప్పించగలరని,భాధితులు మద్దెల లచ్చమ్మ, మద్దెల - లావణ్యలకు ఇల్లు ఇప్పించాలని అధికారులను ప్రజాప్రతి నిధులకు వేడుకుంది

# తెలంగాణ రాజ్యాధికార పార్టీలోకి కొనసాగుతున్న చేరికల పరంపర



**హుజురాబాద్, సెప్టెంబర్ 5 (పీపుల్స్ డైరీ) :** తెలంగాణ రాజ్యాధికార పార్టీలోకి వివిధ పార్టీలకు చెందిన నాయకులు, కార్యకర్తలు, మహిళలు పెద్ద ఎత్తున చేరారు. తెలంగాణ రాజ్యాధికార పార్టీ రాష్ట్ర కార్యదర్శి అఖిల్ పాషా, జిల్లా అధ్యక్షురాలు గంగిపెల్లి అరుణ, జిల్లా కార్యదర్శి దాట్ల శ్రీనివాస్ ఆదేశాల మేరకు హుజురాబాద్ మండల అధ్యక్షుడు తిరగమల్ల నాగార్జున ఆధ్వర్యంలో మండలంలోని కాట్రపల్లి గ్రామంలో ఈ చేరికలు జరిగాయి.ఈ సందర్భంగా పలువురు నాయకులు, కార్యకర్తలు, మహిళలు తెలంగాణ రాజ్యాధికార పార్టీలో చేరారు. అనంతరం కాట్రపల్లి గ్రామ తెలంగాణ రాజ్యాధికార పార్టీ మహిళా విభాగం కమిటీని ఏర్పాటు చేశారు. కమిటీ అధ్యక్షురాలిగా మాడుగుల శ్రీ విద్య, ప్రధాన కార్యదర్శిగా మైస సరితను నియమించారు. నూతన కమిటీ సభ్యులను ఉద్దేశించి మండల అధ్యక్షుడు తిరగమల్ల నాగార్జున మాట్లాడుతూ పార్టీ పదవులను కేవలం పదవులుగా కాకుండా బాధ్యతలుగా భావించాలని సూచించారు. ప్రజలకు ఎలాంటి సమస్య ఎదురైనా వారి గొంతుకగా నిలవాలని, ప్రజా సమస్యల పరిష్కారం కోసం నిరంతరం కృషి చేయాలని కోరారు. హుజురాబాద్ నియోజకవర్గంలో తెలంగాణ రాజ్యాధికార పార్టీని అధికారంలోకి తీసుకువచ్చే వరకు నాయకులు, కార్యకర్తలు అహర్నిశలు కృషి చేయాలని పిలుపునిచ్చారు.ఈ కార్యక్రమంలో మండల ప్రధాన కార్యదర్శి మాడుగుల రాజు, మండల అధికార ప్రతినిధి బొడ్డు సురేష్ తదితరులు పాల్గొన్నారు

# తప్పుడు మరణ ధృవీకరణ పత్రం జారీ చేసిన పంచాయతీ కార్యదర్శిపై విచారణ

**ఇందుర్తి జీపిలో విచారణ చేపట్టిన కరీంనగర్ డిఎల్ పిఓ**



**చిగురుమామిడి,సెప్టెంబర్ 05(పీపుల్స్ డైరీ):** తప్పుడు మరణ ధృవీకరణ పత్రం జారీ చేసిన ఇందుర్తి గ్రామ పంచాయతీ కార్యదర్శిపై సమగ్ర విచారణ జరిపి,తక్షణమే చట్టపరమైన చర్యలు తీసుకోవాలని ఇందుర్తి ఉపసర్పంచ్ చింతపూల అనిల్ కుమార్,పలువురు వార్డు సభ్యులు తిరుపతి, కిరణ్,అనిల్,లావణ్య,విజయలు ఆగస్టు 24న కరీంనగర్ ప్రజావాణిలో ఫిర్యాదు చేశారు. జిల్లా అధికారుల ఆదేశాల మేరకు కరీంనగర్ డిఎల్ పి ఓ హరికిషన్,చిగురుమామిడి ఎంపీవో కిరణ్ కుమార్ లు ఇందుర్తి గ్రామ పంచాయతీ కార్యాలయంలో శనివారం ప్రాథమిక విచారణ చేపట్టారు. ఇందుర్తి గ్రామానికి చెందిన షేక్ జహాబీ (భర్త షేక్ షర్ఫుద్దీన్) అనే మహిళ 02-09-2025న మరణించారు.అయితే సదరు గ్రామ పంచాయతీ కార్యదర్శి ఆమె 02-06-2026న మరణించినట్లుగా తప్పుడు వివరాలతో మరణ ధృవీకరణ పత్రాన్ని జారీ చేశారని ఫిర్యాదులో ఆరోపించారు.ప్రభుత్వ నిబంధనలకు విరుద్ధంగా, విధుల దుర్వినియోగానికి పాల్పడి ఇలాంటి తప్పుడు పత్రాలు ఇవ్వడంపై స్థానికులు తీవ్ర అభ్యంతరం వ్యక్తం చేస్తున్నారని ఉపసర్పంచ్ తెలిపారు.ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ గ్రామపంచాయతీ కార్యదర్శి వ్యవహారంపై పూర్తిస్థాయిలో విచారణ జరపాలని,గ్రామంలో ఇలాంటి తప్పుడు ధృవీకరణ పత్రాలు ఇంకేమైనా జారీ చేశారా,అనే కోణంలో కూడా విచారణ జరపాలని అధికారులను కోరినట్లు తెలిపారు.

# నిరుపేదలకు హెచ్ఎఫ్ఎం చారిటీ ట్రస్ట్ చేయూత

**ప్రపంచ దాతృత్వ దినోత్సవం సందర్భంగా నిత్యావసర వస్తువుల పంపిణీ**




**ఆళ్ళపల్లి సెప్టెంబర్ 5(పీపుల్స్ డైరీ) :** మండల కేంద్రము లో ప్రపంచ దాతృత్వ దినోత్సవాన్ని పురస్కరించుకుని మహబూబాబాద్ హెచ్ఎఫ్ఎం చారిటీ ట్రస్ట్ జిల్లా ఆధ్వర్యంలో ఆళ్లపల్లి మండల కేంద్రంలో నిరుపేద కుటుంబాలకు శనివారం నిత్యావసర వస్తువులు పంపిణీ చేశారు. ఈ సందర్భంగా ట్రస్ట్ ఫౌండర్ బిషప్ గుండెపాక వెంకన్న ఇశ్రాయేలు మాట్లాడుతూ.. "నిన్నువలె నీ పొరుగువారిని ప్రేమించు" అనే ప్రభువు సందేశం స్ఫూర్తితో సేవా కార్యక్రమం నిర్వహించినట్లు తెలిపారు. ఆపదలో ఉన్న నిరుపేద కుటుంబాలకు అండగా నిలవడం ప్రతి ఒక్కరి బాధ్యత అన్నారు. భవిష్యత్తులోనూ అవసరమైన వారికి తమ ట్రస్ట్ ద్వారా సేవా కార్యక్రమాలు కొనసాగిస్తామని తెలిపారు. స్థానిక ట్రస్ట్ నాయకులు కండె రాంబాబు ఆధ్వర్యంలో కార్యక్రమం నిర్వహించారు. నిరుపేద కుటుంబాలకు నిత్యావసర వస్తువులు అందజేయడంతో పలువురు హర్షం వ్యక్తం చేశారు. ఈ కార్యక్రమంలో ట్రస్ట్ ఎగ్జిక్యూటివ్ డైరెక్టర్ గుండెపాక సునీత, బోర్డు సభ్యులు పడిశాల జాన్ విక్టర్, కందిపాటి రాంబాబు, మల్లెపాక ప్రణయ్, జి. బాలు నాయక్, కోటేష్, రామయ్య, సిస్టర్ వసుమతి, శాంత, శిరోమణి, విజయ్ తదితరులు పాల్గొన్నారు.

# భీమదేవరపల్లి:- ఎర్త్ వైరు తగిలి మూడేళ్ల బాలుడు మృతి



**భీమదేవరపల్లి సెప్టెంబర్ 5 (పీపుల్స్ డైరీ ) :** నూతనంగా ఏర్పాటు చేసిన ట్రాన్స్ఫారం వద్ద ఎర్త్ వైర్ తగిలి మూడేళ్ల బాలుడు మృతి చెందిన ఘటన హన్మకొండ జిల్లా భీమదేవరపల్లి మండలం వీరభద్ర నగర్ లో చోటుచేసుకుంది.. స్థానికుల వివరాల మేరకు తండాకు చెందిన బానోతు సంపత్ కుమారుడు రిషి (3) నూతనంగా ఏర్పాటు చేసిన ట్రాన్స్ఫారం ఎర్త్ వైర్ తగిలి మృతి చెందినట్లు తెలిపారు.. పూర్తి వివరాలు తెలియాల్సి ఉంది...

# జిల్లా ఉత్తమ ఉపాధ్యాయుడిగా లక్కిరెడ్డి రాజిరెడ్డి



**భీమదేవరపల్లి సెప్టెంబర్ 5 (పీపుల్స్ డైరీ ) :** ముత్తారం ప్రభుత్వ ప్రాథమిక పాఠశాల ఉపాధ్యాయులు లక్కిరెడ్డి రాజిరెడ్డి జిల్లా ఉత్తమ ఉపాధ్యాయుడిగా ఎంపికయ్యారు. ఉపాధ్యాయ దినోత్సవం సందర్భంగా శనివారం ముత్తారం ప్రభుత్వ ప్రాథమిక పాఠశాలలో ఆయనను ఘనంగా సన్మానించారు. ఈ సందర్భంగా గ్రామ సర్పంచ్ ఊరడి భారతి జైపాల్ రెడ్డి, ఉపసర్పంచ్ మాట్ల హరికుమార్, ముల్కనూర్ క్లస్టర్ ప్రధానోపాధ్యాయులు వసంత రావు, పాఠశాల ప్రధానోపాధ్యాయురాలు ప్రియదర్శిని తదితరులు రాజిరెడ్డిని శాలువాతో సత్కరించి అభినందనలు తెలిపారు. విద్యార్థులకు నాణ్యమైన విద్య అందించడంతో పాటు పాఠశాల అభివృద్ధికి ఆయన చేస్తున్న సేవలను కొనియాడారు. అనంతరం జిల్లా కేంద్రంలో నిర్వహించిన ఉపాధ్యాయ దినోత్సవ కార్యక్రమంలో జిల్లా కలెక్టర్ చాహత్ బాజ్‌పాయ్ జిల్లా ఉత్తమ ఉపాధ్యాయుడిగా ఎంపికైన లక్కిరెడ్డి రాజిరెడ్డిని ఘనంగా సన్మానించి అభినందించారు. జిల్లా స్థాయిలో ఉత్తమ ఉపాధ్యాయుడిగా గుర్తింపు పొందడం ముత్తారం గ్రామానికి, పాఠశాలకు గర్వకారణమని పలువురు పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో పంచాయతీ కార్యదర్శి నరేష్, సిఆర్పి మాడుగుల హిమసాగర్, అమ్మ ఆదర్శ పాఠశాల అధ్యక్షురాలు మాడుల నిర్మల, వార్డు సభ్యురాలు పార్నందుల నవిత, ఫీల్డ్ అసిస్టెంట్ మహేందర్, గ్రామస్తులు బుసుమల్ల రాజు, రేణిగుంట్ల విద్యాసాగర్, అనూష, కోమల, మమత తదితరులు పాల్గొన్నారు.

# కేటీఆర్‌కు తృటిలో తప్పిన ప్రమాదం.. కారును ఢీకొట్టిన లారీ



బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్ తృటిలో రోడ్డు ప్రమాదం నుంచి బయటపడ్డారు. కరీంనగర్‌కు వెళుతుండగా శనివారం ఈ ఘటన చోటు చేసుకుంది. ఈ ప్రమాదంలో ఆయన ప్రయాణిస్తున్న కారు పాక్షికంగా దెబ్బతిన్నప్పటికీ, కేటీఆర్‌కు ఎలాంటి గాయాలు కాకపోవడంతో అందరూ ఊపిరి పీల్చుకున్నారు. కరీంనగర్‌లో నిర్వహించ తలపెట్టిన విద్యార్థి, యువజన సదస్సులో పాల్గొనేందుకు కేటీఆర్ శనివారం బయలుదేరారు. మార్గమధ్యలో అలుగునూరు వద్ద ఆగగా, పార్టీ కార్యకర్తలు ఆయనకు ఘన స్వాగతం పలికారు. అక్కడ కార్యక్రమం ముగించుకుని ప్రయాణం తిరిగి ప్రారంభమైన వెంటనే, కారుకు సమాంతరంగా వెళుతున్న ఒక లారీ వేగంగా వచ్చి ఢీకొట్టింది. ఈ ఘటనలో కారు వెనుక భాగంలోని డోర్ తీవ్రంగా దెబ్బతింది. ప్రమాద సమయంలో కేటీఆర్ కారులోనే ఉన్నప్పటికీ, ఆయన సురక్షితంగా బయటపడటంతో పార్టీ శ్రేణులు ఊపిరి పీల్చుకున్నాయి.కేటీఆర్ ప్రయాణాల్లో ఇలాంటి ఘటనలు చోటుచేసుకోవడం ఇదే మొదటిసారి కాదు. ఈ ఏడాది జులైలో జనగామ జిల్లా స్టేషన్ ఘన్‌పూర్ వద్ద ఆయన కాన్వాయ్‌లోని రెండు కార్లు ఒకదానికొకటి ఢీకొన్నాయి. ఆ ప్రమాదంలో ఎమ్మెల్సీ శంభీపూర్ రాజుకు గాయాలయ్యాయి.

# సీఎం రేవంత్ ను దూషించలేదు..

## అప్పుడు అన్నది ఒకట్రెండు విషయాల్లోనే: కోమటిరెడ్డి రాజగోపాల్ రెడ్డి



కాంగ్రెస్ ప్రభుత్వంపై, ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి తీరుపై అవకాశం దొరికినప్పుడల్లా విమర్శనాస్త్రాలు సంధించే మునుగోడు ఎమ్మెల్యే కోమటిరెడ్డి రాజగోపాల్ రెడ్డి ఒక్కసారిగా యు-టర్న్ తీసుకున్నారు. తాను రేవంత్ రెడ్డిని ఎప్పుడూ దూషించలేదని, కేవలం ఒకట్రెండు అంశాల్లో మాత్రమే అభిప్రాయ భేదాలు వచ్చాయని క్లారిటీ ఇచ్చారు. రేవంత్‌తో తనకు ఎలాంటి వ్యక్తిగత వైరం లేదని స్పష్టం చేసిన ఆయన, సీఎం సొంత నియోజకవర్గం కొడంగల్, డిప్యూటీ సీఎం నియోజకవర్గం మధిర స్థాయిలోనే తన మునుగోడు నియోజకవర్గానికి కూడా రూ. 2 వేల కోట్ల నిధులు వచ్చాయని ప్రశంసల జల్లు కురిపించారు. త్వరలో జరగబోయే సీఎం బహిరంగ సభకు వేలాది మంది కార్యకర్తలతో తరలివెళతానని చెప్పారు.

# కొండా సురేఖ చేరికపై బీజేపీ నేత మురళీధర్ రావు కీలక వ్యాఖ్యలు

## తెలంగాణలో బీఆర్ఎస్, కాంగ్రెస్‌లకు బీజేపీనే ప్రత్యామ్నాయమని వ్యాఖ్య

మాజీ మంత్రి కొండా సురేఖ బీజేపీలో చేరనున్నారంటూ వస్తున్న వార్తలపై ఆ పార్టీ సీనియర్ నేత మురళీధర్‌రావు స్పందించారు. ఈ ప్రచారాన్ని ఆయన తోసిపుచ్చుతూ, పార్టీలో చేరికలపై తమకంటూ ఒక స్పష్టమైన విధానం ఉందని తెలిపారు. "ఎవరిని పడితే వారిని పార్టీలో చేర్చుకోబోం" అని ఆయన శనివారం స్పష్టం చేశారు.కొండా సురేఖ చేరిక ప్రచారం వెనుక రాజకీయ కారణాలు ఉన్నాయని మురళీధర్‌రావు ఆరోపించారు. "ప్రస్తుతం కాంగ్రెస్ పార్టీలో అంతర్గత సంక్షోభం నెలకొంది. ఆ అంశం నుంచి ప్రజల దృష్టిని మళ్లించేందుకే ఇటువంటి కథనాలను ప్రచారంలోకి తెస్తున్నారు"

# రాష్ట్ర ప్లీనరీ సమావేశాలను జయప్రదం చేయండి

- యుఎస్ఎఫ్ఐ హనుమకొండ జిల్లా అధ్యక్ష కార్యదర్శులు ఆకుల మనోజ్ రాజేష్ నాయక్



**భీమదేవరపల్లి సెప్టెంబర్ 05 (పీపుల్స్ డైరీ ) :** భారత ఐక్య విద్యార్థి ఫెడరేషన్ యుఎస్ఎఫ్ఐ హనుమకొండ జిల్లా కమిటీ ఆధ్వర్యంలో ఈనెల 18,19 20 తేదీలలో సంగారెడ్డి లో జరిగే రాష్ట్ర ప్లీనరీ సమావేశాలను జయప్రదం చేయాలని అంబేద్కర్ కూడలి వద్ద బ్రోచర్ ఆవిష్కరణ చేయడం జరిగింది. ఈ సందర్భంగా జిల్లా అధ్యక్ష కార్యదర్శులు ఆకుల మనోజ్ రాజేష్ నాయక్ మాట్లాడుతూ.... రాష్ట్రవ్యాప్తంగా విద్యార్థులు ఎదుర్కొంటున్న సమస్యలు ఫీజు రీయింబర్స్మెంట్ స్కాలర్షిప్స్ రాక విద్యార్థులు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటు న్నారని ప్రభుత్వం నుండి రావలసిన బకాయిలు విడుదల కాకపోవడంతో కళాశాలలో సర్టిఫికెట్లు ఇవ్వడం లేదని తద్వారా పై చదువులకు వెళ్లలేక ఇబ్బందులు పడుతున్నారని దీనితో చదువులకు దూరం అయ్యే ప్రమాదం ఉందని అన్నారు అదేవిధంగా రాష్ట్రంలో సంక్షేమ హాస్టల్లో గురుకులాలలో పూర్తిస్థాయిలో సొంత భవనాలు లేక తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నారని కనీసం పిడి పూర్తిస్థాయి టీచింగ్ నాన్ టీచింగ్ ఫ్యాకల్టీ లేక ఇబ్బందులు ఎదుర్కొంటున్నారని వెంటనే వాటిని భర్తీ చేయాలని మరియు విద్యార్థులకు రావాల్సిన మిస్కామోటిక్ బిల్లులను వెంటనే ప్రభుత్వం విడుదల చేయాలని అన్నారు, రాష్ట్రవ్యాప్తంగా ఖాళీగా ఉన్న లెక్చరర్, డీఈఓ ఎంఈఓ పోస్టులు భర్తీ చేయాలన్నారు ప్రభుత్వ పాఠశాలలో నెలకొన్న సమస్యలను పరిష్కరించాలని పాఠశాలలకు గ్రాండ్స్ విడతలవారీగా కేటాయించాలని అన్నారు. సంగారెడ్డి పట్టణంలో నిర్వహించే ప్లీనరీ సమావేశా లలో అనేక అంశాలు చర్చించి విద్యార్థుల పక్షాన నిరంతరం పోరాటం చేస్తామని తెలిపారు ఈ సమావేశాలను విద్యార్థులు మేధావులు కవులు కళాకారులు పెద్ద ఎత్తున హాజరై విజయవంతం చేయాలని పిలుపునిచ్చారు.ఈ కార్యక్రమంలో జిల్లా నాయకులు మహేష్ రాజు కిరణ్ ప్రవీణ్ శ్రీలత సుమలత రాణి తదితరులు పాల్గొన్నారు.

# పెరుగుతున్న రోగులు.. అందుబాటులో లేని వైద్యులు

- నామమాత్రంగా సేవలు
- ముల్కనూర్ పీహెచ్‌సీలో వైద్యం కరువు!

**భీమదేవరపల్లి సెప్టెంబర్ 5 (పీపుల్స్ డైరీ ) :** మండలంలోని ప్రధాన గ్రామమైన ముల్కనూర్‌లో ప్రజలకు మెరుగైన వైద్యం అందించాల్సిన ప్రాథమిక ఆరోగ్య కేంద్రం సమస్యలతో కొట్టుమిట్టాడుతోంది. రోజురోజుకూ వైద్య సేవల కోసం వచ్చే రోగుల సంఖ్య పెరుగుతున్నప్పటికీ, అందుకు అనుగుణంగా వైద్య సిబ్బంది, మౌలిక సదు-పాయాలు అందుబాటులో లేకపోవడంతో ప్రజలు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నారని స్థానికులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. శనివారం ఉదయం 11 గంటల సమయంలో పీహెచ్‌సీకి వైద్యం కోసం పలువురు రోగులు రావడంతో ఆసుపత్రి వద్ద రద్దీ కనిపించింది. అయితే వైద్యులు అందుబాటులో లేకపోవడంతో అక్కడ ఉన్న నర్సు, ఫార్మాసిస్టు మాత్రమే రోగులను పరిశీలించి మందులు అందించినట్లు రోగులు తెలిపారు. అత్యవసర పరిస్థితుల్లో వైద్యుడు అందుబాటులో లేకపోవడం ఆందోళన కలిగిస్తోందని వారు పేర్కొన్నారు.

### 24 గంటల వైద్యం ఎప్పుడొస్తుంది?

ముల్కనూర్ మండలంలోని మేజర్ గ్రామం కావడంతో చుట్టుపక్కల గ్రామాల ప్రజలు కూడా ఈ ఆసుపత్రిపై ఆధారపడుతున్నారు. పీహెచ్‌సీని ఉన్నతీకరించి 24 గంటల వైద్య సేవలు అందించాలని స్థానికులు గత కొంతకాలంగా డిమాండ్ చేస్తున్నప్పటికీ, ఇప్పటివరకు ఆ దిశగా ఆశించిన స్థాయిలో చర్యలు కనిపించడం లేదని విమర్శిస్తున్నారు.

### ప్రైవేటు ఆసుపత్రులే దిక్కా?

ప్రభుత్వ ఆసుపత్రిలో వైద్యులు, సిబ్బంది పూర్తిస్థాయిలో అందుబాటులో ఉండి, అవసరమైన సౌకర్యాలు కల్పిస్తే పేద, మధ్యతరగతి ప్రజలు ప్రైవేటు ఆసుపత్రులను ఆశ్రయించాల్సిన అవసరం ఉండదని స్థానికులు



అంటున్నారు. ప్రభుత్వాలు మారుతున్నా, ప్రజాప్రతినిధులు మారుతున్నా ముల్కనూర్ ఆసుపత్రి పరిస్థితుల్లో మాత్రం మార్పు రావడం లేదని వారు అసంతృప్తి వ్యక్తం చేస్తున్నారు.వైద్య సిబ్బందిని పూర్తిస్థాయిలో నియమించి, అవసరమైన మౌలిక వసతులు కల్పించడంతో పాటు ముల్కనూర్ పీహెచ్‌సీని ఉన్నతీకరించి 24 గంటల వైద్య సేవలు అందించాలని ప్రజలు సంబంధిత ఉన్నతాధికారులను కోరుతున్నారు.

# బొప్పాయి గింజలతో మిరియాల కల్తీ.. ఇంట్లోనే గుర్తించే సింపుల్ మార్గాలివే!

- నల్ల మిరియాల్లో కల్తీని ఇంట్లోనే ప్రాథమికంగా గుర్తించే ఆస్కారం
- రంగు, పైపొర, ఆకారాన్ని ముందుగా పరిశీలించాలి
- కొన్ని మిరియాలను నొక్కి వాటి గట్టిదనాన్ని చూడాలి
- తాజా మిరియాలకు ఘాటైన ప్రత్యేక వాసన

నీటిలో వేసినప్పుడు బొప్పాయి గింజలు తేలే అవకాశం

వంటింట్లో నల్ల మిరియాలకు ప్రత్యేక స్థానం ఉంది. కూరల్లో ఘాటును పెంచే ఈ మసాలా నిజమైనదేనా? కల్తీ జరిగిందా? అనేది గుర్తించడం అంత సులభం కాదు. మిరియాల్లా కనిపించే బొప్పాయి గింజలు, చిరుధాన్యాలు, ఆవాలు, పిండి పదార్థాలు వంటి వాటిని కలిపే అవకాశం ఉంది. అయితే కొనుగోలు చేసిన మిరియాలను ఇంట్లోనే కొన్ని సులభమైన పద్ధతుల్లో పరిశీలించొచ్చు.

### రంగు, ఆకారం

అసలైన నల్ల మిరియాలు సాధారణంగా ముదురు గోధుమ నుంచి నలుపు రంగులో ఉంటాయి. వాటి పైభాగం సహజంగా ముడతలు పడినట్లు కనిపిస్తుంది. చాలా తేలిక రంగులో, నునుపుగా లేదా మిరియాలకు భిన్నంగా కనిపించే గింజలు ఉంటే వాటిని ప్రత్యేకంగా గమనించాలి. ఒక్క గింజ రూపం ఆధారంగా కల్తీ అని నిర్ధారించకూడదు.

### నొక్కి చూడండి

కొన్ని మిరియాలను పొడి, శుభ్రమైన ప్రదేశంలో పెట్టి వేలితో మెల్లగా నొక్కండి. మంచి మిరియాలు సులభంగా ముక్కలుగా విడిపోవు. తేలికగా ఉండే కల్తీ పదార్థాలు మాత్రం త్వరగా విరిగిపోవచ్చు. ఒకటి రెండు గింజలతో కాకుండా కొన్ని గింజలను పరీక్షించడం మంచిది.

### వాసన చెబుతుంది

తాజా నల్ల మిరియాలకు ఘాటైన ప్రత్యేకమైన వాసన ఉంటుంది. ఒకట్రెండు గింజలను నలిపి వాసన చూడండి. వాసన చాలా బలహీనంగా ఉన్నా, సాధారణ మిరియాల వాసనకు భిన్నంగా ఉన్నా నాణ్యతపై అనుమానం రావొచ్చు.

### గింజలను విడిగా పరిశీలించండి

మిరియాలను ఒక్కొక్కటిగా చూడండి. పరిమాణం, ఆకారం, రంగు, పైపొరలో స్పష్టమైన తేడాలు కనిపిస్తే వాటిని పక్కన పెట్టండి. బొప్పాయి గింజలు కొన్ని సందర్భాల్లో మిరియాలను పోలి కనిపించొచ్చు.

### నీటిలో వేసి చూడండి

కొన్ని మిరియాలను పారదర్శక గ్లాసు నీటిలో వేయండి. మిరియాలు సాధారణంగా అడుగునకు చేరుతాయి. కల్తీకి ఉపయోగించే బొప్పాయి గింజలు తేలే అవకాశం ఉంది. అయితే ఇది కల్తీని పూర్తిగా నిర్ధారించే పరీక్ష కాదు.

### తెల్ల కాగితంపై పరచండి

తెల్ల కాగితంపై మిరియాలను పరిచి దగ్గరగా చూడండి. అవసరమైతే భూతద్దంతో పరిశీలించండి. ముదురు గోధుమ లేదా నలుపు-గోధుమ రంగు, ముడతలతో కూడిన సహజమైన పైపొర కనిపించాలి. అనుమానాస్పద గింజలు కనిపిస్తే వాటిని వేరు చేయడం మంచిది.

# క్షేత్రస్థాయి తనిఖీల్లో పాసైతేనే.. ఇందిరమ్మ ఇల్లు!

## అదే నియోజకవర్గంలో నివాసం, సరైన పత్రాలు ఉంటేనే అర్హత



ఇందిరమ్మ ఇళ్ల పథకం కింద లాటరీలో పేరు వచ్చిందని సంబరపడితే సరిపోదు. ఆ ఇల్లు మీకు దక్కాలంటే క్షేత్రస్థాయిలో అధికారుల తనిఖీలో అర్హత సాధించడం తప్పనిసరి. దరఖాస్తు చేసుకున్న నియోజకవర్గంలోనే నివసిస్తూ, అవసరమైన ధ్రువపత్రాలు కలిగి ఉంటేనే తుది జాబితాలో పేరు ఉంటుంది. లేదంటే లాటరీలో గెలిచినా అనర్హులుగా మిగిలిపోవాల్సిందే. హౌసింగ్ బోర్డు అధికారులు 16 నియోజకవర్గాల్లో లాటరీ ద్వారా ఎంపికైన వారి వివరాలను క్షేత్రస్థాయి-ిలో పరిశీలిస్తున్నారు. దీనికోసం ప్రత్యేకంగా రూపొందించిన మొబైల్ యాప్‌ను ఉపయోగిస్తున్నారు. లబ్ధిదారులు అద్దె ఇంట్లో ఉంటున్నారా, ఇంటి స్వరూపం (ఆర్సీసీ, రేకుల షెడ్), ఎంతకాలంగా నివసిస్తున్నారు, కుటుంబ సభ్యుల వివరాలు సేకరించి, ఇంటి ఫొటోలతోపాటు యాప్‌లో నమోదు చేస్తున్నారు. దరఖాస్తు సమయంలో ఎలాంటి పత్రాలు తీసుకోకపోవడంతో, వాస్తవాలను నిర్ధారించుకునేందుకు ఈ తనిఖీలు చేపట్టినట్లు అధికారులు తెలిపారు. ఈ పరిశీలనలో పలు ఆసక్తికర విషయాలు వెలుగులోకి వస్తున్నాయి. శేరిలింగంపల్లిలో లాటరీ గెలిచిన ఓ మహిళ, ప్రస్తుతం కూకట్‌పల్లి నియోజకవర్గంలో నివసిస్తుండటంతో అనర్హురాలిగా తేలింది. మరోచోట, లబ్ధిదారురాలి వద్ద కుల ధ్రువీకరణ పత్రం లేకపోవడంతో ఆమె పేరును జాబితా నుంచి తొలగించారు. స్థానికులకే ఇళ్లు కేటాయించాలని ఎమ్మెల్యేల నుంచి డిమాండ్ వస్తుండటంతో అధికారులు తనిఖీలను కఠినంగా నిర్వహిస్తున్నారు. ఖైరతాబాద్‌లో ఎంపికైన వారిలో 60 శాతం ఇతర నియోజకవర్గాల వారని తేలడంతో, 80 మంది అధికారుల బృందం ఇంటింటికీ తిరిగి వివరాలను ధ్రువీకరిస్తోంది. దీంతో అర్హుల తుది జాబితాలో భారీ మార్పులు చోటుచేసుకుంటున్నాయి.

# సమస్యలు గాలికొదిలేసి దేనికి ఈ సంబరాలు?

## రేవంత్ సర్కార్‌పై హరీశ్ రావు తీవ్ర ఆగ్రహం

## వెయ్యి రోజుల పాలన పూర్తి చేసుకున్న కాంగ్రెస్ ప్రభుత్వం



సమస్యలను గాలికొదిలేసి వేడుకలు జరుపుకుంటున్నారంటూ హరీశ్ విమర్శ ప్రభుత్వం కుంభకోణాలమయం అయిందని ఆరోపణ కాంగ్రెస్ పార్టీ వెయ్యి రోజుల పాలన వేడుకలను జరుపుకోవడంపై బీఆర్ఎస్ నేత, మాజీ మంత్రి హరీశ్ రావు విమర్శలు గుప్పించారు. ఎన్నికల సమయంలో ఇచ్చిన హామీలన్నింటినీ గాలికొదిలేసిన కాంగ్రెస్ ప్రభుత్వం ఏ ముఖం పెట్టుకుని సంబరాలు చేసుకుంటోందని ప్రశ్నించారు. కాంగ్రెస్ నాయకుల తీరు 'ఉల్టా చోర్ కొత్వాల్ కో డాంటే' అన్న చందంగా తయారైందని ఎద్దేవా చేశారు. రాష్ట్రంలో ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి సాగిస్తున్న పరిపాలనా విధానాన్ని, ఆయన పనితీరును ప్రజలు తీవ్రంగా అసహ్యించుకుంటున్నారని మండిపడ్డారు.ప్రస్తుత కాంగ్రెస్ ప్రభుత్వం పూర్తిగా కుంభకోణాలమయంగా మారిపోయిందని హరీశ్ రావు ఆరోపించారు. హామీలు నెరవేర్చడంలో విఫలమైన రేవంత్ రెడ్డి రాజీనామా చేయాలని తాము డిమాండ్ చేస్తుంటే, బాధ్యతారాహిత్యంగా కేసీఆర్ రాజీనామా చేయాలనడం విడ్డూరంగా ఉందన్నారు. రాజీనామా చేయాల్సింది కేసీఆర్ కాదని, ప్రజలను మోసం చేసిన రేవంత్ రెడ్డేనని తేల్చిచెప్పారు. విద్యార్థులు, నిరుద్యోగుల ఆవేదన, జీఓ 97 రద్దు, రైతాంగానికి నమ్మకమైన ఉచిత విద్యుత్ సరఫరా వంటి కీలక ప్రజా సమస్యలే ఎజెండాగా రాబోయే అసెంబ్లీ సమావేశాల్లో బీఆర్ఎస్ గళమెత్తుతుందని తెలిపారు. సభలో కాంగ్రెస్ వైఫల్యాలను ఎండగట్టేందుకు అధినేత కేసీఆర్ బీఆర్ఎస్ఎల్పీ సమావేశంలో పూర్తి దిశానిర్దేశం చేస్తారని హరీశ్ రావు స్పష్టం చేశారు.



## నేడు ఉచిత కంటి వైద్య శిబిరం

**మట్టెవాడ, సెప్టెంబర్ 05 (పీపుల్స్ డైరీ) :** పేద, మధ్యతరగతి ప్రజలకు నాణ్యమైన కంటి వైద్య సేవలను ఉచితంగా అందించాలనే సంకల్పంతో గంట రవికుమార్ ఫౌండేషన్, శంకర కంటి ఆసుపత్రి సంయుక్త ఆధ్వర్యంలో ఆదివారం ఉచిత కంటి వైద్య శిబిరాన్ని నిర్వహిస్తున్నట్లు ఫౌండేషన్ ప్రధాన కార్యదర్శి మహమ్మద్ రఫీ తెలిపారు. 6న ఆదివారం ఉదయం 8 గంటల నుంచి మధ్యాహ్నం ఒంటి గంట వరకు శివనగర్‌లోని కార్మిక పరపతి సంఘం ఫంక్షన్ హాల్ ఆవరణలో శంకర కంటి ఆసుపత్రి కంటి వైద్యులు, టెక్నీషి యన్లు ఆధునిక పరికరాలతో ప్రజలకు వైద్య పరీక్షలు నిర్వహిస్తారని తెలిపారు. వరంగల్ ప్రజలు ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలని షఫీ కోరారు. ఈ కార్యక్రమంలో ఫౌండేషన్ సభ్యులు కందుకూరి విజయ్ కుమార్, కలువల శ్రీనివాస్, పోషాల సతీష్, గట్ల శరత్ కుమార్, దార భాస్కర్, పరంకుశ శ్రవణ్ కుమార్, తౌటం శ్రవణ్ కుమార్ పాల్గొన్నారు.

## భద్రకాళి దేవాలయంలో ఎమ్మెల్సీ పోచంపల్లి పూజలు



**మట్టెవాడ, సెప్టెంబర్ 05 (పీపుల్స్ డైరీ) :** వరంగల్ మహానగరంలో చరిత్ర ప్రసిద్ధిగాంచిన శ్రీ భద్రకాళీ దేవస్థానాన్ని శనివారం ఉదయం ఎమ్మెల్సీ పోచంపల్లి శ్రీనివాస్ రెడ్డి సందర్శించారు. ఆలయానికి విచ్చేసిన శ్రీనివాస్ రెడ్డికి ఆలయ అధికారులు హరినాథ్, అర్చకులు ఘనస్వాగతం పలికారు. ముందుగా వల్లభ గణపతిని దర్శించిన అనంతరం ఆలయంలోకి ప్రవేశించి అమ్మవారికి ప్రత్యేక పూజలు నిర్వహింపచేశారు. పూజానంతరం ఆలయ మహామండపంలో ప్రధానార్ధకులు భద్రకాళి శేషు ఆధ్వర్యంలో అర్చకులు మహదాశీర్వచనం నిర్వహించి అమ్మవారి శేషవస్త్రములు బహుకరించి ప్రసాదములు అందచేశారు. కార్యక్రమంలో వాసుదేవ రెడ్డి తదితరులు ఉన్నారు.

## బాధిత కుటుంబానికి ఆర్థిక సాయం అందజేత



**ఆత్మకూర్, సెప్టెంబర్ 5(పీపుల్స్ డైరీ) :** ఆత్మకూర్ మండల కేంద్రంలో అనారోగ్యంతో మృతి చెందిన బీజేపీ కార్యకర్త కొమ్ము మయాకర్ తండ్రి కొమ్ము చిన్ని కుటుంబాన్ని బీజేపీ రాష్ట్ర కార్యవర్గ సభ్యుడు, భద్రాద్రి కొత్తగూడెం జిల్లా ఇన్‌చార్జి డా. పెసరు విజయచందర్‌రెడ్డి శనివారం సందర్శించి ఆయన చిత్రపటానికి పూలమాల వేసి నివాళులర్పించారు. అనంతరం కుటుంబ సభ్యులను పరామర్శించి, కష్టకాలంలో పార్టీ కార్యకర్తల కుటుంబాలకు బీజేపీ అండగా ఉంటుందని భరోసా కల్పించారు. కుటుంబానికి ఆర్థిక సహాయాన్ని అందజేశారు. కొమ్ము చిన్ని మృతి కుటుంబ సభ్యులు, బంధుమిత్రులకు తీరని లోటని, ఆయన ఆత్మకు శాంతి చేకూరాలని విజయచందర్‌రెడ్డి ఆకాంక్షించారు. ఈ కార్యక్రమంలో బీజేపీ ఆత్మకూర్ మండల అధ్యక్షుడు ఉప్పుగల్ల శ్రీకాంత్‌రెడ్డి, మాజీ మండల అధ్యక్షుడు సదానందం, మాజీ జెడ్పీటీసీ టీంగిలికారి సత్యనారాయణ, ముల్క ప్రసాద్, వంగాల బుచ్చిరెడ్డి, వాడి రాజు, వాడికారి రమేష్, భయ్యా మాలగం, వరికెల రామకృష్ణ, కుటుంబ సభ్యులు, బీజేపీ నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

# నిమజ్జన ప్రదేశాల్లో అన్ని ఏర్పాట్లు పకడ్బందీగా చేపట్టాలి!

### భక్తులకు ఎలాంటి ఇబ్బందులు కలగకుండా ముందస్తు చర్యలు చేపట్టాలి - జిడబ్ల్యూఎంసి కమిషనర్ వెంకన్న

**మట్టెవాడ, సెప్టెంబర్ 05 (పీపుల్స్ డైరీ):** నిమజ్జన ప్రదేశాల్లో అన్ని ఏర్పాట్లు పకడ్బందీగా చేపట్టాలని జిడబ్ల్యూఎంసి కమిషనర్ టి.వెంకన్న అధికారులను ఆదేశించారు. వినాయక నవరాత్రి ఉత్సవాల అనంతరం నిర్వహించనున్న వినాయక విగ్రహాల నిమజ్జన కార్యక్రమాన్ని దృష్టిలో ఉంచుకుని గ్రేటర్ వరంగల్ నగరపాలక సంస్థ పరిధిలోని నిమజ్జన ప్రదేశాల్లో చేపట్టాల్సిన ఏర్పాట్లను శనివారం క్షేత్రస్థాయిలో ఆయన పరిశీలించారు. ఈ సందర్భంగా ఉర్సుగుట్ట చెరువు, బంధం చెరువు, నిమజ్జన పాయింట్లను ఇంజనీరింగ్ శానిటేషన్ అధికారులతో కలిసి కమిషనర్ సందర్శించి అక్కడి పరిస్థితులను పరిశీలించారు. నిమజ్జన కార్యక్రమానికి పెద్ద సంఖ్యలో భక్తులు, ప్రజలు తరలివచ్చే అవకాశం ఉన్నందున ఆయా ప్రాంతాల్లో ఎలాంటి అసౌకర్యం కలగకుండా ముందస్తు ప్రణాళికతో అన్ని ఏర్పాట్లు పూర్తి చేయాలని అధికారులను ఆదేశించారు. నిమజ్జన ప్రదేశాలకు వెళ్లే ప్రధాన రహదారులు, అంతర్గత రహదారులను పరిశీలించి, అవసరమైన చోట్ల రోడ్డు మరమ్మతులు, గుంతల పూడ్చివేత, రహదారుల చదును, లైటింగ్, చెరువులలో గుర్రపు డెక్క తొలగింపు, పూడికతీత వంటి పనులను వెంటనే పూర్తి చేసి ఈనెల 14వ తేదీలోగా సిద్ధంగా ఉండాలని సూచించా రు. నిమజ్జన సమయంలో వాహనాల రాకపోకలు అధికంగా ఉండే అవకాశం ఉన్నందున రహదారులు సౌకర్యవంతంగా ఉండేలా చర్యలు తీసుకోవాలని తెలిపారు. అదేవిధంగా నిమజ్జన ప్రదేశాల



పరిసరాల్లో పారిశుధ్య నిర్వహణకు ప్రత్యేక ప్రాధాన్యత ఇవ్వాలని కమిషనర్ సూచించారు. చెత్తాచెదారం పేరుకుపోకుండా ఎప్పటికప్పుడు శుభ్రపరిచేలా చర్యలు చేపట్టాలని, నిమజ్జనానికి ముందు, అనంతరం పారిశుధ్య సిబ్బందిని అందుబాటులో ఉంచాలని ఆదేశించారు. నిమజ్జన ప్రదేశాల్లో భక్తులు, ప్రజలకు అవసరమైన మౌలిక సదుపాయాలను ముందుగానే ఏర్పాటు చేయాలని, ప్రజలకు ఎలాంటి ఇబ్బందులు తలెత్తకుండా సంబంధిత విభాగాల అధికారులు సమన్వయంతో పని చేయాలని కమిషనర్ వెంకన్న స్పష్టం చేశారు. నిమజ్జన ప్రదేశాలకు సంబంధించిన పను ల్లో ఎలాంటి జాప్యం ఉండకూడదని, నిర్దేశించిన సమయంలోగా అన్ని పనులను పూర్తి చేసి సిద్ధంగా ఉంచాలని అధికారులను ఆదేశించారు. నిమజ్జన కార్యక్రమం ప్రశాంతంగా, సాఫీగా జరిగేలా నగరపాలక సంస్థ పరిధిలోని సంబంధిత విభాగాలు సమన్వయంతో పనిచేయాలని, క్షేత్రస్థాయిలో ఎదురయ్యే సమస్యలను వెంటనే గుర్తించి పరిష్కరించాలని కమిషనర్ సూచించారు. ముఖ్యంగా భక్తులు నిమజ్జన ప్రదేశాలకు చేరుకునే సమయంలో, తిరిగి వెళ్లే సమయంలో కూడా ఎలాంటి ఇబ్బందులు లేకుండా అవసరమైన ఏర్పాట్లు ముందుగానే పూర్తి చేయాలని తెలిపారు. ప్రజలు, భక్తుల సౌకర్యం మరియు నగర పరిశుభ్రతకు అత్యధిక ప్రాధాన్యత ఇస్తూ నిమజ్జన కార్యక్రమానికి అవసరమైన ఏర్పాట్లన్నీ సకాలంలో, సమర్థవంతంగా పూర్తి చేయాలని కమిషనర్ సంబంధిత అధికారులను ఆదేశించారు. ఈ క్షేత్రస్థాయి పరిశీలనలో సూపరింటెండెంట్ ఇంజనీర్ రాజ్‌కుమార్, ఎగ్జిక్యూటివ్ ఇంజనీర్లు మహేందర్, సంతోష్ బాబు, రవికుమార్, మాధవి, ఎంహెచ్ఓ డాక్టర్ రాజేష్, తదితరులు పాల్గొన్నారు.



## కుడా ఛైర్‌పర్సన్‌గా బాధ్యతలు స్వీకరించిన సుధారాణి

**హనుమకొండ, సెప్టెంబర్ 5 (పీపుల్స్ డైరీ) :** కాకతీయ అర్బన్ డెవలప్‌మెంట్ అథారిటీ (కుడా) ఛైర్‌పర్సన్‌గా గుండు సుదారాణి శనివారం బాధ్యతలు స్వీకరించారు. హనుమకొండలోని కుడా కార్యాలయంలో నిర్వహించిన పదవీ బాధ్యతల స్వీకరణ కార్యక్రమంలో భాగంగా ఛాంబర్‌లో అధికారికంగా కుడా ఛైర్ పర్సన్ గా గుండు సుధారాణి పదవీ బాధ్యతలు చేపట్టారు. వరంగల్ పశ్చిమ, స్టేషన్ ఘన్ పూర్, పరకాల ఎమ్మెల్యేలు నాయిని రాజేందర్ రెడ్డి, కడియం శ్రీహరి, రేవూరి ప్రకాష్ రెడ్డి, కుడా వైస్ చైర్మన్/ హనుమకొండ జిల్లా కలెక్టర్ చాహత్ బాజ్ పాయి, జిడబ్ల్యుఎంసి కమిషనర్ వెంకన్న, తదితరుల సమక్షంలో కుడా ఛైర్‌పర్సన్‌గా గుండు సుధారాణి బాధ్యతలు స్వీకరించారు. బాధ్యతలు స్వీకరించిన గుండు సుధారాణికి ఎమ్మెల్యేలు, జిల్లా కలెక్టర్, జి డబుల్ ఎంసీ కమిషనర్, పుష్పగుచ్చాలు, పూల మొక్కలను అందించి శుభాకాంక్షలు తెలియజేశారు. అనంతరం గుండు సుదారాణి మాట్లాడుతూ... తనకు ఈ బాధ్యతలు అప్పగించినందుకు రాష్ట్ర ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి, మంత్రులు, ఎమ్మెల్యేలు, ఇతర ప్రజాప్రతినిధులకు కృతజ్ఞతలు తెలిపారు. కుడా పరిధిలో పట్టణాభివృద్ధి, మౌలిక వసతుల కల్పన, ప్రజలకు మెరుగైన సౌకర్యాలు అందించడంపై ప్రత్యేక దృష్టి సారిస్తామని తెలిపారు. ప్రణాళికాబద్ధమైన అభివృద్ధి కోసం ప్రజాప్రతినిధులు, అధికారుల సమన్వయంతో కృషి చేస్తామని పేర్కొన్నారు. ఈ సందర్భంగా కుడా సిపిఓ అజిత్ రెడ్డి, ఈఈ భీమ్ రావు, వివిధ శాఖల అధికారులు, పలువురు ప్రజా ప్రతినిధులు, సిబ్బంది పాల్గొని నూతనంగా కుడా ఛైర్‌పర్సన్ గా బాధ్యతలు స్వీకరించిన సుధారాణికి అభినందనలు తెలిపారు.

## సీఐని కలిసిన తెలంగాణ ఉద్యమకారులు

**ఆత్మకూర్, సెప్టెంబర్ 5 (పీపుల్స్ డైరీ) :** ఆత్మకూర్ పోలీస్ స్టేషన్ నూతన సీఐగా బాధ్యతలు స్వీకరించిన జి.బాబులాల్‌ను తెలంగాణ ఉద్యమకారుల ఫోరం ఆత్మకూర్ మండల కమిటీ ఆధ్వర్యంలో శనివారం మర్యాదపూర్వకంగా కలిసి శాలువాతో ఘనంగా సన్మానించారు. తెలంగాణ ఉద్యమకారులకు అండదండగా ఉండాలని ఈ సందర్భంగా సీఐని వారు కోరారు. స్పందించిన సీఐ బాబులాల్ ఉద్యమకారులకు ఎల్లప్పుడూ సహకరిస్తానని తెలిపారు. ప్రతి ఒక్కరూ శాంతిభద్రతలకు కట్టుబడి ఉండాలని, అసాంఘిక కార్యకలాపాలకు దూరంగా ఉండాలని సూచించారు. గ్రామాల్లో అసాంఘిక కార్యక్రమాలు జరుగుతున్నట్లు తెలిసినా, ఎలాంటి సమాచారం ఉన్నా పోలీసులకు తెలియజేయాలని కోరారు. ఈ కార్యక్రమంలో తెలంగాణ ఉద్యమకారుల ఫోరం ఉమ్మడి వరంగల్



జిల్లా ప్రధాన కార్యదర్శి ఇర్సడ్ల సదానందం, మండల అధ్యక్షుడు ఎండీ బాబుమియా, ప్రధాన కార్యదర్శి దొంకదువ్వ రాజన్న, భాషబోయిన సాగర్, పసుల లక్ష్మీనా రాయణ, మాజీ సర్పంచులు అక్కల కుమారస్వామి, చిట్టే రవి, మాజీ మార్కెట్ డైరెక్టర్ కాకాని శ్రీధర్, ప్రతాప్‌రెడ్డి, మంద రవి, నత్తి దేవేందర్, నాగేల్లి స్వామి, హుస్సేన్, బలభద్ర, కిషోర్ తదితరులు పాల్గొన్నారు.

## సీఐ బాబులాల్‌ను కలిసిన యూత్ కాంగ్రెస్ నాయకులు



**ఆత్మకూర్, సెప్టెంబర్ 5 (పీపుల్స్ డైరీ) :** ఆత్మకూర్ పోలీస్ స్టేషన్ నూతన సీఐ బాబులాల్‌ను యూత్ కాంగ్రెస్ నాయకులు శనివారం మర్యాదపూర్వకంగా కలిశారు. ఈ సందర్భంగా సీఐకి శుభాకాంక్షలు తెలిపారు. మండలంలో శాంతిభద్రతల పరిరక్షణకు సహకరిస్తామని పేర్కొన్నారు. సీఐని కలిసిన వారిలో నియోజకవర్గ యూత్ కాంగ్రెస్ అధ్యక్షుడు మాదాసి శ్రీధర్, మండల అధ్యక్షుడు తనుగుల సందీప్, కాంగ్రెస్ మండల ప్రధాన కార్యదర్శి గుండేబోయిన శ్యామ్, మాదాసి రాజు, యూత్ కాంగ్రెస్ మండల ప్రధాన కార్యదర్శి పిట్టల రాజకుమార్, మాజీ మండల ఉపాధ్యక్షుడు కాడబోయిన రాజ్‌కుమార్, నాయకులు మహమ్మద్ కరీం, అర్షం మురళి, దూరిశెట్టి శ్రవణ్, మానగాని గోపాల్, మోరే శివకుమార్ తదితరులు ఉన్నారు.

## పదేళ్లు అధికారంలో ఉండి ఏం చేశారు?

### బీఆర్ఎస్ నేతలకు కాంగ్రెస్ మండల అధ్యక్షులు పాలడుగు వెంకటకృష్ణ సూటి ప్రశ్న



గోవిందరావుపేట, సెప్టెంబర్ 5(పీపుల్స్ డైరీ) : బిఆర్ఎస్ నాయకులు 10 సంవత్సరాలు అధికారంలోఉండి రైతులకు ఏం చేశారో తెలియజేయాలని మండల కాంగ్రెస్ పార్టీ అధ్యక్షులు పాలడుగు వెంకటకృష్ణ సవాలు విసిరారు, అధికారం కోల్పోయిన బిఆర్ఎస్ నాయకులు మండలంలో రైతులకు సాగునీటి సమస్యపై బీఆర్ఎస్ నాయకులు రైతుల సాగునీటి కోసం హాయ్ రా నా పడడంలో అంతర్యమేమిటని బిఆర్ఎస్ నేతలను పాలడుగు వెంకట కృష్ణ ప్రశ్నించారు. కాకులమర్రి లక్ష్మణ్ బాబు, బడే నాగజ్యోతి చేస్తున్న రాజకీయ విమర్శలపై స్పందిస్తూ శనివారం గోవిందరావుపేట మండల కాంగ్రెస్ పార్టీ అధ్యక్షులు పాలడుగు వెంకటకృష్ణ మాట్లాడుతూ "రైతులపై మీకు నిజంగా ప్రేమ ఉన్నట్లయితే పదేళ్లు అధికారంలో ఉన్నప్పుడు ఎందుకు గుర్తు రాలేదని అన్నారు. సాగునీటి సమస్యను పరిష్కరించే అవకాశం ఉన్నప్పటికీ అధికార యంత్రాంగంవనరులు వారి చేతుల్లోనే ఉన్నాయని గుర్తు చేశారు. కార్యక్రమంలో ములుగు జిల్లా కార్మిక శాఖా అధ్యక్షులు కొంపెల్లి శ్రీనివాస్ రెడ్డి, జిల్లా మహిళా కాంగ్రెస్ అధ్యక్షురాలు మద్దాల నాగమణి, జిల్లా అధికార ప్రతినిధి జెట్టి సోమయ్య, సీనియర్ నాయకులు కనతల నాగేందర్ రావు, మండల వర్కింగ్ ప్రెసిడెంట్ రసపుత్ సీతారామ్ నాయక్, జిల్లా యువజన కాంగ్రెస్ నాయకులు చింత క్రాంతి, ఎస్టీ సెల్ మండల అధ్యక్షులు భుక్య రాజు, యువజన కాంగ్రెస్ మండల అధ్యక్షులు భైరి అభిలాష్, మాజీ ఎంపీటీసీ చాపల ఉమాదేవి, కాడబోయిన రవి, జిల్లా కార్యదర్శి జంపాల చంద్రశేఖర్, గణపాక సుధాకర్, తండా కృష్ణ, రామచంద్రపు వెంకటేశ్వర్ రావు, సర్పంచ్ లావుడ్యా జోగా, రేగుల లక్ష్మణ్, ఇర్ప విజయ, గోపిదాసు వజ్రమ్మ తదితర నాయకులు పాల్గొన్నారు.

# ప్రభుత్వ బడుల్లోనే నాణ్యమైన విద్య

### విద్యార్థులతో కలిసి అల్పాహారం చేసిన ఎమ్మెల్యే రేవూరి





**ఆత్మకూర్, సెప్టెంబర్ 5(పీపుల్స్ డైరీ) :** ప్రభుత్వ పాఠశాలల్లో అన్ని సౌకర్యాలతో నాణ్యమైన విద్య అందించేందుకు కాంగ్రెస్ ప్రభుత్వం ప్రత్యేక ప్రాధాన్యం ఇస్తోందని పరకాల ఎమ్మెల్యే రేవూరి ప్రకాశ్‌రెడ్డి అన్నారు. ఆత్మకూర్ మండలం చౌల్లపల్లి గ్రామంలోని ప్రభుత్వ పాఠశాలను శనివారం ఆయన ఆకస్మికంగా తనిఖీ చేశారు. పాఠశాలలోని తరగతి గదులు, విద్యార్థుల హాజరు, మౌలిక వసతులను పరిశీలించారు. అనంతరం విద్యార్థులతో కలిసి అల్పాహారం చేశారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ.. విద్యార్థులే దేశ భవిష్యత్తు పౌరులని, వారి విద్యాభివృద్ధికి ప్రభుత్వం పెద్దపీట వేస్తోందన్నారు. ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి పిల్లల భవిష్యత్తును దృష్టిలో ఉంచుకుని పాఠశాలల్లో అల్పాహార పథకాన్ని ప్రారంభించారని తెలిపారు. విద్యార్థులకు ఉదయం పౌష్టికాహారం అందించడం ద్వారా వారు ఉత్సాహంగా పాఠశాలకు హాజరై చదువుపై దృష్టి సారించే అవకాశం ఉంటుందన్నారు. విద్యార్థులకు కార్పొరేట్ తరహా మౌలిక వసతులతో పాటు నాణ్యమైన ఉచిత విద్య, అల్పాహారం, మధ్యాహ్న భోజనం అందిస్తున్నట్లు చెప్పారు. ప్రతి విద్యార్థికి మెరుగైన విద్యా వాతావరణం కల్పించడమే ప్రభు త్వ లక్ష్యమన్నారు. పాఠశాలలో విద్యార్థులకు అందుతున్న భోజ నం, అల్పాహారం నాణ్యతపై కూడా ఆయన ఆరా తీశారు. విద్యా ర్థులతో ముచ్చటిస్తూ వారి చదువు, పాఠశాలలో ఎదుర్కొంటున్న సమస్యలను అడిగి తెలుసుకున్నారు. ఆయన వెంట కాంగ్రెస్ జిల్లా ప్రధాన కార్యదర్శి కమలాపురం రమేష్, ప్రధాన కార్యదర్శి రవికుమార్, మండల పార్టీ అధ్యక్షుడు జలంధర్ రెడ్డి, కాంగ్రెస్ నాయకులు, ఉపాధ్యాయులు ఉన్నారు.

# అభివృద్ధిలో తెలంగాణను ముందుకు తీసుకెళ్తున్న సీఎం

### మహబూబాబాద్‌లో బైక్ ర్యాలీ నిర్వహించిన డిసిసి అధ్యక్షురాలు ఉమా మురళి నాయక్



**మహబూబాబాద్, సెప్టెంబర్ 5 (పీపుల్స్ డైరీ) :** ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి నాయకత్వంలోని కాంగ్రెస్ ప్రభుత్వం 1000 రోజుల పాలన పూర్తి చేసుకున్న సందర్భంగా మహబూబాబాద్ లో విజయోత్సవ బైక్ ర్యాలీ ఘనంగా నిర్వహించారు. ఈ కార్యక్రమానికి జిల్లా కాంగ్రెస్ అధ్యక్షురాలు శ్రీమతి ఉమా మురళి నాయక్ అధ్యక్షత వహించారు. బైక్ ర్యాలీ అనంతరం నిర్వహించిన కార్యక్రమంలో డీసీసీ అధ్యక్షురాలు ఉమా మురళి నాయక్ మాట్లాడుతూ.. కాంగ్రెస్ ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన నాటి నుంచి ప్రజా సంక్షేమం, అభివృద్ధి, సామాజిక న్యాయానికి అత్యంత ప్రాధాన్యత ఇస్తూ ముందుకు సాగుతోంద న్నారు. మహిళలకు మహాలక్ష్మి పథకం ద్వారా ఉచిత బస్సు ప్రయాణం, గృహజ్యోతి ద్వారా ఉచిత విద్యుత్, రైతులకు రైతు భరోసా, రైతు రుణమాఫీ, ఇందిరమ్మ ఇళ్ల నిర్మాణం, యువతకు ఉద్యోగ అవకాశాలు, విద్యార్థులకు సంక్షేమ కార్యక్రమాలు వంటి అనేక ప్రజా సంక్షేమ కార్యక్రమాలను కాంగ్రెస్ ప్రభుత్వం అమలు చేస్తోందని తెలిపా రు. అలాగే రాష్ట్ర అభివృద్ధికి అవసరమైన మౌలిక వసతుల కల్పన, రహదారులు, విద్య, వైద్యం, సాగునీరు తదితర రంగాల్లో ప్రభుత్వం ప్రత్యేక దృష్టి సారించిందన్నారు. పేద, మధ్యతరగతి ప్రజల సంక్షేమమే లక్ష్యంగా సీఎం రేవంత్ రెడ్డి ప్రభుత్వం పనిచేస్తోందని పేర్కొన్నారు. 1000 రోజుల పాలనలో తెలంగాణ ప్రజలకు అందించిన సంక్షేమం, అభివృద్ధి కార్యక్రమాలను ప్రజల్లోకి తీసుకెళ్లడమే ఈ విజయోత్సవ బైక్ ర్యాలీ ముఖ్య ఉద్దేశమని ఉమా మురళి నాయక్ తెలిపారు. కాంగ్రెస్ ప్రభుత్వం ఇచ్చిన హామీలను ఒక్కొక్కటిగా అమలు చేస్తూ ప్రజల విశ్వాసాన్ని నిలబెట్టుకుంటోందని, రాబోయే రోజుల్లో మరింత అభివృద్ధి, సంక్షేమంతో తెలంగాణను ఆదర్శ రాష్ట్రంగా తీర్చిదిద్దే దిశగా సీఎం రేవంత్ రెడ్డి నాయకత్వంలో ప్రభుత్వం ముందుకు సాగుతుందని ఆమె అన్నారు. కార్యక్రమంలో మహబూబాబాద్ నియోజక వర్గంలోని వివిధ మండలాలకు చెందిన మండల పార్టీ అధ్యక్షులు,కాంగ్రెస్ పార్టీ నాయకులు, మహిళా కాంగ్రెస్ నాయకులు, కార్యకర్తలు, అభిమానులు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు.




# గురువులే భావితరాలకు మార్గదర్శకులు



**గణపురం, సెప్టెంబర్ 05 (పీపుల్స్ డైరీ) :** గణపురం మండలంలోని చెల్పూర్ గ్రామంలోని ఎంజీఎం హైస్కూల్‌లో శనివారం ఉపాధ్యాయ దినోత్సవ వేడుకలను ఘనంగా నిర్వహించారు. మాజీ రాష్ట్రపతి డాక్టర్ సర్వేపల్లి రాధాకృష్ణన్ జయంతిని పురస్కరించుకుని పలు కార్యక్రమాలు చేపట్టారు. పదో తరగతి విద్యార్థినీ, విద్యార్థులు స్వయం పరిపాలన దినోత్సవాన్ని నిర్వహించి ఉపాధ్యాయుల పాత్రను పోషించారు. ఈ సందర్భంగా విద్యార్థులు, వారి తల్లిదండ్రులు పాఠశాల యాజమాన్యం, ఉపాధ్యాయులను పూలమాలలు, శాలువాలు, చిరుకానుకలతో ఘనంగా సన్మానించారు. అనంతరం కరస్పాండెంట్ గ్యాదంగి సతీష్ మాట్లాడుతూ... నేటి సమాజ నిర్మాణంలో ఉపాధ్యాయుల పాత్ర అత్యంత కీలకమన్నారు. భావితరాలను తీర్చిదిద్దడమే కాకుండా నవ సమాజ నిర్మాణం లో ఉపాధ్యాయులు గురుతర బాధ్యతను నిర్వర్తిస్తున్నారని తెలిపారు. మహనీయుల జీవిత సత్యాలను విద్యార్థులకు బోధించి, ఉన్నత విలువలను అలవర్చేలా కృషి చేయాలని సూచించారు. గురువు మార్గదర్శకత్వం లేకుండా విద్య అసంపూర్ణమని పేర్కొంటూ గురువుల ప్రాముఖ్యతను వివరించారు. ఈ కార్యక్రమంలో పాఠశాల డైరెక్టర్లు గ్యాదంగి తిరుపతి, గ్యాదంగి రమాదేవి సిల్వేరి శ్రీనివాస్, ప్రిన్సిపల్ మధుకర్, ఉపాధ్యాయిని, ఉపాధ్యాయులు, తల్లిదండ్రులు, విద్యార్థులు పాల్గొన్నారు.




# సమాజ నిర్మాణంలో ఉపాధ్యాయుల పాత్ర ఎంతో కీలకం

**పినపాక. సెప్టెంబర్ 05(పీపుల్స్ డైరీ) :** భారత మాజీ రాష్ట్రపతి, ప్రముఖ విద్యావేత్త డాక్టర్ సర్వేపల్లి రాధాకృష్ణన్ జయంతిని పురస్కరించుకుని భద్రాద్రి కొత్తగూడెం జిల్లా , పినపాక మండలం, బయ్యారం క్రాస్ రోడ్ నందు గల ఎక్సలెంట్ భాష హై స్కూల్ నందు ఉపాధ్యాయ దినోత్సవ వేడుకలను పాఠశాల యాజమాన్యం ఘనంగా నిర్వహించారు. విద్యార్థులు ఉపాధ్యాయు లను పూలమాలలు, శాలువాలతో సత్కరించి ఉపాధ్యాయ దినోత్సవ శుభాకాంక్షలు తెలిపారు. పుష్పగుచ్ఛాలను అందజేసి చిరు జ్ఞాపికలతో సన్మానం చేసి తమ గౌరవాన్ని చాటుకున్నారు. విద్యార్థులు ఉపాధ్యాయుల సేవలను కొనియాడుతూ సమాజ నిర్మాణంలో ఉపాధ్యాయుల పాత్ర ఎంతో కీలకమని, విద్యార్థుల భవిష్యత్తును తీర్చిదిద్దే బాధ్యత గురువులపై ఉంటుందని పేర్కొన్నారు. విద్యార్థుల ప్రసంగాలు పలువురిని ఆకట్టుకున్నాయి. ఈ వేడుకలకు ముఖ్య అతిథిగా విచ్చేసిన ఎక్స్ లెంట్ గ్రూప్ ఆఫ్ స్కూల్ చైర్మన్ ఎండి యూసఫ్ షరీఫ్ మాట్లాడుతూ ప్రతి సంవత్సరం సెప్టెంబర్ 5వ తేదీన విద్యావేత్త డాక్టర్ సర్వేపల్లి రాధాకృష్ణన్ జయంతిని పురస్కరించుకొని ఉపాధ్యాయ దినోత్సవాన్ని ఘనంగా జరుపుకుంటామని అన్నారు. విద్యార్థి విజయానికి గురువే కారణమని, విద్యార్థులు విద్యాపరంగా ఉన్నత లక్ష్యాలను సాధించి అత్యుత్తమ ప్రతిభను చాటినప్పుడు ఆ గురువుకు నిజమైన బహుమతి ఇచ్చిన వారవుతారని అన్నారు. పాఠశాల ఉపాధ్యాయులు మాట్లాడుతూ విద్యార్థులు క్రమశిక్షణతో చదువుకుని ఉన్నత లక్ష్యాలను సాధించాలని సూచించారు. గురువుల పట్ల గౌరవం, తల్లిదండ్రుల పట్ల ప్రేమతో వ్యవహరిస్తూ మంచి పౌరులుగా ఎదగాలని, పాఠశాలకు, తల్లిదండ్రులకు మంచి పేరు తీసుకురావాలని సూచించారు. కార్యక్రమంలో ఎక్సలెంట్ గ్రూప్ ఆఫ్ స్కూల్ చైర్మన్ ఎండి యూసఫ్ షరీఫ్, పాఠశాల డైరెక్టర్లు ఎండి యాకూబ్ షరీఫ్, ముక్కు నర్సారెడ్డి, బండారు నరేంద్ర పాఠశాల ప్రిన్సిపల్ అంకం సురేష్, ఉపాధ్యాయులు, పాఠశాల సిబ్బంది, విద్యార్థులు పాల్గొన్నారు.

# గురువుల ఆశీస్సులతో మంచి పౌరులుగా ఎదగాలి

## ఫ్రోబెల్ మోడల్ హైస్కూల్‌లో ఘనంగా ఉపాధ్యాయ దినోత్సవం

**గణపురం, సెప్టెంబర్ 05 (పీపుల్స్ డైరీ) :** గణపురం మండల కేంద్రంలోని ఫ్రోబెల్ మోడల్ హైస్కూల్‌లో డా. సర్వేపల్లి రాధాకృష్ణన్ జయంతిని పురస్కరించుకుని శనివారం ఉపాధ్యాయ దినోత్సవ వేడుకలు ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా విద్యార్థులు తమ గురువులను సత్కరించి, ఉపాధ్యాయుల పట్ల తమకున్న గౌరవం, అభిమానాన్ని చాటుకున్నారు. విద్యార్థుల జీవితాలకు విద్యాబుద్ధులతో పాటు విలువలను అందిస్తూ, వారి భవిష్యత్తును తీర్చిదిద్దడంలో ఉపాధ్యాయుల పాత్ర కీలకమని పేర్కొన్నారు.

### ఉపాధ్యాయులుగా మారిన విద్యార్థులు

వేడుకల్లో భాగంగా నిర్వహించిన స్వయం పరిపాలన దినోత్సవం విద్యార్థులను విశేషంగా ఆకట్టుకుంది. పదో తరగతి విద్యార్థులు ఉపాధ్యాయులు, పాఠశాల పరిపాలనా సిబ్బంది పాత్రలను స్వీకరించారు. తరగతి గదుల్లో ఉపాధ్యాయులుగా వ్యవహరిస్తూ తోటి విద్యార్థులకు పాఠాలు బోధించారు. అదే సమయంలో పాఠశాల పరిపాలనకు సంబంధించిన విధులను కూడా నిర్వహించారు. ఉపాధ్యాయులుగా మారిన విద్యార్థులు పాఠ్యాంశాలను బోధించడంతో పాటు తరగతులను క్రమబద్ధంగా నిర్వహించారు. దీంతో ఉపాధ్యాయుల బాధ్యతలు, పాఠశాల నిర్వహణలో సిబ్బంది పోషించే పాత్రపై వారికి ప్రత్యక్ష అవగాహన ఏర్పడింది. స్వయం పరిపాలన కార్యక్రమం విద్యార్థుల్లో నాయకత్వం, క్రమశిక్షణ, సమయపాలన, బాధ్యతాయుత వైఖరి, నిర్ణయ సామర్థ్యం వంటి లక్షణాలను పెంపొందించేందుకు దోహదపడిందని పాఠశాల యాజమాన్యం పేర్కొంది.

### ఉన్నత లక్ష్యాలు నిర్దేశించుకోవాలి

ఈ సందర్భంగా ప్రిన్సిపాల్ ఎల్. కృష్ణ, కరస్పాండెంట్ పి. శివశంకర్, డైరెక్టర్లు ఎల్. యాదగిరి, ఎస్. జగన్‌రెడ్డి మాట్లాడుతూ... ఉపాధ్యాయ దినోత్సవ విశిష్టతను వివరించారు. డా. సర్వేపల్లి రాధాకృష్ణన్ జయంతిని ఉపాధ్యాయ దినోత్సవంగా జరుపుకోవడం ద్వారా గురువుల సేవలను గుర్తుచేసుకునే అవకాశం లభిస్తుందన్నారు. విద్యార్థుల భవిష్యత్తును తీర్చిదిద్దడంలో ఉపాధ్యాయులు నిరంతరం చేస్తున్న కృషి అభినందనీయమన్నారు. విద్యార్థులు చదువులో రాణించడంతో పాటు క్రమశిక్షణ, సమయపాలనకు ప్రాధాన్యం ఇవ్వాలని సూచించారు. జీవితంలో ఉన్నత లక్ష్యాలను ఏర్పరచుకుని వాటిని సాధించేందుకు నిరంతరం కృషి చేయాలని, తల్లిదండ్రులు, ఉపాధ్యాయుల సూచనలు పాటిస్తూ మంచి పౌరులుగా ఎదగాలని ఆకాంక్షించారు. కార్యక్రమంలో ఉపాధ్యాయులు, విద్యార్థులు పాల్గొన్నారు.




# న్యూ విజన్ స్కూల్‌లో గురు పూజోత్సవ వేడుకలు

**నర్సంపేట, సెప్టెంబర్ 5 (పీపుల్స్ డైరీ) :** వరంగల్ జిల్లా: భారత మాజీ రాష్ట్రపతి, ప్రముఖ తత్వవేత్త, విద్యావేత్త సర్వేపల్లి రాధాకృష్ణన్ జన్మదినాన్ని పురస్కరించుకొని , దుగ్గొండి మండలం గిర్నిభవి న్యూ విజన్ స్కూల్లో ఘనంగా గురుపూజోత్సవం వేడుకలను నిర్వహించారు, దేశవ్యాప్తంగా, ముఖ్యంగా విద్యాసంస్థల్లో గురుపూజోత్సవ కార్యక్రమాలను ఘనంగా నిర్వహిస్తారని ప్రైవేట్ టీచర్స్ యూనియన్ వరంగల్ జిల్లా అధికార ప్రతినిధి సింగనబోయిన శ్రీశైలం తెలిపారు, ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ సర్వేపల్లి రాధాకృష్ణన్ చిత్రపటానికి పూలమాల వేసి ఘనంగా నివాళి అర్పించారు, ఉపాధ్యాయుల సేవలను గుర్తిస్తూ ప్రతి సంవత్సరం సెప్టెంబర్ 5న ఉపాధ్యాయ దినోత్సవాన్ని నిర్వహించడం ఆయనకు ఇచ్చే గౌరవానికి ప్రతీక అని అన్నారు, సర్వేపల్లి రాధాకృష్ణన్ దేశానికి అందించిన సేవలు, విద్యారంగ అభివృద్ధికి చేసిన కృషి చిరస్మరణీయమని శ్రీశైలం పేర్కొన్నారు. ఉపాధ్యాయుల సేవలను సమాజం ఎల్లప్పుడూ గౌరవించాలని, విద్యార్థుల భవిష్యత్తును తీర్చిదిద్దే గురువులకు తగిన గుర్తింపు, గౌరవం లభించాలని ఈ సందర్భంగా ఆయన ఆకాంక్షించారు ఈ కార్యక్రమంలో సంగెం



మండలం బాధ్యులు కొనుకటి రాజు, చేన్నారావు పేట మండలం బాధ్యులు మాదరపు శ్రీనివాస్, దుగ్గొండి మండలం బాధ్యులు బట్టు నాగ రాజు పాల్గొని సర్వేపల్లి రాధాకృష్ణ చిత్ర పటం దగ్గర నివాళులు అర్పించారు.

# నవ సమాజ నిర్మాత ఉపాధ్యాయుడు

## ఎంఈఓ కొమరం నాగయ్య

**పినపాక, సెప్టెంబర్ 5(పీపుల్స్ డైరీ) :** ఉపాధ్యాయ దినోత్సవం సందర్భంగా మండలంలోని ఉత్తమ ఉపాధ్యాయులను మండల విద్యాశాఖాధికారి కొమరం నాగయ్య ఆధ్వర్యంలో శనివారం నాడు ఘనంగా సన్మానించారు. ఈ సన్మాన కార్యక్రమాన్ని మండల కేంద్రంలోని రైతువేదికలో ఏర్పాటుచేయగా విశిష్ట అతిథిగా ఎంపీడీఓ సంకీర్త్ పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఎంపీడీఓ సంకీర్త్ మాట్లాడుతూ.... ఎటువంటి స్వార్థం లేకుండా విద్యార్థుల విజయాన్నే తన విజయంగా భావించే ఏకైక వ్యక్తి ఉపాధ్యాయుడన్నారు. ఉపాధ్యాయ వృత్తిని మించిన వృత్తి మరొకటిలేదన్నారు. తల్లితండ్రులు మనకు జన్మనిస్తే ఆ జీవితానికి ఒక సార్థకతను, మంచి ప్రవర్తనను అందించేది ఒక్క గురువే అన్నారు. తాను గ్రూప్స్ లో విజయం సాధించాక మొదటిగా తల్లితండ్రులకు విషయం తెలిపి, తదుపరి నాకు చదువు చెప్పిన ఉపాధ్యాయులకే విషయం తెలిపానన్నారు. కృతజ్ఞతకు



మించిన గురుదైవం లేదన్నారు. ఈ సందర్భంగా ఎంఈఓ కొమరం నాగయ్య మాట్లాడుతూ... నవసమాజ నిర్మాణాన్ని నిర్మించే ఉపాధ్యాయ వృత్తిలో ఉన్నందుకు ఉపాధ్యాయులందరూ గర్వించాలన్నారు. కార్యక్రమంలో చిన్నారులు నృత్యాలతో అలరించారు. తదుపరి మండలం లోని జెడ్పీహెచ్ఎస్, మిణి గురుకులం, కేజీబీవీలు, ఆశ్రమ పాఠశాలలోని సీనియర్ ప్రధానోపాధ్యాయులు, ఉపాధ్యాయులను , ఎస్జీటీ ఉపాధ్యాయులను, సీఆర్పీ, సీఆర్టీ లను మొత్తం 22 మందిని ఘనంగా సన్మానించారు. ఈ కార్యక్రమంలో జానంపేట పీజీ హెచ్ఎం కె. విజయలక్ష్మి, జెడ్పీహెచ్ఎస్ పినపాక హెచ్ఎం డి. రామిరెడ్డి, దుగినేపల్లి జెడ్పీహెచ్ ఎస్ హెచ్ఎం రాంగోపాల్, బాబూరావు, ముత్తయ్య, సీతారాములు. పీడీ వీరన్న, అన్ని ఉపాధ్యాయ సంఘాల అధ్యక్షులు, మండలంలోని ఉపాధ్యాయులు, విద్యార్థినీ, ద్యార్థులు పాల్గొన్నారు.

# ఘనంగా ఉపాధ్యాయ దినోత్సవ వేడుకలు

**కేసముద్రం సెప్టెంబర్ 5 (పీపుల్స్ డైరీ) :** మున్సిపాలిటీ పరిధిలోని శ్రీ వివేకవర్ధిని హైస్కూల్లో శనివారం ఉపాధ్యాయుల దినోత్సవ వేడుకలను ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా పాఠశాల కరస్పాండెంట్ చిర్ర యాకాంతం గౌడ్, ప్రిన్సిపాల్ చిర్ర నరేశ్ పాఠశాలలో విధులు నిర్వహిస్తున్న ఉపాధ్యాయులను శాలువాలతో సత్కరించి, జ్ఞాపికలు (మెమెంటోలు) అందజేసి ఘనంగా సన్మానించారు. అనంతరం నిర్వహించిన సభలో కరస్పాండెంట్ చిర్ర యాకాంతం గౌడ్ మాట్లాడుతూ, విద్యార్థుల భవిష్యత్తును తీర్చిదిద్దడంలో ఉపాధ్యాయుల పాత్ర అత్యంత కీలకమైందని, సమాజ నిర్మాణంలో గురువులకు ప్రత్యేక స్థానం ఉందని అన్నారు. డాక్టర్ సర్వేపల్లి రాధాకృష్ణన్ ఆశయాలను స్ఫూర్తిగా తీసుకొని ప్రతి ఉపాధ్యాయుడు విద్యార్థులకు నాణ్యమైన విద్యతో పాటు విలువలను అందించాలని సూచించారు. ఈ సందర్భంగా విద్యార్థులు తమ ఉపాధ్యాయుల పట్ల కృతజ్ఞతాభావాన్ని వ్యక్తం చేస్తూ శుభాకాంక్షలు తెలిపారు. పాఠశాలలోని అన్ని విభాగాల ఉపాధ్యాయులను ప్రత్యేకంగా సన్మానించడం కార్యక్రమానికి మరింత ప్రత్యేకతను తీసుకొచ్చింది. ఈ కార్యక్రమంలో పాఠశాల ఉపాధ్యాయులు, విద్యార్థులు తదితరులు పాల్గొన్నారు.



# జవహర్ నవోదయ విద్యాలయంలో ఉపాధ్యాయ దినోత్సవం

**కరకగూడెం, సెప్టెంబర్ 05(పీపుల్స్ డైరీ) :** భద్రాద్రి కొత్తగూడెం జిల్లా లోని కరకగూడెం లోని జవహర్ నవోదయ విద్యాలయంలో ఉపాధ్యాయ దినోత్సవ వేడుకలు ఘనంగా జరిగాయి. జాతీయ ఉపాధ్యాయ దినోత్సవాన్ని పురస్కరించుకుని విద్యార్థులు ఉపాధ్యాయులను ఘనంగా సత్కరించారు. ఈ సందర్భంగా ప్రిన్సిపాల్ రత్తయ్య మాట్లాడుతూ గురువు అంటే కేవలం పాఠాలు చెప్పేవారు మాత్రమే కాదని, విద్యార్థుల జీవితానికి దారి చూపే మార్గదర్శి అని అన్నారు. ప్రతి విద్యార్థి గురువులను గౌరవిస్తూ, క్రమశిక్షణ, పట్టుదలతో చదివి ఉన్నత శిఖరాలు అధిరోహించాలని పిలుపునిచ్చారు. అనంతరం విద్యార్థులు ఉపాధ్యాయులకు శుభాకాంక్షలు తెలిపి కేక్ కట్ చేశారు. విద్యార్థులు సాంస్కృతిక కార్యక్రమాలు నిర్వహించి ఆకట్టుకున్నారు. ఈ కార్యక్రమంలో పాఠశాల ఉపాధ్యాయులు, విద్యార్థులు పాల్గొన్నారు.




# విద్యార్థుల భవిష్యత్తుకు గురువే పునాది

## అర్వణపల్లికి చెందిన బబ్బురు సురేష్‌కుమార్‌కు ఉత్తమ ఉపాధ్యాయ అవార్డు



**కేసముద్రం, సెప్టెంబర్ 5 (పీపుల్స్ డైరీ) :** కేసముద్రం మండలం అర్వణపల్లి గ్రామానికి చెందిన ఉపాధ్యాయుడు బబ్బురు సురేష్ కుమార్ ఉత్తమ ఉపాధ్యాయ అవార్డు అందుకోవడం పట్ల మండల వ్యాప్తంగా హర్షం వ్యక్తమవుతోంది. డాక్టర్ సర్వేపల్లి రాధాకృష్ణన్ జయంతి సందర్భంగా సెప్టెంబర్ 5న జరుపుకునే ఉపాధ్యాయ దినోత్సవ వేడుకలు మండల వ్యాప్తంగా ఘనంగా జరిగాయి. ఈ సందర్భంగా విద్యారంగంలో విశేష సేవలు అందిస్తున్న అర్వణపల్లికి చెందిన బబ్బురు సురేష్ కుమార్ ను ఉత్తమ ఉపాధ్యాయుడిగా ఎంపిక చేసి అవార్డు ప్రదానం చేశారు. విద్యార్థులకు నాణ్యమైన విద్యను అందించడంతో పాటు, క్రమశిక్షణ, సంస్కారవంతమైన జీవన విధానాన్ని నేర్పిస్తూ, పాఠశాల అభివృద్ధికి ఆయన చేస్తున్న కృషి అభినందనీయమని పలువురు కొనియాడారు. విద్యార్థుల భవిష్యత్తుకు గురువే పునాది అని, అలాంటి గురువుగా సురేష్ కుమార్ నిలుస్తున్నారని గ్రామస్తులు, తల్లిదండ్రులు ప్రశంసించారు. ఈ సందర్భంగా పలు పాఠశాలల్లో విద్యార్థులు ఉపాధ్యాయులను పూలమాలలతో సన్మానించి, కృతజ్ఞతలు తెలిపారు. బబ్బురు సురేష్‌కు అవార్డు రావడంపై ఉపాధ్యాయులు, విద్యార్థులు, గ్రామ ప్రజలు శుభాకాంక్షలు తెలిపారు.



## మోడల్ స్కూల్‌లో ఘనంగా ఉపాధ్యాయ దినోత్సవ వేడుకలు

**మొగుళ్ళపల్లి, సెప్టెంబర్ 5 (పీపుల్స్ డైరీ) :** మండలం లోని కొరికిశాల మోడల్ స్కూల్‌లో శనివారం ఉపాధ్యాయ దినోత్సవ వేడుకలను విద్యార్థులు, ఉపాధ్యాయులు ఘనంగా నిర్వహించారు భారత మాజీ రాష్ట్రపతి, ప్రముఖ తత్వవేత్త, విద్యావేత్త డాక్టర్ సర్వేపల్లి రాధాకృష్ణన్ జయంతిని పురస్కరించుకుని కార్యక్రమాన్ని నిర్వహించారు. విద్యార్థులు ఉపాధ్యాయుల గొప్పతనాన్ని, సమాజ నిర్మాణంలో వారి పాత్రను కొనియాడుతూ. ప్రసంగాలు, సాంస్కృతిక కార్యక్రమాలు నిర్వహించారు. ఉపాధ్యాయులకు పుష్పగుచ్ఛాలు, శుభాకాంక్షలు తెలియజేసి గురువు పట్ల తమ గౌరవాన్ని చాటుకున్నారు. కార్యక్రమంలో ఉపాధ్యాయులు మాట్లాడుతూ విద్యార్థుల భవిష్యత్తును తీర్చిదిద్దడంలో గురువుల పాత్ర ఎంతో కీలకమని, విద్యార్థులు క్రమశిక్షణ, కష్టపడి చదవడం, మంచి విలువలను అలవర్చుకోవాలని సూచించారు. ఈ కార్యక్రమంలో పాఠశాల ప్రిన్సిపాల్ తాళ్లపల్లి రాకేష్, ఉపాధ్యాయులు, విద్యార్థులు పాల్గొని కార్యక్రమాన్ని విజయవంతం చేశారు.

## కాకతీయ హైస్కూల్లో ఉపాధ్యాయ దినోత్సవ వేడుకలు

**చిట్యాల, సెప్టెంబర్ 5 (పీపుల్స్ డైరీ) :** భారతదేశ మాజీ రాష్ట్రపతి స్వర్గీయ సర్వేపల్లి రాధాకృష్ణ జన్మదినాన్ని భారత ప్రభుత్వం ప్రతి సంవత్సరం సెప్టెంబర్ 5వ తేదీని అతని జన్మదినాన్ని గురుపూజోత్సవ కార్యక్రమంగా జరుపుకుంటారు. అందులో భాగంగా చిట్యాల మండల కేంద్రంలోని కాకతీయహై స్కూల్లో గురుపూజోత్సవ కార్యక్రమంలో భాగంగా పాఠశాలలోని ఉపాధ్యాయిని ఉపాధ్యాయులకు పాఠశాల కరస్పాండెంట్ షీల్డ్ లు బహుకరించి శాలువాలతో ఘనంగా సన్మానించారు. ఈ సందర్భంగా కరెస్పాండెంట్ మహమ్మద్ రాజ్ మహమ్మద్ మాట్లాడుతూ ఉపాధ్యాయులు రాధాకృష్ణన్ ను ఆదర్శంగా తీసుకొని విద్యార్థులకు పాఠాలు బోధించాలని విద్యార్థులను సమాజంలో ఉన్నత పౌరులుగా తీర్చిదిద్దాలని తెలియజేశారు. ఈ సమావేశంలో పాఠశాల ఉపాధ్యాయులు విద్యార్థులు విద్యార్థుల తల్లిదండ్రులు పాల్గొన్నారు.





## లిటిల్ ఫ్లవర్ హైస్కూల్లో ఉపాధ్యాయ దినోత్సవం

**దుగ్గొండి (రేకంపల్లి), సెప్టెంబర్ 5 (పీపుల్స్ డైరీ) :** దుగ్గొండి మండల పరిధిలోని రేకంపల్లి గ్రామంలో ఉన్న లిటిల్ ఫ్లవర్ హైస్కూల్లో ఉపాధ్యాయ దినోత్సవ (గురుపూజోత్సవం) వేడుకలు శనివారం వైభవంగా నిర్వహించారు. ఈ కార్యక్రమానికి పాఠశాల చైర్మన్ గట్టిగొప్పుల విజేందర్ ముఖ్య అతిథిగా హాజరై, సర్వేపల్లి రాధాకృష్ణన్ చిత్రపటానికి పూలమాల వేసి నివాళులర్పించారు. ఈ సందర్భంగా పాఠశాల చైర్మన్ గట్టిగొప్పుల విజేందర్ మాట్లాడుతూ.. మాజీ రాష్ట్రపతి, డాక్టర్ సర్వేపల్లి రాధాకృష్ణన్ ఆశయాలను ప్రతి ఒక్కరూ కొనసాగించాలని పిలుపునిచ్చారు. దేశ పురోగతిలో, విద్యార్థుల భవిష్యత్తును తీర్చిదిద్దడంలో ఉపాధ్యాయులు చేసే సేవలు వెలకట్టలేనివని కొనియాడారు. సమాజంలో గురువు స్థానం ఎంతో ఉన్నతమైనదని, విద్యార్థులకు క్రమశిక్షణతో కూడిన విద్యను అందిస్తూ వారిని ఉత్తమ పౌరులుగా తీర్చిదిద్దాల్సిన బాధ్యత ఉపాధ్యాయులపై ఉందన్నారు. అనంతరం పాఠశాల ఉపాధ్యాయులను శాలువాలు, జ్ఞాపికలతో ఘనంగా సన్మానించారు.

## సమాజ నిర్మాణంలో ఉపాధ్యాయుల పాత్ర కీలకం

**ఇల్లందు (భద్రాద్రి కొత్తగూడెం) సెప్టెంబర్ 05(పీపుల్స్ డైరీ) :** భారత మాజీ రాష్ట్రపతి, ప్రముఖ విద్యావేత్త డాక్టర్ సర్వేపల్లి రాధాకృష్ణన్ జయంతిని పురస్కరించుకుని ఇల్లందు పట్టణం కాకతీయ స్కూల్ నందు ఉపాధ్యాయ దినోత్సవ వేడుకలను పాఠశాల యాజమాన్యం ఘనంగా నిర్వహించింది. విద్యార్థులు ఉపాధ్యాయులను పూలమాలలు, శాలువాలతో సత్కరించి ఉపాధ్యాయ దినోత్సవ శుభాకాంక్షలు తెలిపారు. పుష్పగుచ్ఛాలను అందజేసి చిరు జ్ఞాపికలతో సన్మానం చేసి తమ గౌరవాన్ని చాటుకున్నారు. విద్యార్థులు ఉపాధ్యాయుల సేవలను కొనియాడుతూ సమాజ నిర్మాణంలో ఉపాధ్యాయుల పాత్ర ఎంతో కీలకమని, విద్యార్థుల భవిష్యత్తును తీర్చిదిద్దే బాధ్యత గురువులపై ఉంటుందని పేర్కొన్నారు. విద్యార్థుల ప్రసంగాలు పలువురిని ఆకట్టుకున్నాయి. ఈ వేడుకలకు ముఖ్య అతిథిగా కాకతీయ స్కూల్ చైర్మన్ దండు రామచందర్ మాట్లాడుతూ ప్రతి సంవత్సరం సెప్టెంబర్ 5వ తేదీన విద్యావేత్త డాక్టర్ సర్వేపల్లి రాధాకృష్ణన్ జయంతిని



పురస్కరించుకొని ఉపాధ్యాయ దినోత్సవాన్ని ఘనంగా జరుపుకుంటామని అన్నారు. విద్యార్థి విజయానికి గురువే కారణమని, విద్యార్థులు విద్యాపరంగా ఉన్నత లక్ష్యాలను సాధించి అత్యుత్తమ ప్రతిభను చాటినప్పుడు ఆ గురువుకు నిజమైన బహుమతి ఇచ్చిన వారవుతారని అన్నారు. పాఠశాల ఉపాధ్యాయులు మాట్లాడుతూ విద్యార్థులు క్రమశిక్షణతో చదువుకుని ఉన్నత లక్ష్యాలను సాధించాలని సూచించారు. గురువుల పట్ల గౌరవం, తల్లిదండ్రుల పట్ల ప్రేమతో వ్యవహరిస్తూ మంచి పౌరులుగా ఎదగాలని, తాము చదువుకుంటున్న పాఠశాలకు, తల్లిదండ్రులకు మంచి పేరు తీసుకురావాలని సూచించారు. పాఠశాల ప్రాంగణం మొత్తం పండుగ వాతావరణ సంతరించుకుంది. ఈ కార్యక్రమంలో కాకతీయ స్కూల్ చైర్మన్ దండు రామచందర్, దండు నీలిమ ఉపాధ్యాయులు, పాఠశాల సిబ్బంది, విద్యార్థులు తదితరులు పాల్గొన్నారు.

## ఉపాధ్యాయులను సన్మానించిన లక్ష్మీనారాయణ



**గీసుకొండ, సెప్టెంబర్ 5 (పీపుల్స్ డైరీ) :** గీసుకొండ గ్రామంలో ఉన్నత పాఠశాల ప్రాథమిక పాఠశాల ఎంఆర్సి లోని గురుపూజోత్సవం సందర్భంగా ఉపాధ్యాయులను గీసుగొండ గ్రామ శ్రీమంతులు పెగాళ్ళపాటి లక్ష్మీనారాయణ ఘనంగా సన్మానిస్తూ వారి సేవలు గ్రామ అభివృద్ధిలో ఎంతో తోడ్పడతాయని తెలియజేశారు, ఈ కార్యక్రమంలో గ్రామ సర్పంచ్ వీరగోని రాజకుమార్ మాట్లాడుతూ రాబోయే రోజుల్లో ఈ పాఠశాలలో విద్యార్థుల అడ్మిషన్లు పెరగటానికి తన వంతు కృషి చేస్తానని పాఠశాల అభివృద్ధికి ఎల్లవేళలా అందుబాటులో ఉంటానని పాఠశాలలో మౌలిక సదుపాయాలకు సహకారం అందిస్తానని తెలియపరిచారు ఈ కార్యక్రమంలో ముఖ్యఅతిథిగా పాల్గొన్న ఎంఈఓ రవీందర్ ఎంతో ఉన్నతమైన లక్షణాలు కలిగిన లక్ష్మీనారాయణ ఈ గ్రామానికి ఈ పాఠశాలకి ఎనలేని కృషి చేస్తున్నారని అందరికీ అందుబాటులో ఉంటూ గ్రామ అభివృద్ధిలో మంచి తోడ్పాటు అందిస్తున్నారని కొనియాడారు. ఈ కార్యక్రమంలో ఉన్నత పాఠశాల అమ్మ ఆదర్శ పాఠశాల కమిటీ సభ్యులు మమత,ప్రాథమిక పాఠశాల సభ్యులు ఉమారాణి, గతంలో ఈ పాఠశాలలో పనిచేసి వెళ్లిన పట్టాభి, చంద్రకళ ,సంఘం శ్రీనివాస్ ,లచ్చిరాం లను ఘనంగా సన్మానిస్తూ వారి సేవలను కొనియాడారు, కార్యక్రమంలోఉన్నత పాఠశాల ప్రాథమిక పాఠశాల ఉపాధ్యాయులు పాల్గొనారు.

## విద్యార్థులే ఉపాధ్యాయులుగా పాఠాల బోధన

**ఖమ్మం, సెప్టెంబర్ 5 (పీపుల్స్ డైరీ) :** స్థానిక స్మార్ట్ కిడ్జ్ పాఠశాలలో స్వయంపాలన దినోత్సవంను జాతీయ ఉపాధ్యాయ దినోత్సవం సందర్భంగా శనివారం ఘనంగా నిర్వహించారు. విద్యార్థులు ఉపాధ్యాయులుగా మారి తరగతులు బోధించడం ప్రత్యేకతను సంతరించుకుంది. ప్రత్యేక వస్త్రధారణలో డిఈఓ గా, హెడ్మాస్టర్‌గా పలు సబ్జెక్టుల ఉపాధ్యాయులుగా, పిఈటిలుగా, అటెండర్ గా వ్యవహరించి విద్యార్థులకు పాఠాలను బోధించారు. తొలుత సర్వేపల్లి రాధాకృష్ణన్ చిత్రపటానికి పాఠశాల కరస్పాండెంట్ చింతనిప్పు కృష్ణ చైతన్య పూలమాలవేసి ఘనంగా నివాళులర్పించారు. ఈ సందర్భంగా పాఠశాల కరస్పాండెంట్ చింతనిప్పు కృష్ణ చైతన్య మాట్లాడుతూ... పాఠశాలలో ఉపాధ్యాయుల పనితీరును తెలుసుకోవడానికి స్వయంపాలన దినోత్సవం నిర్వహించామన్నారు. ఉపాధ్యాయులు విద్యార్థులను అన్ని రంగాలలో తీర్చిదిద్దడానికి నిరంతరం కృషి చేస్తున్న తీరును స్వయంపాలన దినోత్సవం ద్వారా తెలియజేశామన్నారు. అనంతరం పాఠశాల ఉపాధ్యాయులందరినీ పాఠశాల కరస్పాండెంట్ చింతనిప్పు కృష్ణ చైతన్య ఘనంగా సత్కరించారు. ఈ కార్యక్రమంలో పాఠశాల డైరెక్టర్ చింతనిప్పు సుకన్య, ప్రిన్సిపల్, ఉపాధ్యాయులు, విద్యార్థులు తదితరులు పాల్గొన్నారు.




## ఉపాధ్యాయుల దినోత్సవ వేడుకలు

**ఖమ్మం, సెప్టెంబర్ 5 (పీపుల్స్ డైరీ) :** ఉపాధ్యాయుల దినోత్సవాన్ని పురస్కరించుకుని ఖమ్మం శ్రీకృష్ణ ప్రసాద్ మెమోరియల్ పోలీస్ సంక్షేమ పాఠశాలలో ఘనంగా వేడుకలు నిర్వహించారు. డాక్టర్ సర్వేపల్లి రాధాకృష్ణన్ చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. ఈ సందర్భంగా స్కూల్ చైర్ పర్సన్ నిష్టాశర్మ ఉపాధ్యాయుల సేవలను కొనియాడుతూ, విద్యార్థుల జీవితాలను తీర్చిదిద్దడంలో ఉపాధ్యాయుల పాత్ర ఎంతో కీలకమని పేర్కొన్నారు. కార్యక్రమం లో ఉపాధ్యాయులను ఘనంగా సన్మానించి, వారికి శుభాకాంక్షలు తెలిపారు.విద్యార్థులు ఉపాధ్యాయుల పట్ల తమ గౌరవాన్ని చాటుతూ సాంస్కృతిక కార్యక్రమాలు నిర్వహించారు. ఈ సందర్భంగా విద్యార్థులే ఉపాధ్యాయులుగా పాఠ్యాంశ బోధించి ఆకట్టుకున్న విద్యార్థులు సోహిత్, ఆసియా ఫిర్దోస్, హర్షిత లకు బహుమతులు అందజేశారు. ఈ కార్యక్రమంలో ఏఆర్ ఏసీపీ నర్సయ్య, ఆర్ఐ కామరాజు, ప్రిన్సిపాల్ శ్రీనివాస్ రాజు, పాఠశాల సిబ్బంది, ఉపాధ్యాయులు, విద్యార్థులు పాల్గొన్నారు.



## ఉత్తమ ఉపాధ్యాయ అవార్డు అందుకున్న డిఎస్.నాగేశ్వరరావు



**ఏన్కూరు, సెప్టెంబర్ 5 (పీపుల్స్ డైరీ) :** గురుపూజోత్సవాన్ని పురస్కరించుకొని ఐటీడీఏ భద్రాచలం గిరిజన భవన్ లో శనివారం జరిగిన ఉపాధ్యాయ సన్మానోత్సవ కార్యక్రమంలో ఏన్కూర్ మండలం ప్రభుత్వ గిరిజన ఆశ్రమ ఉన్నత పాఠశాల మూలపోచారం పాఠశాలలో తెలుగు భాషోపాధ్యాయులుగా పని చేస్తున్న డిఎస్.నాగేశ్వరరావు ఉమ్మడి ఖమ్మం జిల్లా ఐటీడీఏ స్థాయి ఉత్తమ ఉపాధ్యాయ అవార్డును సమీకృత గిరిజనాభివృద్ధి సంస్థ ఐటీడీఏ భద్రాచలం ప్రాజెక్టు ఆఫీసర్ బి. రాహుల్ ఐఏఎస్ మరియు భద్రాద్రి కొత్తగూడెం జిల్లా డిప్యూటీ డైరెక్టర్ చందన సర్వే,ఏపీవో డేవిడ్ రాజ్, ఖమ్మం ఏసిఎంఓ ఎల్. రాములు చేతులు మీదుగా అందుకున్నారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ ఫిబ్రవరి ఏడు 1994న గిరిజన సంక్షేమ శాఖలో మొదటి నియామకం పొంది ప్రభుత్వ గిరిజన ఆశ్రమ ఉన్నత పాఠశాల బయ్యారం మండలం ఇర్సులాపురం, సింగరేణి మండలం రేలకాయలపల్లి, ఏన్కూరు మండలం మూలపోచారం పాఠశాలల్లో పనిచేస్తూ 32 సంవత్సరాలు పూర్తి చేసుకున్నానని గిరిజన మన్య ప్రాంతంలో గిరిజన విద్యార్థుల కోసం అహర్నిశలు శ్రమిస్తూ పదవ తరగతిలో నూరు శాతం ఫలితాలు సాధించడంలో కృషి చేస్తూ, విద్యార్థుల యొక్క జీవన ప్రమాణాలను మెరుగుపరుస్తూ,భావి భారత పౌరులుగా తీర్చిదిద్దే అవకాశం నాకు కలిగినందుకు అదృష్టంగా భావిస్తున్నానని పేర్కొన్నారు. నేను బోధించే సబ్జెక్టులలో ఇప్పటివరకు నూటికి నూరు శాతం ఫలితాలు సాధిస్తూ గిరిజన సంక్షేమ శాఖ ప్రాజెక్ట్ ఆఫీసర్ ఐటిడిఏ భద్రాచలం వారిచే, డిప్యూటీ డైరెక్టర్ భద్రాచలం, ఖమ్మం వారిచే సన్మానాలు, ప్రశంసలు పొందటం వలన నాపై మరింత బాధ్యతను పెంచిందని పేర్కొన్నారు.ఉమ్మడి ఖమ్మం జిల్లా ఐటీడీఏ ఉత్తమ ఉపాధ్యాయులుగా ఎంపిక కావటం పట్ల పాఠశాల ప్రధానోపాధ్యాయులు, ఉపాధ్యాయులు, విద్యార్థుల తల్లిదండ్రులు, నాలుగో తరగతి ఉద్యోగులు, శ్రేయోభిలాషులు, బంధుమిత్రులు, విద్యార్థిని,విద్యార్థులు హర్షం వ్యక్తం చేశారు.


## తల్లిదండ్రుల జ్ఞాపకార్థం విద్యార్థులకు దుస్తులు పంపిణీ

**మొగుళ్ళపల్లి, సెప్టెంబర్ 5 (పీపుల్స్ డైరీ) :** మండలం లోని మొట్లపల్లి ప్రాథమిక పాఠశాలలో విద్యార్థిని విద్యార్థులకు యాభై వేల విలువ చేసే వంద యూనిఫార్మ్‌ని మొట్లపల్లి ఎన్ఆర్ఐ చిలుకూరి వెంకటరెడ్డి తల్లిదండ్రులు చిలుకూరి అనంతవ్వ, వీరారెడ్డి జ్ఞాపకార్థం విద్యార్థిని విద్యార్థులకు అందజేశారు. పాఠశాల ప్రధానోపాధ్యాయురాలు చెన్న సరిత అధ్యక్షతన జరిగిన ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా మండల విద్యాధికారి లింగాల కుమారస్వామి, గ్రామ సర్పంచి నరహరి వెంకట్ రెడ్డి హాజరై ఈ ప్రత్యేక యూనిఫామ్, ప్రభుత్వ ఉచిత యూనిఫామ్ లు విద్యార్థిని విద్యార్థులకు అందజేశారు. అనంతరం జరిగిన కార్యక్రమంలో గ్రామ సర్పంచ్ మాట్లాడుతూ ప్రభుత్వం పిల్లలకు ఉచిత భోజనం, యూనిఫామ్‌లు పుస్తకములు నోటుబుక్కు, షూలు అన్ని సౌకర్యాలను ప్రభుత్వ పిల్లలకు అందజేస్తుంది వీటిని ఉపయోగించుకుని మీరు చక్కగా చదివి మీ తల్లిదండ్రులకు ఉపాధ్యాయులకు, గ్రామానికి మంచి పేరు తీసుకురావాలని పిల్లలకు సూచించారు. ఈ కార్యక్రమాన్ని ఉద్దేశించి



ఎంఈఓ మాట్లాడుతూ అనుభవజ్ఞులైన టీచర్లు మీ పాఠశాలలో ఉన్నారు. వారు చెప్పే విద్యా విషయాలను శ్రద్ధగా విని బాగా చదువుకోవాలని క్రమం తప్పకుండా పాఠశాలకు రావాలని పిల్లలకు పిలుపునిచ్చారు. ప్రధానోపాధ్యాయురాలు చెన్న సరిత మాట్లాడుతూ పాఠశాలలో జరిగే అనేక కార్యక్రమాలకు ముఖ్య అతిథులుగా విచ్చేసి మాకు చేదోడుగా వాదోడుగా నిలుస్తున్న సర్పంచ్, వార్డ్ మెంబర్లకు కృతజ్ఞతలు తెలియజేరు. ఉపాధ్యాయ దినోత్సవం నాడు స్పెషల్ యూనిఫామ్, గవర్నమెంట్ ప్రభుత్వ ఉచిత యూనిఫామ్స్ మీ అందరి చేతుల మీదుగా పంపిణీ చేయడం చాలా ఆనందంగా ఉందని అన్నారు. ఈ కార్యక్రమంలో ఉప సర్పంచ్ ఆళ్ళ ముత్యం రెడ్డి, సీఏ బాలకృష్ణ, పాత్రికేయులు రాళ్ల బండి శ్రీనివాస్, పాఠశాల ఉపాధ్యాయులు మహేష్, సురేందర్, శ్రీధర్, సునీత దేవి, రమేష్ పీపీ ఇన్‌స్ట్రక్టర్ రవళి, బోధనేతర సిబ్బంది, విద్యార్థిని, విద్యార్థులు తల్లిదండ్రులు పాల్గొన్నారు.







## పౌష్టికాహారంతో ఆరోగ్యకరమైన భవిష్యత్

**గణపురం, సెప్టెంబర్ 5 (పీపుల్స్ డైరీ) :** గణపురం మండలంలోని లక్ష్మిరెడ్డిపల్లి, కర్కపల్లి గ్రామాల్లోని అంగన్వాడీ కేంద్రాల్లో పోషకాహార వారోత్సవాలను నిర్వహించారు. జిల్లా వైద్యాధికారి మధుసూదన్ రావు ముఖ్యఅతిథిగా పాల్గొని గర్భిణీలు, బాలింతలు, చిన్నారుల తల్లులకు పోషకాహారం, ఆరోగ్య పరిరక్షణపై అవగాహన కల్పించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ... గర్భిణీలు, బాలింతలు నిత్యం సమతుల్యమైన పౌష్టికాహారం తీసుకోవాలని సూచించారు. గర్భధారణ సమయంలో తీసుకునే పోషకాహారం తల్లి ఆరోగ్యంతో పాటు శిశువు ఎదుగుదలకు దోహదపడుతుందన్నారు. చిన్నారులకు వయసుకు అనుగుణంగా పోషకాహారం అందించాలని, అంగన్వాడీ కేంద్రాల ద్వారా అందించే పోషకాహారాన్ని సద్విని యోగం చేసుకోవాలని సూచించారు. అనంతరం చిన్నారులకు (టీహెచ్ఆర్) పోషకాహారాన్ని పంపిణీ చేశారు. కార్యక్రమంలో ఏఎన్ఎంలు నవీన, పార్వతి, అంగన్వాడీ టీచర్లు రామిడి కోమలదేవి, జన్ను సుసాన్, ఆశా వర్కర్లు జమున, వసంతతో పాటు గర్భిణీలు, బాలింతలు, చిన్నారుల తల్లులు పాల్గొన్నారు.

## పాఠశాలలో దుస్తులు, అంగన్వాడీలో బాలామృతం పంపిణీ



**మొగుళ్ళపల్లి, సెప్టెంబర్ 5 (పీపుల్స్ డైరీ) :** మండలంలోని పెద్ద కొమిటిపల్లి గ్రామంలో ప్రభుత్వ పాఠశాలలో చదివే విద్యార్థుల కోసం ప్రభుత్వం శనివారం పాఠశాలలోని విద్యార్థులకు గ్రామ సర్పంచ్ సప్పిడి ఇందిర, కాంగ్రెస్ పార్టీ వర్కింగ్ ప్రెసిడెంట్ మెరుగు సురేష్ దుస్తులు, షూస్ పంపిణి చేశారు. అనంతరం గ్రామంలోని అంగన్వాడీ కేంద్రంలో సూపర్ వైజర్ సుజాత ఆధ్వర్యంలో. పోషణ మాసం సందర్భంగా చిన్నారులకు బాలామృతం, చిక్కిపంపిణి చేశారు. ఈ కార్యక్రమంలో గ్రామ సర్పంచ్ సప్పిడి ఇందిర, కాంగ్రెస్ పార్టీ వర్కింగ్ ప్రెసిడెంట్ మెరుగు సురేష్, పాఠశాల ప్రధాన ఉపాధ్యాయులు, బి. రాజ్ కుమార్, ఉపాధ్యాయులు. సుమలత, అంగన్వాడీ టీచర్, పుష్పలత, వార్డ్ మెంబెర్. దర్శనాల కోమల, విఒ అధ్యక్షురాలు మెరుగు శారద, విద్యార్థులు, గర్భిణీలు, చిన్నారుల తల్లులు పాల్గొన్నారు.

## కార్మికుల హామీలను కాంగ్రెస్ విస్మరించింది

### మాజీ ఎమ్మెల్యే గండ్ర వెంకటరమణారెడ్డి

**గణపురం, సెప్టెంబర్ 05 (పీపుల్స్ డైరీ) :** సింగరేణి కార్మికులకు ఇచ్చిన హామీలను అమలు చేయడంలో కాంగ్రెస్ ప్రభుత్వం విఫలమైందని మాజీ ఎమ్మెల్యే గండ్ర వెంకటరమణా రెడ్డి ఆరోపించారు. శనివారం మండలంలోని బస్వరాజుపల్లి గ్రామ పరిధిలోని 8 ఇంక్లైన్ వద్ద కార్మికులతో నిర్వహించిన సమావేశంలో ఆయన మాట్లాడారు. 100 రోజుల్లో హామీలు అమలు చేస్తామని చెప్పి.. 1000 రోజులు గడిచినా పట్టించుకోలేదని విమర్శించారు. కార్మికుల సమస్యలపై ప్రభుత్వం మొండి వైఖరి వీడాలని డిమాండ్ చేశారు. అనంతరం మేనేజర్‌ను కలిసి కార్మికుల సమస్యలను వివరించి, పరిసర గ్రామాల అభివృద్ధికి సహకరించాలని కోరారు.

## బాధిత కుటుంబానికి బియ్యం వితరణ



**మొగుళ్ళపల్లి సెప్టెంబర్ 5 (పీపుల్స్ డైరీ) :** మండలంలోని మేదరమెట్ల గ్రామానికి చెందిన కట్ల రాములు ఇటీవల అనారోగ్యంతో మృతి చెందగా. విషయం తెలుసుకున్న తెలంగాణ రాజ్యాధికార పార్టీ జయశంకర్ భూపాలపల్లి జిల్లా అధ్యక్షుడు రవి పటేల్ మృతుని కుటుంబ సభ్యులను పరామర్శించారు. మృతుడు కట్ల రాములు నిరుపేద కుటుంబం కావడంతో. పరిస్థితిని తెలుసుకున్న రవి పటేల్, తక్షణ సహాయంగా 25 కేజీల బియ్యాన్ని అందజేశారు. మృతుని ఆత్మకు శాంతి చేకూరాలని వేడుకుని ప్రగాఢ సానుభూతి తెలియజేసారు. భవిష్యత్తులో కూడా కట్ల రాములు కుటుంబానికి తెలంగాణ రాజ్యాధికార పార్టీ అండగా ఉంటుందని కుటుంబ సభ్యులకు ఆయన భరోసా ఇచ్చారు. ఆయన వెంట గ్రామ టీఆర్‌పీ నాయకులు గుణికంటి విష్ణు, సాధు మల్లన్న ముదిరాజ్, రాంబాబు, రాజేందర్ రాజేష్, రవికుమార్, రాకేష్ బాలవేణి శ్రీనివాస్ మంద నరేష్ కట్ల స్వామి, కొడారి కుమారస్వామి, కట్ల రాజయ్య గొల్ల మల్లయ్య, తదితరులు పాల్గొన్నారు.

## మీసేవ కేంద్రాల్లో నిబంధనలు పాటించకుంటే కఠిన చర్యలు : మేనేజర్ యుగంధర్



**కేసముద్రం, సెప్టెంబర్ 5 (పీపుల్స్ డైరీ) :** తెలంగాణ ప్రభుత్వం ఇటీవల రూపొందించిన నిబంధనలను మీసేవ కేంద్రాల్లో ఖచ్చితంగా అమలు చేయాలని మహబూబాబాద్ జిల్లా ఈ-డిస్ట్రిక్ట్ మేనేజర్ యుగంధర్ అన్నారు. శనివారం కేసముద్రం మండలంలోని పలు మీసేవ కేంద్రాలను ఆయన ఆకస్మికంగా తనిఖీ నిర్వహించారు. ఆయన మాట్లాడుతూ వినియోగదా రులను ఇబ్బందులకు గురిచేయవద్దని, ఇటీవల ప్రభుత్వం ధృవీకరణ పత్రాలను త్వరితగతిన ఆమోదించేందుకు గ్రామపాలన అధికారులు మరియు రెవెన్యూ ఇన్ స్పెక్టర్లకు యాప్ అందుబాటులోకి తీసుకొనివచ్చిందన్నారు. మీసేవ కేంద్రాల నిర్వాహకులు ఎట్టి పరిస్థితుల్లో చెక్ లిస్టులు, రశీదులు వినియోగదారులకు ఇవ్వకూడదని హెచ్చరించారు. నిబంధ నలను అతిక్రమించిన మీసేవ కేంద్రాలపై కఠిన చర్యలు తప్పవన్నారు. అధిక రుసుములు వసూలు చేయవద్దని, నిబంధనలు తూచా తప్పకుండా పాటించాలని ఆదేశించారు. సేవలు పొందే విషయంలో వినియోగదారులకు ఏవైనా ఇబ్బందులు తలెత్తితే మీసేవ టోల్ ఫ్రీ నెంబరు 1100లో సంప్రదించాలని కోరారు.

# డిజిటల్ రీ-సర్వేతో భూ సమస్యలకు చెక్

## డిజిటల్ రీ-సర్వేను పకడ్బందీగా చేపట్టాలి - జిల్లా కలెక్టర్ రాహుల్ శర్మ

**గణపురం, సెప్టెంబర్ 05 (పీపుల్స్ డైరీ) :** భూ రికార్డుల్లో పారదర్శకత, కచ్చితత్వం పెంచేందుకు చేపట్టిన డిజిటల్ భూ రీ-సర్వే పనులను జిల్లా కలెక్టర్ రాహుల్ శర్మ శనివారం క్షేత్రస్థాయిలో పరిశీలించారు. మండలంలోని అప్పయ్యపల్లి గ్రామపంచాయతీ శివారులోని తూపురం వద్ద జరుగుతున్న సర్వే పనులను పరిశీలించిన ఆయన.. సర్వే అధికారులు, సిబ్బందితో మాట్లాడి పురోగతిని, అనుసరిస్తున్న విధానాన్ని తెలుసుకున్నారు. అనంతరం రైతులతో మాట్లాడి వారి అభిప్రాయాలను అడిగి తెలుసుకున్నారు. రీ-సర్వే పనులను ఎలాంటి పొరపాట్లకు తావులేకుండా ఖచ్చితత్వంతో, నిర్ణీత గడువులోగా పూర్తి చేయాలని అధికారులను ఆదేశించారు. జిల్లాలో 70 గ్రామాలను రీ-సర్వేకు ఎంపిక చేయగా ప్రస్తుతం 12 గ్రామాల్లో పనులు కొనసాగుతున్నాయని, మిగిలిన గ్రామాల్లోనూ సర్వేను ప్రారంభించాలని సూచించారు. గణపురం మండలంలో ఆరు గ్రామాలను ఎంపిక చేయగా మూడు గ్రామాల్లో ప్రస్తుతం రీ-సర్వే జరుగుతోందన్నారు. క్షేత్రస్థాయిలో విధులు నిర్వహిస్తున్న సర్వేయర్ల భద్రతకు గమ్ షూస్, ఇతర రక్షణ పరికరాలను సమకూర్చాలని ఆదేశించారు. రోవర్ తదితర ఆధునిక సాంకేతిక పరికరాలను సమర్థవంతంగా వినియోగించి సర్వేను వేగంగా పూర్తి చేయాలని సూచించారు.



### అధికారులే భూముల వద్దకు రావడం ఆనందంగా ఉంది

అప్పయ్యపల్లి రైతు కొప్పుల యాకయ్య మాట్లాడుతూ... గతంలో భూ సమస్యల పరిష్కారం కోసం రెవెన్యూ కార్యాలయాల చుట్టూ తిరగాల్సి వచ్చేదన్నారు. ప్రస్తుతం అధికారు లు రైతుల వద్దకే వచ్చి భూములను సర్వే చేయడం సంతోషంగా ఉందన్నారు. ఆధుని క సాంకేతిక పరిజ్ఞానంతో భూము ల కొలతలు చేపట్టి వివరాలను డిజిటల్‌గా నమోదు చేయడం వల్ల భూ రికార్డుల్లో స్పష్టత వస్తుందని ఆశాభావం వ్యక్తం చేశారు. భూముల హద్దులు, విస్తీర్ణం తదితర వివరాలు కచ్చితంగా నమోదైతే భవిష్యత్తులో భూ తగాదాలు తగ్గడంతో పాటు సమస్యలు త్వరగా పరిష్కారమవుతాయని పేర్కొన్నారు. కార్యక్రమంలో సర్వే అండ్ ల్యాండ్ రికార్డ్స్ ఏడీ కుసుమ కుమారి, ఆర్డీవో హరికృష్ణ, తహశీల్దార్ రాజేశ్వర రావు, సర్వే సిబ్బంది, రైతులు తదితరులు పాల్గొన్నారు.

# మిషన్ భగీరథ ప్లాంటును పరిశీలించిన కలెక్టర్

**శాయంపేట, సెప్టెంబర్ 5,(పీపుల్స్ డైరీ) :** శాయంపేట మండలంలో గ్రామాలకు తాగునీటి సరఫరా ఎలా ఉందో తెలుసుకునేందుకు హనుమకొండ జిల్లా కలెక్టర్ చాహత్ బాజ్ పాయ్ పర్యటించారు. మండలంలోని జోగంపల్లి లోని మిషన్ భగీరథ తాగునీటి శుద్ధికరణ ప్లాంట్ ను కలెక్టర్ పరిశీలించారు. ఈ సందర్భంగా నీటి సరఫరా, పంపుల పనితీరు, క్లోరినేషన్, పంపింగ్ విధానం తదితర అంశాలను అధికారులను అడిగి తెలుసుకున్నారు. శాయంపేట మండలంలోని 24 గ్రామాలకు నీటి సరఫరా ఏ విధంగా చేస్తున్నారో అధికారుల నుండి వివరాలు తెలుసుకున్నారు. అలాగే మిషన్ భగీరథ నీటి సరఫరాలో ఎలాంటి అంతరాయం లేకుండా చూడాలని అధికారులను ఆదేశించారు. నీటి సరఫరా వ్యవస్థలో ఎక్కడైనా సమస్యలు తలెత్తితే వెంటనే గుర్తించి పరిష్కరించాలని సూచించారు. ప్రత్యామ్నాయ నీటి వనరులు సిద్ధంగా ఉంచాలని ప్రజలకు తాగునీటి విషయంలో ఎలాంటి ఇబ్బందులు కలగకుండా నిరంతరం పర్యవేక్షించాలని సూచించారు. ఈ పర్యటనలో మిషన్ భగీరథ ఇంట్రా ఆర్ డబ్ల్యూ ఎస్ ఈఈ గాయత్రి ,వాటర్ గ్రిడ్ ఈ ఈ సురేందర్ ,సాగునీటి పారుదల శాఖ ఈఈ సునీతతో పాటు ఇతర అధికారులు పాల్గొన్నారు.



# ప్రత్యేక ప్రచార దినాల్లో ఓటరు జాబితా సేవలను సద్వినియోగం చేసుకోవాలి

### ఎన్నికల నమోదు అధికారి, ఆర్డీవో కృష్ణవేణి

**గోవిందరావుపేట, సెప్టెంబర్ 5 (పీపుల్స్ డైరీ) :** అర్హులైన ప్రతి ఒక్కరూ ఓటరుగా నమోదు కావాలని, ఓటర్ల జాబితా ప్రత్యేక సమగ్ర సవరణలో భాగంగా నిర్వహిస్తున్న ప్రత్యేక ప్రచార దినాలను ప్రజలు సద్వినియోగం చేసుకోవాలని ఎన్నికల నమోదు అధికారి, ఆర్డీవో కృష్ణవేణి కోరారు. శనివారం ప్రత్యేక ప్రచార దినం సందర్భంగా గోవిందరావుపేట మండలంలోని గోవిందరా వుపేట, చల్వాయి, తాడ్వాయి మండలంలోని తాడ్వాయి, కాటాపూర్ గ్రామాల్లోని పోలింగ్ కేంద్రాలను ఆర్డీవో కృష్ణవేణి క్షేత్రస్థాయిలో పరిశీలించారు. పోలింగ్ కేంద్రాల్లో అందుబాటులో ఉన్న ఓటర్ల ముసాయిదా జాబితాలు, దరఖాస్తుల స్వీకరణ ప్రక్రియను పరిశీలించి బూత్ స్థాయి అధికారులకు పలు సూచనలు చేశారు. ఓటర్ల జాబితాలో పేర్ల నమోదు, తొలగింపు, వివరాల సవరణలకు సంబం ధించిన దరఖాస్తులు, అభ్యంతరాలను నిర్ణీత నమూనా పత్రాల్లో స్వీకరించాలని ఆదేశించారు. అర్హులైన ఏ ఒక్కరూ ఓటరుగా నమోదు కాకుండా మిగిలిపోకుండా బూత్ స్థాయి అధికారులు ప్రత్యేక శ్రద్ధ వహించాలని సూచించారు. సెప్టెంబర్ 6, 12, 13 తేదీల్లో కూడా ప్రత్యేక ప్రచార దినాలు నిర్వహించనున్నట్లు తెలిపారు. ఆయా తేదీల్లో బూత్ స్థాయి అధికారులు సంబంధిత పోలింగ్ కేంద్రాల్లో అందుబాటులో ఉండి ఓటర్లకు సహకరిస్తారని పేర్కొన్నారు. ప్రజలు తమ పోలింగ్ కేంద్రాలను సందర్శించి నిర్ణీత గడువులో దరఖాస్తులు, అభ్యంతరాలను సమర్పించాలని కోరారు. నూతన ఓటరు నమోదుకు నమూనా--6, ఓటర్ల జాబితా నుంచి పేరు తొలగించేందుకు నమూనా--7, వివరాల సవరణకు నమూనా--8 ద్వారా దరఖాస్తు చేసుకోవాలని తెలిపారు. 2026 అక్టోబర్ 1వ తేదీ నాటికి 18 సంవత్సరాలు నిండే యువతీ యువకులు నిర్ణీత ప్రకటన పత్రంతోపాటు నమూనా--6ను సమీపంలోని బూత్ స్థాయి అధికారికి సమర్పించి ఓటరుగా నమోదు చేసుకోవాలని సూచించా రు. ప్రజల భాగస్వామ్యంతో తప్పులులేని సమగ్ర ఓటర్ల జాబితా రూపుదిద్దుకుంటుందని, తద్వారా ప్రజాస్వామ్య వ్యవస్థ మరింత బలోపేతమవుతుందని ఆర్డీవో కృష్ణవేణి తెలియజేశారు. కార్యక్రమంలో గోవిందరావుపేట తహసీల్దార్ సృజన్ కుమార్, ఎన్నికల డిప్యూటీ తహసీల్దార్ నితీష్, తాడ్వాయి సీనియర్ అసిస్టెంట్ నాగేంద్ర, బూత్ స్థాయి అధికారులు, సంబంధిత అధికారులు పాల్గొన్నారు.



# యూత్ డిక్లరేషన్ వెంటనే అమలు చేయాలి

**నర్సంపేట, సెప్టెంబర్ 5 (పీపుల్స్ డైరీ) :** బిఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్ ఆదేశానుసారం 1000 రోజుల కాంగ్రెస్ పాలనపై 4వ రోజు బగ్గుమన్న బీఆర్ఎస్ శ్రేణులు,యువత, విద్యార్థులు నర్సంపేట నియోజకవర్గ మండల కేంద్రంలో ఈ మోసపూరిత కాంగ్రెస్ ఏర్పడి 1000 రోజులు అయినా యువత కు విద్యార్థులకు ఇచ్చిన హామీ నెరవేర్చలేదు అని నిరసనగా నర్సంపేట చౌరస్తాలో విద్యార్థుల కోసం ధర్నా నిర్వహించారు. మాజీ మంత్రి ఎర్రబెల్లి దయాకర్ రావు, నియోజకవర్గ పరిశీలకులు ముత్తిరెడ్డి యాదగిరి రెడ్డి కార్యక్రమానికి హాజరయ్యారు. ఈ సందర్భంగా మాజీ మంత్రి ఎర్రబెల్లి దయాకర్‌రావు మాట్లాడుతూ ఎన్నికల ముందు ప్రజలకు ఇచ్చిన హామీలను అమలు చేయడంలో ప్రభుత్వం పూర్తిగా విఫలమైంది.రేవంత్ ఇచ్చిన మోసపూరిత హామీలు జాబ్ క్యాలెండర్, స్కూటీలు, యూత్ డిక్లరేషన్, 2లక్షల ఉద్యోగాలు, నిరుద్యోగ భృతి, ఫీజు రియంబర్స్ మెంట్, విద్యా భరోసా కార్డు పేరు మీద కాంగ్రెస్ పార్టీ ప్రభుత్వం అధికారం లోకి వచ్చింది...కాంగ్రెస్ ప్రభుత్వం ఫీజు రీయింబర్స్‌మెంట్ బకాయిలను వెంటనే విడుదల చేయకుండా విద్యార్థులను తీవ్ర ఇబ్బందులకు గురిచేస్తూ కాలయాపన చేస్తుంది అని అన్నారు. పరిశీలకులు ముత్తిరెడ్డి యాదగిరిరెడ్డి మాట్లాడుతూ యూత్ డిక్లరేషన్ పేరుతో యువతకు హామీలు ఇచ్చి అధికారంలోకి వచ్చిన కాంగ్రెస్ ప్రభుత్వం, నేడు వాటిని అమలు చేయకుండా విద్యార్థులు, నిరుద్యోగ యువతను మోసం చేస్తుంది ,జాబ్ క్యాలెండర్‌ను వెంటనే విడుదల చేయడంతో పాటు పెండింగ్‌లో ఉన్న ఫీజు రీయింబర్స్‌మెంట్, స్కాల ర్‌షిప్‌లను తక్షణమే విడుదల చేయాలని డిమాండ్ చేశారు. కార్యక్రమంలో నియోజకవర్గ బిఆర్ఎస్ పార్టీ నాయకులు, యూత్ విద్యార్థి విభాగం శ్రేణులు పాల్గొన్నారు.



# కాంగ్రెస్ పాలనపై ప్రతిపక్షాల అసత్య ప్రచారం




**ఇల్లందు (భద్రాద్రి కొత్తగూడెం), సెప్టెంబర్ 5 (పీపుల్స్ డైరీ) :** 1000 రోజుల కాంగ్రెస్ పాలనపై ప్రతిపక్షాలు చేస్తున్న ఆరోపణల్లో ఏమాత్రం వాస్తవం లేదని ఇల్లందు ఎమ్మెల్యే కోరం కనకయ్య అన్నారు. ఇల్లందు మార్కెట్ యార్డ్‌లో జరిగిన సమావేశంలో ఆయన మాట్లాడుతూ, గత ప్రభుత్వం పదేళ్ల పాలనలో పేదల కోసం చేసింది శూన్యమని, కేవలం ప్రచార ఆర్భాటాలకే పరిమితమైందని విమర్శించారు. పేదల సంక్షేమాన్ని పూర్తిగా విస్మరించిన గత పాలకులకు ఇప్పుడు విమర్శించే నైతిక అర్హత లేదన్నారు. రేవంత్ రెడ్డి నేతృత్వంలోని కాంగ్రెస్ ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన తర్వాతే రాష్ట్రంలో నిజమైన ఇందిరమ్మ రాజ్యం వచ్చిందని తెలిపారు. మహిళల కోసం మహాలక్ష్మి పథకం కింద ఉచిత బస్సు సౌకర్యం కల్పించి ఆడబిడ్డలకు అండగా నిలిచిందని, అదేవిధంగా గృహజ్యోతి, యువ వికాసం, చేయూత వంటి ఆరు గ్యారెంటీ పథకాలను అమలు చేస్తూ ప్రతి పేదవాడికి న్యాయం చేస్తోందని పేర్కొన్నారు. నియోజకవర్గంలోని ప్రతి రైతు భూమికి సాగునీరు అందించడమే తమ ప్రధాన లక్ష్యమని, సీతారామ ప్రాజెక్టును పూర్తి చేసేందుకు కృషి చేస్తానని హామీ ఇచ్చారు. గత ఎమ్మెల్యే సీతారామ ప్రాజెక్టుపై అబద్ధపు ప్రచారం చేస్తూ ప్రజలను, రైతులను మోసం చేశారని, సీతారామ ప్రాజెక్టు నీళ్లు తీసుకువచ్చి నియోజకవర్గంలోని ప్రతి ఎకరాకు సాగునీరు అందేలా చూస్తానని స్పష్టం చేశారు. ప్రతిపక్ష పార్టీలు వంటా వార్పు మాటలతో ప్రభుత్వంపై బురదజల్లే ప్రయత్నాలు చేస్తున్నాయని, వాటిని ప్రజలు నమ్మవద్దని, ప్రభుత్వ పథకాలు గ్రామంలోని ప్రతి గడపకు తెలిసే విధంగా పార్టీ కార్యకర్తలు కృషి చేయాలని పిలుపునిచ్చారు. ఈ కార్యక్రమంలో మున్సిపల్ చైర్మన్ దొడ్డ కిరణ్ మిత్ర డానియల్, మార్కెట్ కమిటీ చైర్మన్ బానోతు రాంబాబు, ఆత్మ కమిటీ చైర్మన్ బోడా మంగీలాల్, మడుగు సాంబమూర్తి, ఐదు మండల కాంగ్రెస్ అధ్యక్షులు, పట్టణ అధ్యక్షుడు బోళ్ళ సూర్యం, మున్సిపల్22వ వార్డ్ కౌన్సిలర్ కొర్లపాటి శివ కిరణ్, పూనం సురేందర్, కౌన్సిలర్లు, సర్పంచులు తదితరులు పాల్గొన్నారు.

# ఓటర్లందరూ తుది జాబితాలో వుండే లక్ష్యంగా చర్యలు

## ఎస్ఐఆర్ ప్రక్రియపై రాజకీయ పార్టీల ప్రతినిధులతో జిల్లా కలెక్టర్ దివాకర టిఎస్ సమావేశం



**ఖమ్మం, సెప్టెంబర్ 5 (పీపుల్స్ డైరీ) :** ముసాయిదా ఓటర్ల జాబితా లో ఉన్న ఓటర్లందరూ తమ ఓటు హక్కు పొందేలా చర్యలు చేపట్టాలని జిల్లా కలెక్టర్ దివాకర టిఎస్ తెలిపారు. జిల్లా కలెక్టర్, ఇఆర్ఓ లతో కలిసి శనివారం కలెక్టరేట్ కాన్ఫరెన్స్ హాల్లో రాజకీయ పార్టీల ప్రతినిధులతో ఎస్ఐఆర్ ప్రక్రియ, నోటీసుల జారీలపై సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ముసాయిదా ఓటర్ల జాబితాలో గుర్తించిన అనామలీస్, మ్యాపింగ్ లేని ఓటర్ల వివరాలు, క్లెయిమ్‌లు, అభ్యంతరాల స్వీకరణ, పరిష్కార ప్రక్రియపై రాజకీయ పార్టీల ప్రతినిధులకు వివరించారు. ఈ సందర్భంగా జిల్లా కలెక్టర్ దివాకర టిఎస్ మాట్లాడుతూ... భారత ఎన్నికల సంఘం షెడ్యూల్ ప్రకారం ఆగస్టు 17న ఎస్ఐఆర్ ముసాయిదా ఓటర్ల జాబితా విడుదల చేసినట్లు, మ్యాపింగ్ లేని, అనామాలీస్ ఓటర్లకు నోటీసుల జారీ ప్రక్రియ చేపట్టినట్లు తెలిపారు. ఖమ్మం జిల్లాలో మొత్తం 10,85,927 మంది ఓటర్లతో ముసాయిదా ఓటర్ల జాబితా విడుదలైందని, ఇందులో 1,75,858 మంది మ్యాపింగ్ కాని, అనామలీస్ ఓటర్లకు నోటీసులు జారీచేయనుండగా, ఇప్పటివరకు 1,75,841 నోటీసులు జనరేట్ చేసి, 1,32,817 మందికి నోటీ సులు అందజేశామన్నారు.

### నోటీసులు అందుకున్న వారు సంబంధిత పత్రాలు సమర్పించాలి

నోటీసులు అందుకున్న ఓటర్లు తమ పుట్టిన తేదీ ఆధారంగా భారత ఎన్నికల సంఘం సూచించిన పత్రాల్లో సంబంధిత పత్రాలను సమర్పించాలని కలెక్టర్ తెలిపారు. పేర్ల అసంబద్ధత వున్న వారు ధృవీకరణలు సమర్పిం చకున్న, సంబంధిత బూత్ లెవల్ అధికారులు పంచనామా చేసి ధృవీకరిస్తారన్నారు.

### అర్హులైన కొత్త ఓటర్లు నమోదు చేసుకోవచ్చు

ప్రస్తుతం కూడా అర్హులైన వారు కొత్త ఓటరుగా నమోదు చేసుకునే అవకాశం ఉందని జిల్లా కలెక్టర్ తెలిపారు. 2026 అక్టోబరు 1 నాటికి 18 సంవత్సరాలు నిండిన వారు, ఏ శాసనసభ నియోజక వర్గంలోనూ ఓటరుగా నమోదు కాకపోతే ఫారమ్-6 ద్వారా తాజా ఫొటో, వయస్సు ధృవీకరణ పత్రం, డిక్లరేషన్ తదితరాలను జతచేసి దరఖాస్తు చేసుకోవచ్చని తెలిపారు.

### అక్టోబర్ 19న తుది ఓటర్ల జాబితా


ఎస్ఐఆర్ ప్రక్రియలో భాగంగా తుది ఓటర్ల జాబితాను అక్టోబర్ 19, 2026న ప్రచురించనున్నట్లు జిల్లా కలెక్టర్ తెలిపారు. రాజకీయ పార్టీల ప్రతినిధులు తమ పరిధిలోని ఓటర్లకు ఎస్ఐఆర్ ప్రక్రియపై అవగాహన కల్పించాలని, అర్హులైన ప్రతి ఒక్కరూ ఓటరుగా తుది జాబితాలో నమోదు అయ్యేలా సహకరించాలని సూచించారు. అలాగే టోల్‌ఫ్రీ 1950కు ఫోన్ చేయవచ్చని కలెక్టర్ తెలిపారు. ఈ సమావేశంలో మునిసిపల్ కమిషనర్ అభిషేక్ అగస్త్య, కల్లూరు సబ్ కలెక్టర్ అజయ్ యాదవ్, ఎస్డిసి సదానందం, ఖమ్మం ఆర్డీఓ శ్రీనివాస్, కలెక్టరేట్ ఎన్నికల విభాగం పర్యవేక్షకులు రాజు, డిటి అన్సారీ, బీ.ఆర్.ఎస్. పార్టీ ప్రతినిధి ఎం.రమేష్, బీజేపీ ప్రతినిధి వి.రాజేష్, సిపిఐ(ఎం) ప్రతినిధి డి.తిరుపతి రావు, ఆమ్ ఆద్మీ పార్టీ ప్రతినిధి స్వర్ణ సుబ్బారావు, కాంగ్రెస్ పార్టీ ప్రతినిధి ఏ.గోపాల రావు, సంబంధిత అధికారులు, తదితరులు పాల్గొన్నారు.

## బొడ్రాయి, ముత్యాలమ్మ తల్లి ప్రతిష్ఠా మహోత్సవం



**ఇల్లందు (భద్రాద్రి కొత్తగూడెం) సెప్టెంబర్ 5 (పీపుల్స్ డైరీ) :** ఇల్లందు మండలం సుభాష్‌నగర్ గ్రామపంచాయతీలో నూతనంగా ప్రతిష్ఠిస్తున్న బొడ్రాయి (నాభిశిల), ముత్యాలమ్మ తల్లి అమ్మవార్ల ప్రతిష్ఠా మహోత్సవంలో ఇల్లందు ఎమ్మెల్యే కోరం కనకయ్య, రాజ్యసభ సభ్యుడు వద్దిరాజు రవిచంద్ర పాల్గొన్నారు. గ్రామ ప్రజల ఆహ్వానం మేరకు ఎమ్మెల్యే కోరం కనకయ్య కుటుంబ సమేతంగా హాజరై ప్రత్యేక పూజా కార్యక్రమాలు నిర్వహించారు. ఈ సందర్భంగా ఆలయ కమిటీ సభ్యులు, అర్చకులు ఎమ్మెల్యే దంపతులకు పూర్ణకుంభంతో ఘన స్వాగతం పలికారు. అనంతరం ఆలయ కమిటీ ఆధ్వర్యంలో భక్తుల కోసం ఏర్పాటు చేసిన అన్నప్రసాద వితరణను ఎమ్మెల్యే కోరం కనకయ్య దంపతులు ప్రారంభించారు. భక్తులు పెద్ద సంఖ్యలో పాల్గొని అమ్మవార్లను దర్శించుకుని ప్రత్యేక పూజలు నిర్వహించారు. కార్యక్రమంలో ఇల్లందు మార్కెట్ చైర్మన్ బానోత్ రాంబాబు, స్థానిక సర్పంచ్ వల్లాల మంగమ్మ--నర్సయ్య, నాయకులు వడియాల చిట్టిబాబు, రాంచంద్రు, అల్లాడి నర్సింహరావు, సొసైటీ డైరెక్టర్ కునుసోత్ రాము, మాజీ ఎంపీటీసీ పూనెం సురేందర్, తాటి భిక్షం, వడ్ల శ్రీను, దండుగుల శివ పాల్గొన్నారు.

## కులాంతర వివాహానికి ఆదర్శంగా గోపి, మంజుల దంపతులు



**ఖమ్మం, సెప్టెంబర్ 5 (పీపుల్స్ డైరీ) :** సామాజిక సమానత్వం, సామరస్యానికి ప్రతీకగా నిలిచే అంతర్‌కుల వివాహాలు యువతకు ఆదర్శంగా నిలుస్తున్నాయని పలువురు అభిప్రాయపడ్డారు. ఖమ్మం జిల్లా బోనకల్ మండలం గార్లపాడు గ్రామానికి చెందిన తొండపు వెంకటేశ్వర్లు--అరుణ దంపతుల ఏకైక కుమారుడు తొండపు గోపి, మహబూబాబాద్ జిల్లా మరిపెడ మండలం సోమల తండాకు చెందిన దేవసోత్ శంకర్--శారద దంపతుల కుమార్తె మంజుల వివాహం శనివారం గార్లపాడులోని శ్రీ వేణుగోపాలస్వామి ఆలయంలో ఘనంగా జరిగింది. వివాహ వేడుకకు ఇరు కుటుంబాలకు చెందిన బంధుమిత్రులు, గ్రామ పెద్దలు హాజరై నూతన వధూవరులను ఆశీర్వదించారు. కుల, మత భేదాలకు అతీతంగా సామాజిక ఐక్యతను పెంపొందించే ఇటువంటి వివాహాలు సమాజానికి ఆదర్శంగా నిలుస్తాయని వారు పేర్కొన్నారు.

## జాతీయ లోక్ అదాలత్‌ను సద్వినియోగం చేసుకోవాలి

### అడిషనల్ డీసీపీ



**ఖమ్మం, సెప్టెంబర్ 5 (పీపుల్స్ డైరీ) :** ఈ నెల 12 న జరిగే జాతీయ లోక్ అదాలత్ ద్వారా పెండింగ్‌లో ఉన్న రాజీ పడదగిన కేసులను త్వరితగతిన పరిష్కరించుకునేలా కక్షిదారులకు అవగాహన కల్పిస్తూ, సంబంధిత అధికారులతో సమన్వయం చేయాలని అడిషనల్ డీసీపీ రామానుజం అధికారులను ఆదేశించారు. కోర్టు డ్యూటీ ఆఫీసర్స్, టెక్నీకల్ టీమ్‌తో నిర్వహించిన వీడియో కాన్ఫిరెన్స్‌లో అడిషనల్ డీసీపీ మాట్లాడుతూ...పెండింగ్ కేసుల వివరాలను పరిశీలించి, లోక్ అదాలత్ ద్వారా పరిష్కరించుకునే అవకాశం ఉన్న కేసులను గుర్తించాలని సూచించారు. సంబంధిత కక్షిదారులను సంప్రదించి, జాతీయ లోక్ అదాలత్ ద్వారా కేసుల పరిష్కారం వల్ల కలిగే ప్రయోజనాలను వివరించాలని తెలిపారు. కేసుల పరిష్కారంలో పోలీస్ అధికారులు, కోర్టు సిబ్బంది, పబ్లిక్ ప్రాసిక్యూటర్లు, కక్షిదారుల మధ్య సమన్వయం ఉండేలా చర్యలు చేపట్టాలని సూచించారు. చిన్నచిన్న వివాదాలు, రాజీ పడదగిన కేసులు సత్వరమే పరిష్కారమయ్యేలా ప్రత్యేక దృష్టి సారించాలని తెలిపారు. జాతీయ లోక్ అదాలత్‌ను సద్వినియోగం చేసుకోవడం ద్వారా కక్షిదారులకు సమయం, ఖర్చు ఆదా కావడంతో పాటు సత్వర న్యాయం అందుతుందని అడిషనల్ డీసీపీ పేర్కొన్నారు. లోక్ అదాలత్‌ను విజయవంతం చేసేందుకు అధికారులు సమన్వయంతో పనిచేయాలని ఆదేశించారు.

## మిషన్ భగీరథ గుంతలో ఇరుక్కున్న లారీ





### ప్రమాదం తప్పడంతో ఊపిరిపీల్చుకున్న స్థానికులు

**ఇల్లందు, సెప్టెంబర్ 5 (పీపుల్స్ డైరీ) :** ఇల్లందు పట్టణంలో మిషన్ భగీరథ పైప్‌లైన్ లీకేజీల మరమ్మతుల అనంతరం గుంతలను నామమాత్రంగా పూడ్చడంతో వాహనదారులు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు. తాజాగా ఇసుక లోడుతో వెళ్తున్న లారీ రోడ్డు పక్కన తవ్విన గుంతలో వెనుక చక్రాలు కుంగిపోవడంతో ఇరుక్కుపోయింది. ఈ ఘటనలో లారీకి స్వల్ప నష్టం వాటిల్లగా, అదృష్ట వశాత్తు ఎలాంటి ప్రాణాపాయం జరగలేదు. అనంతరం జేసీబీ సహాయంతో లారీని గుంతలో నుంచి బయటకు తీశారు. మిషన్ భగీరథ పనుల్లో నాణ్యతా ప్రమాణాలు పాటించకుండా గుంతలను సరిగా పూడ్చడం లేదని పట్టణ ప్రజలు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. లీకేజీల మరమ్మతుల అనంత రం గుంతలను పటిష్టంగా పూడ్చి, వాహనదారుల కు ప్రమాదాలు జరగకుండా అధికారులు తక్షణ చర్యలు చేపట్టాలని కోరుతున్నారు.

## ఉరి వేసుకుని యువకుడి ఆత్మహత్య



**చిట్యాల, సెప్టెంబర్ 5 (పీపుల్స్ డైరీ) :** చిట్యాల మండల పరిధిలోని పాసిగడ్డ తండాకు చెందిన భూక్య తిరుపతి అలియాస్ సురేష్ అనే యువకుడు ఇంట్లో ఉరివేసుకుని ఆత్మహత్య చేసుకున్న సంఘటనపై కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు చిట్యాల ఎస్ఐ పోచంపల్లి సతీష్ శనివారం ఒక ప్రకటనలో తెలిపారు. పోలీసులు మరియు మృతుని బంధువులు తెలిపిన వివరాల ప్రకారం పాసిగడ్డ తండాకు చెందిన భూక్య తిరుపతి తల్లిదండ్రులు సుమారు ఎనిమిది సంవత్సరాల క్రితమే మృతి చెందారు. దీంతో తిరుపతి తన చదువును ఆపేసి కూలీ పనులు చేసుకుంటూ తన ఇద్దరు తమ్ముళ్లు ఒక చెల్లెలి బాగోగులు చూసుకుంటూ కుటుంబాన్ని పోషిస్తున్నాడు. తల్లిదండ్రులు లేకపోవడం, తోబుట్టువుల పోషణ భారం కావడంతో తీవ్ర మనస్తాపానికి గురైన తిరుపతి జీవితంపై విరక్తి చెందాడు. ఈ క్రమంలో శుక్రవారం సాయంత్రం సుమారు 7 గంటల సమయంలో తన ఇంట్లోని ఐరన్ పైపుకు నైలాన్ తాడుతో ఉరివేసుకుని ఆత్మహత్య చేసుకున్నాడు. స్థానికులు గమనించి కిందికి దించేలోపే అతను మృతి చెందాడు. ఈ ఘటనపై మృతుని కుటుంబసభ్యుడు భూక్య రమేష్ ఇచ్చిన ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసుకుని దర్యాప్తు ప్రారంభించినట్లు, మృతదేహాన్ని పంచనామా నిమిత్తం తరలించినట్లు ఎస్ఐ సతీష్ తెలిపారు.

## కస్తూరిబాలో దరఖాస్తుల ఆహ్వానం

**గోవిందరావుపేట, సెప్టెంబర్ 5 (పీపుల్స్ డైరీ) :** మండల పరిధి చల్వాయి కస్తూరిబా పాఠశాలలో ఖాళీ పోస్టులకు ఈనెల 10వ తేదీ వరకు దరఖాస్తులు స్వీకరించడం జరుగుతుందని మండల విద్యాశాఖ అధికారి గొంది దివాకర్ ఒక ప్రకటనలో పేర్కొన్నారు, పోస్టులకు దరఖాస్తు చేసుకునే అభ్యర్థులు ఆన్లైన్లో దరఖాస్తు చేసుకోవాలని ఆయన అన్నారు.

## గణేష్ ఉత్సవాలు, నిమజ్జనం ప్రశాంతంగా నిర్వహించేందుకు పటిష్ట బందోబస్తు

### వీడియో కాన్ఫిరెన్స్ లో పోలీస్ కమిషనర్ సునీల్ దత్

**ఖమ్మం, సెప్టెంబర్ 5 (పీపుల్స్ డైరీ) :** రానున్న గణేష్ నవరాత్రి ఉత్సవాలు, గణేష్ విగ్రహాల నిమజ్జనం సందర్భంగా ఎలాంటి అవాంఛనీయ సంఘటనలకు తావులేకుండా పటిష్టమైన భద్రతా ఏర్పాట్లు చేపట్టాలని పోలీస్ కమిషనర్ సునీల్ దత్ పోలీస్ అధికారులను ఆదేశించారు. శనివారం పోలీస్ అధికారులతో నిర్వహించిన వీడియో కాన్ఫిరెన్స్‌లో పోలీస్ కమిషనర్ మాట్లాడుతూ... గణేష్ ఉత్సవాల సందర్భంగా గణేష్ మండపాల నిర్వాహకులతో సమన్వయం చేసుకుని ముందస్తు ప్రణాళిక రూపొందించాలని, ప్రతి మండపం వద్ద భద్రతా చర్యలను పర్యవేక్షించాలని సూచించారు. నిమజ్జన మార్గాలు, నిమజ్జన ప్రదేశాలను ముందుగానే పరిశీలించి ట్రాఫిక్ నియంత్రణకు ప్రత్యేక చర్యలు చేపట్టాలని తెలిపారు. నిమజ్జనం సందర్భంగా భారీగా భక్తులు తరలివచ్చే అవకాశం ఉన్నందున రద్దీ ప్రాంతాల్లో తగినంత పోలీస్ బందోబస్తు ఏర్పాటు చేయాలని, ట్రాఫిక్‌కు అంతరాయం కలగకుండా ప్రత్యామ్నాయ మార్గాలను సిద్ధం చేయాలని సూచించారు.



విగ్రహాల ఊరేగింపులో డీజేలు, అధిక శబ్దం, రెచ్చగొట్టే నినాదాలు, మద్యం సేవించి పాల్గొనడం వంటి వాటిపై నిఘా ఉంచాలన్నారు. గణేష్ ఉత్సవాలను శాంతియుత వాతావరణంలో నిర్వహించేందుకు ప్రజలు, ఉత్సవ కమిటీలు, పోలీస్ శాఖకు సహకరించాలని పోలీస్ కమిషనర్ కోరారు. శాంతిభద్రతల పరిరక్షణతో పాటు ప్రజల భద్రతకు అత్యంత ప్రాధాన్యత ఇవ్వాలని అధికారులకు సూచించారు. గణేష్ ఉత్సవ కమిటీలు, గణేష్ మండపాల నిర్వాహకులతో వేరువేరుగా సమన్వయ సమావేశాలు నిర్వహించాలని పోలీస్ అధికారులకు సూచించారు. రౌడీషీటర్ల కదలికలపై నిరంతరం నిఘా ఉంచాలని, శాంతిభద్రతలకు విఘాతం కలిగించే అవకాశం ఉన్న వ్యక్తులపై ముందస్తు చర్యలు చేపట్టాలని పోలీస్ కమిషనర్ పోలీస్ అధికారులను ఆదేశించారు. రౌడీషీటర్ల ప్రస్తుత కార్యకలాపాలు, కదలికలు, వారి పరిచయాలు, వివాదాలకు సంబంధించిన అంశాలపై స్థానిక పోలీస్ అధికారులు ఎప్పటికప్పుడు సమాచారం సేకరించాలని సూచించారు. పండుగలు, ఉత్సవాలు, ముఖ్యమైన కార్యక్రమాల సందర్భంగా ప్రత్యేక నిఘా ఏర్పాటు చేయాలని, రౌడీషీటర్ల కదలికలను పర్యవేక్షిస్తూ ఎలాంటి అవాంఛనీయ సంఘటనలు చోటుచేసుకోకుండా ముందస్తు చర్యలు చేపట్టాలని ఆదేశించారు. ప్రజలకు ఇబ్బందులు కలిగించే విధంగా ప్రవర్తించే వారిని ఉపేక్షించకుండా చట్ట ప్రకారం కఠిన చర్యలు తీసుకోవాలని పోలీస్ కమిషనర్ స్పష్టం చేశారు.

## ప్రజా సంక్షేమమే కాంగ్రెస్ ప్రభుత్వ ధ్యేయం : పరికిపల్లి



**ఖమ్మం, సెప్టెంబర్ 5 (పీపుల్స్ డైరీ) :** కొణిజర్ల మండల కేంద్రంలో విలేకరుల సమావేశం లో మాట్లాడుతూ... ప్రజా సంక్షేమమే లక్ష్యంగా ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి ఆధ్వర్యంలో కాంగ్రెస్ ప్రభుత్వం పనిచేస్తుందని ఖమ్మం జిల్లా కాంగ్రెస్ నాయకులు పరికపల్లి శ్రీనివాస్ గౌడ్ తెలిపారు. కాంగ్రెస్ ప్రభుత్వం 1000 రోజుల సంక్షేమ పాలన పూర్తి చేసుకున్న సందర్భంగా ఆయన మాట్లాడుతూ... తెలంగాణ రాష్ట్రంలో 25 లక్షల మంది రైతులకు రూ.2 లక్షల లోపు రుణమాఫీ చేయడంతో పాటు ఇందిరమ్మ ఇళ్లు, రేషన్ కార్డులు, రెండు వందల ఉచిత విద్యుత్, పింఛన్లు వంటి సంక్షేమ పథకాలను అమలు చేస్తున్నామని తెలిపారు. ఇవి ప్రజా పాలనకు నిదర్శనమన్నారు. గత పదేళ్లు రాష్ట్రాన్ని పాలించిన బీఆర్ఎస్ ప్రభుత్వం భారీగా అప్పులు చేసి తెలంగాణను అప్పుల ఊబిలోకి నెట్టిందని విమర్శించారు. కాంగ్రెస్ ప్రభుత్వం చేపడుతున్న అభివృద్ధి, సంక్షేమ కార్యక్రమాలను చూసి బీఆర్ఎస్ నాయకులు ఓర్వలేక విమర్శలు చేస్తున్నారని వారు అన్నారు. వైరా నియోజకవర్గ ఎమ్మెల్యే మాలోత్ రాందాస్ నాయక్ ప్రజలకు అందుబాటులో ఉంటూ సంక్షేమం కోసం కృషి చేస్తున్నారని తెలిపా రు. రాబోయే రోజుల్లో కాంగ్రెస్ ప్రభుత్వం మరింత బలోపేతం కావడం ఖాయమని ధీమా వ్యక్తం చేశారు. ధర్నాలు, రాస్తారోకోల పేరుతో ప్రజలను ఇబ్బందులకు గురిచేయడం సరికాదని, ప్రజలు అన్నింటినీ గమనిస్తున్నారని పేర్కొన్నారు. ఇకనైనా ప్రతిపక్షాలు ఇటువంటి దుష్ప్రచారాలను మానుకోవాలని వారు అన్నారు.

## హామీల అమలులో కాంగ్రెస్ ప్రభుత్వం విఫలం

**ఇల్లందు (భద్రాద్రి కొత్తగూడెం) సెప్టెంబర్ 5 (పీపుల్స్ డైరీ) :** కాంగ్రెస్ ప్రభుత్వం వెయ్యి రోజుల పాలనలో చేసిన వైఫల్యాలను, యువతకు ఇచ్చిన హామీల అమలులో జరిగిన మోసాన్ని ప్రజల్లోకి తీసుకెళ్లేం దుకు బీఆర్ఎస్ పార్టీ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్ దిశానిర్దేశం మేరకు ఇల్లందు నియోజక వర్గంలో "విద్యార్థి, యువ పోరుబాట" కార్యక్రమాన్ని నిర్వహించారు. నియోజకవర్గ బీఆర్ఎస్ పార్టీ ఇన్‌చార్జి, మాజీ ఎమ్మెల్యే బానోత్ హరిప్రియ నాయక్ ఆధ్వర్యంలో ఇల్లందు పట్టణంలో విద్యార్థులు, నిరుద్యోగ యువత, మహిళలు, బీఆర్ఎస్ నాయకు లు, కార్యకర్తలతో భారీ ర్యాలీ నిర్వహించారు. ఈ సందర్భంగా హరిప్రియ నాయక్, భద్రాద్రి కొత్తగూడెం జిల్లా మాజీ గ్రంథాలయ సంస్థ చైర్మన్ దిండిగల రాజేందర్ మాట్లాడుతూ కాంగ్రెస్ ప్రభుత్వం విద్యార్థులు, యువతకు ఇచ్చిన హామీలను వెంటనే అమలు చేయాలని డిమాండ్ చేశారు. ముఖ్యంగా ఫీజు రీయింబర్స్‌మెంట్‌ను తక్షణమే అమలు చేయాలని, జాబ్ క్యాలెండర్‌ను విడుదల చేయాలని, యూత్ డిక్లరేషన్‌లో ఇచ్చిన హామీలను నెరవేర్చాలని ప్రభుత్వాన్ని కోరారు. యువతకు విస్తృతంగా ఉపాధి అవకాశాలు కల్పించడంతో పాటు విద్యార్థుల సమస్యలను పరిష్కరించేందుకు ప్రభుత్వం తక్షణ చర్యలు చేపట్టాలని వారు డిమాండ్ చేశారు. హామీల అమలులో ప్రభుత్వం నిర్లక్ష్యం చేస్తే యువత, విద్యార్థుల తరపున బీఆర్ఎస్ పార్టీ పోరాటాన్ని మరింత ఉధృతం చేస్తుందని పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో మహబూబాబాద్ జిల్లా మాజీ జిల్లా పరిషత్ చైర్మన్ ఆంగోత్ బిందు, ఎస్ రంగనాథ్, శీలం రమేష్, రవితేజ, రాచపల్లి శ్రీను, బీఆర్ఎస్ నాయకులు, కార్యకర్తలు, విద్యార్థినీ విద్యార్థులు, యువతీ యువకులు, మహిళలు తదితరులు పాల్గొన్నారు.





EDITED, PRINTED, PUBLISHED AND OWNED BY **KONDAPARTHI KIRAN,** PRINTED AT RATNA GRAPHICS, 2-3-703/7, THIRUMALA NAGAR COLONY, OPP : POLICE LINE, AMBERPET, HYDERABAD, TELANGANA - 500013, PUBLISHED AT H.NO. 3-4-396, NEW RAYAPURA, HANAMKONDA, WARANGAL, TELANGANA - 506001.
**EDITOR : KONDAPARTHI KIRAN.RNI NO: TEL/TEL/2009/28544, CELL:9493019044,** e-mail : peoplesdairydaily@gmail.com